తర తరాల పిల్లల కథలు
రూ॥ 70/-
పేజీలు: 64
నవచేతన పబ్లిషింగ్ హౌస్

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

ట్రేడ్‌వార్‌లో ట్రంప్‌ను
## దెబ్బకు దెబ్బతీసిన చైనా
ఆమెరికా కార్గోపై అదనపు సుంకాలు
ప్రపంచ వాణిజ్య సంస్థకు ఫిర్యాదు
కెనడా, మెక్సికోలకు తాత్కాలిక ఉపశమనం
లోపలి పేజీల్లో

సంపుటి 27, సంచిక: 227 | బుధవారం | 05-02-2025 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00

## తెలంగాణ శాసనసభ వేదికగా
# చరిత్రాత్మక నిర్ణయాలు

ఎస్‌సి వర్గీకరణ, కులగణన నా రాజకీయ జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన అంశాలు. 'ఫిబ్రవరి 4, 2025 నా రాజకీయ జీవితంలో ప్రత్యేకంగా గుర్తుండి పోతుంది. చరిత్రలో నాకంటూ ఓ పేజీ ఉంటుంది' ఎందరో ముఖ్యమంత్రులకు రాని అవకాశం నాకు వచ్చింది. ఎందరో రాజకీయ పార్టీలు ఎస్‌సి వర్గీకరణ అంశాన్ని ఓటు బ్యాంకుగా చూశాయి. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే ప్రయత్నం చేయలేదు. అందుకే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడం ద్వారా సమాజంలో తరతరాలుగా నిర్లక్ష్యానికి, దోపిడీకి గురైన వారికి న్యాయం చేయాలని సంకల్పించాం.

- సిఎం రేవంత్‌రెడ్డి



ఇంటింటి కుటుంబ సర్వేకు
## అసెంబ్లీ ఆమోదం
- దేశవ్యాప్తంగా కులగణన చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి
- శాసనసభ ప్రత్యేక సమావేశంలో తీర్మానం

ప్రజాపక్షం/హైదరాబాద్

"తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వేకు తెలంగాణ శాసనసభ ఆమోదించింది. దేశవ్యాప్తంగా కుల గణన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు మంగళవారం శాసనసభ ప్రత్యేక సమావేశంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. "తెలంగాణ ప్రభుత్వం సమగ్ర ఇంటింటి సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్యా, రాజకీయ, కుల సర్వేను నిర్వహించింది. ఈ సర్వే రాష్ట్రంలోని వివిధ కులాల సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి మరియు రాజకీయ స్థితిగతులను వెలుగులోకి తెచ్చింది. తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిన తరగతులు (బిసి), షెడ్యూల్ కులాలు (ఎస్‌సి),

తరువాయి 2లో

## కులగణన సర్వే, ఎస్‌సి వర్గీకరణకు అసెంబ్లీ ఆమోదం
- సమాజాభివృద్ధికి సకుటుంబ సర్వే నివేదిక దిక్సూచి, ఒక మోడల్ డాక్యుమెంట్
- బలహీనవర్గాలు, మైనార్టీల ఆకాంక్షలకు అనుగుణంగా పకడ్బందీగా సర్వే పూర్తి
- శాసనసభ ప్రత్యేక సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

"తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే–2024) దేశంలోనే ఒక చరిత్రాత్మకమైన నిర్ణయం. సమాజ అభివృద్ధికి ఈ నివేదిక ఒక దిక్సూచిలా, ఒక మాడల్ డాక్యుమెంట్‌గా మారుతుంది. సమాజంలో మా లెక్కలు తేల్చాలని ఏడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న బలహీనవర్గాలు, మైనారిటీల ఆకాంక్షలకు అనుగుణంగా పకడ్బందీ ప్రణాళికతో ఏడాది కాలంలో సర్వేను విజయవంతంగా పూర్తి చేశాం. రాష్ట్రంలో అమలు చేయనున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలకు ఈ నివేదిక ప్రాతిపదికగా పనిచేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం" అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శాసనసభలో ప్రకటించారు. శాసనసభ ప్రత్యేక సమావేశంలో మంగళవారం

తరువాయి 2లో

## సర్వే నివేదికలోని లెక్కలు

మొత్తం సర్వే చేసిన కుటుంబాల సంఖ్య : 1,12,15,134 (96.9%)
(గ్రామీణ ప్రాంతాలలో 66,99,602 కుటుంబాలు
నగర ప్రాంతాలలో 45,15,532 కుటుంబాలు)
సర్వేలో పాల్గొన్న వారి సంఖ్య : 3,54,77,554 మంది
గుర్తించిన గృహాలు : 1,15,71,457
సర్వే చేసిన గృహాలు : 1,12,15,134
సర్వేలో పాల్గొనని కుటుంబాల సంఖ్య : 3,56,323
( ఇందులో ఎక్కువగా సర్వేలో పాల్గొనని కుటుంబాలు జిహెచ్‌ఎంసి-ఇతర నగర ప్రాంతాలు)
ఎస్‌సిలు : 61,84,319 మంది (17.43%)
ఎస్‌టి : 37,05,929 మంది (10.45%)
బిసి : (ముస్లిం మైనారిటీ మినహా) 1,64,09,179 మంది (46.25%)
ముస్లిం మైనారిటీలు 44,57,012 మంది (12.56%)
ముస్లిం మైనారిటీలలో బిసిలు 35,76,588 మంది (10.08%)
ముస్లిం మైనారిటీలలో ఒసిలు 8,80,424 మంది (2.48%)
ఒసిలు : 56,01,539 మంది (15.79%)
ఒసిలలో ముస్లిం మైనారిటీలు: 8,80,424 మంది ( 2.48%)
ముస్లిం మైనారిటీ మినహా ఒసిలు మొత్తం 47,21,115 మంది (13.31%)

## బిలియనీర్లపై 4 శాతం సంపద పన్ను
- బడ్జెట్‌కు వామపక్షాల ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు
- 14 నుండి 20 వరకూ దేశవ్యాప్త ప్రచారం
- ఈ ప్రతిపాదనలను బడ్జెట్‌లో చేర్చాలి
- ఇంటింటికీ ఈ ప్రతిపాదనలు చేరాలని ఐదు వామపక్షాల సంయుక్త పిలుపు




**న్యూఢిల్లీ :** దేశంలో బిలియనీర్లపై (100 కోట్ల డాలర్లు, అంతకుపైబడిన సంపన్నులు) నాలుగుశాతం సంపద పన్ను విధించాలని, కార్పొరేట్ పన్ను పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని వామపక్షాలు డిమాండ్ చేశాయి. కేంద్ర ప్రభుత్వం ఈనెల ఒకటోతేదీన లోక్‌సభలో ప్రవేశపెట్టిన 2025–26 పెట్టుబడిదారీ అనుకూల బడ్జెట్‌కు వామపక్షాలు ఎనిమిది ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు చేశాయి. ఈ ఎనిమిది ప్రత్యామ్నాయ ప్రతిపాదనలనూ బడ్జెట్‌లో చేర్చాలని కేంద్రాన్ని కోరాయి. వీటిని దేశవ్యాప్తంగా ఇంటింటికీ చేరేవిధంగా ఈనెల 14 నుండి 20వ తేదీవరకూ వారంరోజులపాటు జనబాహుళ్యంలో సామూహిక ప్రచార కార్యక్రమం చేపట్టాలని, ప్రదర్శనలు,ర్యాలీలు, వీధిచివరి సమావేశాలు జరపాలని ఐదు వామపక్షాలూ పార్టీ శాఖలకు పిలుపు ఇచ్చాయి. భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ), సిపిఐ(ఎం), సిపిఐ(మార్క్సిస్టు–లెనినిస్టు) లిబరేషన్, రివల్యూషనరీ సోషలిస్టుపార్టీ (ఆర్‌ఎస్‌పి),అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్(ఎఐఎఫ్‌బి)పార్టీలు ఈనెల

తరువాయి 2లో

## నమోదుకాని వారి వివరాలు సేకరించాలి
- కుల గణన సర్వేపై ఆరోపణలు; దిద్దుబాటుకు గ్రామ సభలు ఏర్పాటు
- బిసిల రిజర్వేషన్లపై స్పష్టతనివ్వాలి
- అసెంబ్లీ చర్చలో సిపిఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్



'సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే–2024' వివరాలను అసెంబ్లీ ముందు పెట్టినప్పటికీ స్థానిక సంస్థలలో వెనుకబడిన తరగతుల (బిసి) రిజర్వేషన్ల అమలుకు సంబంధించి ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు

తరువాయి 12లో

## గ్రూపుల వారీగా ఎస్‌సి వర్గీకరణ వివరాలు

| కేటగిరి | గ్రూప్ పేరు | కులాల సంఖ్య | జనాభాలో శాతం (2011 జనాభా లెక్కల ప్రకారం) | సిఫారసు చేసిన రిజర్వేషన్ శాతం |
|---|---|---|---|---|
| గ్రూప్ - I | సామాజికంగా, ఆర్థికంగా మరియు విద్యాపరంగా అత్యంత వెనుకబడిన/ పట్టించుకోని షెడ్యూల్డ్ కులాలు | 15 | 3.288 | 1 |
| గ్రూప్ - II | మధ్యస్థంగా లబ్ధి పొందిన షెడ్యూల్డ్ కులాలు | 18 | 62.748 | 9 |
| గ్రూప్ - III | మెరుగైన ప్రయోజనం పొందిన షెడ్యూల్డ్ కులాలు | 26 | 33.963 | 5 |
| మొత్తం | | 59 | 100 | 15 |



ఏకసభ్య కమిషన్ సిఫారసుల్లో
## మూడింటికి ఓకే
- క్రీమీలేయర్ ప్రతిపాదన తిరస్కరణ
- ఎస్‌సి ఉప కులాల వర్గీకరణతో సమస్యలకు శాశ్వత పరిష్కారం
- సుప్రీంకోర్టు తీర్పు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది
- షెడ్యూల్డ్ కులాల వర్గీకరణకు త్వరలో చట్టరూపమిస్తాం
- సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

షెడ్యూల్డు కులాల (ఎస్‌సి) వర్గీకరణకు సంబంధించి జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ సిఫార్సులను పరిశీలించిన ప్రభుత్వం వాటిల్లో మూడింటిని ఆమోదించడంతో పాటు క్రీమీ లేయర్ ప్రతిపాదనను తిరస్కరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శాసనసభలో ప్రకటించారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న ఎస్‌సి ఉప కులాల వర్గీకరణ సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిస్తోందని సిఎం చెప్పారు. ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని సిఎం స్పష్టం చేశారు. షెడ్యూల్డు కులాల వర్గీకరణకు త్వరలో చట్టం రూపంలో తీసుకువచ్చి సంపూర్ణంగా

తరువాయి 2లో



## చరిత్ర సృష్టించాం
- దేశంలోనే తొలిసారి పకడ్బందీగా కులగణన
- సుప్రీంకోర్టు, కమిషన్ సిఫార్సు ప్రకారమే ఎస్‌సి వర్గీకరణ
- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ
- సమగ్ర కులగణన, ఎస్‌సి వర్గీకరణ నివేదికలకు కేబినెట్ ఆమోదం

ప్రజాపక్షం/హైదరాబాద్

సమగ్ర కులగణన, ఎస్‌సి వర్గీకరణ నివేదికలకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ హాలులో మంగళవారం సుమారు రెండు గంటల పాటు కేబినెట్ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం అసెంబ్లీ లాబీలో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. దేశంలోనే మొదటిసారిగా కులగణన చేపట్టి తెలంగాణ రాష్ట్రం చరిత్ర సృష్టించిందని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పకడ్బందీగా సర్వే నిర్వహించి సమాచారం సేకరించామని తెలిపారు. కులగణన,

తరువాయి 2లో

ఢిల్లీలో నేడు
## ఎన్నికల యుద్ధం



- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- ఓటు వేయనున్న 1.56 కోట్ల మంది
- 70 నియోజకవర్గాల్లో 13,766 పోలింగ్ కేంద్రాలు
- 220 కంపెనీల పారామిలిటరీ దళాలు, 35,626 మంది ఢిల్లీ పోలీసు సిబ్బంది, 19,000 మంది హోమ్ గార్డుల మోహరింపు

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. హస్తినలో ఓట్ల పండుగకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. పోలింగ్ ప్రక్రియ బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుంది. 1.56 కోట్ల మందికిపైగా ఢిల్లీ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అధికార ఆప్, బిజెపి, కాంగ్రెస్ మధ్య హోరాహోరీగా పోటీ నెలకొంది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 699 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వీరి భవితవ్యాన్ని తేల్చేందుకు మొత్తం 70 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 13,766 పోలింగ్ కేంద్రాలలో ప్రజలు ఓట్లు వేయనున్నారు. హోమ్ ఓటింగ్ సౌకర్యం ద్వారా అర్హత కలిగిన 7,553 మంది ఓటర్లలో 6,980 మంది ఇప్పటికే

తరువాయి 12లో

ఎర్రజెండాలు ఏకమైతే
# తిరుగుండదు
- మావోయిస్టులతో సహా అన్ని వామపక్ష పార్టీలు పునరాలోచించాలి
- అంతరాలు లేని వర్గరహిత సమాజ నిర్మాణం కోసం పుట్టిందే సిపిఐ
- బిజెపిది మనువాద సిద్ధాంతం
- బడ్జెట్‌లో విభజన హామీలకు నయాపైసా కేటాయించలేదు
- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి
- జనగామలో సిపిఐ శతాబ్ది ఉత్సవాలు

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి

'ఎర్ర జెండాలు ఏకమైతే దేశంలో తిరుగుండదు. మావోయిస్టులతో సహా అన్ని ఎర్రజెండా పార్టీలు పునరాలోచించాలి. సిపిఐ ప్రతిపాదనను పరిగణలోకి తీసుకోవాలని' పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సిపిఐ జనగామ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఆ పార్టీ శత వార్సికోత్సవ సభ పట్టణంలోని కామాక్షి ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎంఎల్‌ఎ సిహెచ్ రాజారెడ్డి అధ్యక్షత వహించారు. అంతకు ముందు ప్రెస్టన్ మైదానం నుండి భారీ ర్యాలీ నిర్వయించారు. ర్యాలీలో చాడా వెంకట్‌రెడ్డి, తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, రాజారెడ్డితో పాటు

తరువాయి 12లో






చర్లపల్లిలోని రసాయనిక పరిశ్రమలో
## భారీ అగ్ని ప్రమాదం
- మరో మూడు పరిశ్రమలకు అంటుకున్న మంటలు
- కిలో మీటర్ల మేర వ్యాపించిన దట్టమైన పొగ
- రసాయనాల దుర్వాసనతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి

చర్లపల్లి పారిశ్రామిక వాడలోని ఓ రసాయన పరిశ్రమలో మంగళవారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఇక్కడ చెలరేగిన మంటలు పక్కనే ఉన్న మహాలక్ష్మి రబ్బర్ పరిశ్రమ, హరిత హైటెక్ పరిశ్రమతో పాటు మరో రెండు పరిశ్రమలకు

తరువాయి 2లో

గ్రామీణ ఉపాధి హామీ పథకంనుంచి
## 1.55 కోట్లమంది తొలగింపు
- పార్లమెంట్‌కు తెలిపిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పాశ్వాన్




**న్యూఢిల్లీ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నమోదైన వారిలో 1.55 కోట్ల మంది కార్మికులను 2022–2024 మధ్య తొలగించినట్టు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కమలేష్ పాశ్వాన్ మంగళవారం

తరువాయి 2లో

# ట్రేడ్‌వార్‌లో ట్రంప్‌ను దెబ్బకు దెబ్బతీసిన చైనా

## ఆమెరికా కార్గోపై అదనపు సుంకాలు
## ప్రపంచ వాణిజ్య సంస్థకు ఫిర్యాదు






**బీజింగ్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన ట్రేడ్ వార్‌లో చైనా ప్రతీఘాత చర్యలు చేపట్టింది. చైనా వాణిజ్యానికి సంబంధించిన రక్షణ చర్యలు తీసుకుంది. అమెరికా నుండి దిగుమతయ్యే కొన్ని సరుకులపై అదనపు సుంకాలు విధించింది. అదే విధంగా చైనాపై అమెరికా విధించిన 10 శాతం అదనపు సుంకాలు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమైనవని, దీనికి ఒక పరిష్కారం చేయాలని ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ)కు ఫిర్యాదు చేసింది. సుంకాలపెంపు ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది. అమెరికా విధించిన అదనపు సుంకాలు అమలులోకి వచ్చే చివరిక్షణం వరకూ సంయమనంతో వ్యవహరించిన చైనా టిట్–ఫర్–టాట్ విధానం అమలుచేసింది. ఫిబ్రవరి 1వ తేదీన చైనాపై ట్రంప్ అదనపు సుంకాలు విధించారు. ఈ విధంగా అమెరికా–చైనా మధ్య అదనపు సుంకాలు విధించుకోవడం ఇప్పుడు కొత్తకాదు. 2018లో ట్రంప్ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇదేవిధంగా సుంకాలపై ప్రతీఘాత చర్యలు కొనసాగాయి. అమెరికా నుండి చైనాకు వచ్చే ముడి చమురు, వ్యవసాయ యంత్రాలు, వెనుక సరుకులు తరలించడానికి వీలుగా ఉండే ఎన్‌క్లోజ్డ్ క్యాబిన్ ఉన్న పికప్ ట్రక్కులు, భారీ ట్రక్కులపై 10 శాతం అదనపు సుంకాలు విధించింది. బొగ్గు, లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్‌లపై 15 శాతం అదనపు సుంకాలను విధించింది. ఈనెల 10వ తేదీ నుండి ఈ ఉత్తర్వులు అమలులోకి వస్తాయి. చైనా చట్టాలు, అంతర్జాతీయ సూత్రాలకు అనుగుణంగా ఈ అదనపు సుంకాలు అమలు చేస్తున్నట్లు చైనా ప్రకటించింది. మిగిలిన పన్ను తగ్గింపు విధానాలలో ఎలాంటి మార్పూ ఉండదని స్పష్టం చేసింది.

**కెనడా,మెక్సికోలకు తాత్కాలిక ఉపశమనం**

అమెరికాలోకి అక్రమ వలసలు జరగకుండా కెనడా సరిహద్దుల్లో నిఘా పెంచేందుకు ఆ దేశ ప్రభుత్వం అంగీకరించడంతోపాటు మెక్సికో కూడా అమెరికా సరిహద్దుల్లో 10వేలమంది సైన్యాన్ని మోహరించేందుకు అంగీకరించడంతో టారిఫ్‌ల అమలును నెలరోజులు ట్రంప్ వాయిదా వేశారు. ఈ చర్యతో మెక్సికో, కెనడా దేశాలలో వాణిజ్యవేత్తలకు తాత్కాలికంగా ఉపశమనం లభించింది. చైనాను కూడా లొంగదీసుకోవడానికి రాబోయే 24 గంటల్లో ఇదే వ్యూహం అమలు చేసేందుకు అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో కూడా ట్రంప్ సంభాషణలు చేసేందుకు సిద్ధమయ్యారు. కానీ చైనా మాత్రం తమ దేశ వ్యాపార రక్షణ చర్యలను ఉద్ధృతం చేసింది. అమెరికా–చైనా మధ్య వాణిజ్యం దగ్గరనుండి సముద్ర జలాల వరకూ అనేక సమస్యలు అపరిష్కృతంగా పేరుకుపోయి ఉన్నాయి. పొరుగు దేశాల నుండి అక్రమ మార్గాల్లో అత్యంత ప్రమాదకరమైన విషతుల్యమైన ఫొంటనైల్ డ్రగ్‌ను అమెరికాకు చైనా తరలిస్తోందనీ, వెంటనే ఈ రవాణా ఆపేయాలని ట్రంప్ డిమాండ్ చేస్తున్నారు. చైనాపై ట్రేడ్ వార్ ప్రకటించడానికి ప్రధాన కారణాల్లో ఇదికూడా ఒకటి.

# యుఎస్ఎయిడ్ సంస్థ మూసివేతపై గగ్గోలు




**వాషింగ్టన్ :** ప్రపంచవ్యాప్తంగా అనేక పేద దేశాలకు, సంస్థలకు సహాయం చేస్తున్న అమెరికా అంతర్జాతీయ సహాయ సంస్థ ''యుఎస్ఎయిడ్''ను అమెరికా విదేశాంగమంత్రిత్వశాఖలో విలీనం చేస్తామని ట్రంప్ ప్రకటించడంతో ఆ దేశంలో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. డెమోక్రటిక్‌పార్టీ ఎంపీలు, యుఎస్ఎయిడ్‌లో పనిచేసే సిబ్బంది ఈ కార్యాలయం వెలుపల నిరసన ప్రదర్శనలు చేపట్టారు. 10,000 మంది ఉద్యోగులతో,40 బిలియన్ డాలర్ల బడ్జెట్‌తో 1961లో ఆనాటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నడీ ఈ యుఎస్ఎయిడ్ సంస్థను స్థాపించారు. ఐతే ఈ సంస్థ బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తోందనీ, ఈ నిధులన్నీ దుర్వినియోగం అవుతున్నాయనీ, వీటికి జవాబుదారీ లేకుండాపోయిందనీ, రాడికల్స్ పెత్తనం చేస్తున్నారనీ, అందువల్ల ఈ సంస్థను మూసివేయడం మంచిదనీ ట్రంప్ గట్టి నిర్ణయం తీసుకున్నారు. ఇందులో పనిచేసే ఉద్యోగులను విధుల్లోకి రావొద్దని స్పష్టం చేయడంతో పెద్ద గగ్గోలు చెలరేగింది. ఇది చాలా అన్యాయపూరితమైన చర్య అనీ, ప్రపంచంలో అనేక పేద దేశాలకు ఆర్థికసహాయంతోపాటు ఇతర రకాల సహాయం అందకుండా పోతుందనీ, ఇది అన్యాయం, చట్టవిరుద్ధం అని డెమోక్రటిక్‌పార్టీ సభ్యులు తీవ్ర నిరసన తెలియజేస్తున్నారు. ట్రంప్‌కు కుడిభుజంగా పనిచేస్తున్న ఎలాన్‌మస్క్ ఈ యుఎస్ ఎయిడ్ పనితీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆయన ప్రోద్బలంతోనే ట్రంప్ ఈ సంస్థ మూసివేత నిర్ణయం తీసుకున్నారు.

## ప్రపంచం

# గోమా వీధుల్లో 900 మృతదేహాలు
# డి.ఆర్.కాంగోలో ఎం–23 కాల్పుల విరమణ

**గోమా :** సెంట్రల్ ఆఫ్రికాదేశం డి.ఆర్.కాంగో (డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో)లో ఎం–23 (మార్చి 23 ఉద్యమం) తిరుగుబాటుదారులు మంగళవారంనాడు తాత్కాలికంగా కాల్పుల విరమణ ప్రకటించారు. తిరుగుబాటు దారుల నాయకుడు సుల్తానా మకెంగా ఈ ప్రకటన చేశారు. తాము స్వచ్ఛంధంగానే మానవతాదృక్పథంతో కాల్పుల విరమణ ప్రకటించినట్లు ఎం–23 తిరుగుబాటు దారులు ప్రకటించారు. ఇదిలా ఉండగా, గడచిన రెండు వారాలుగా ఎం–23 తిరుగుబాటుదారులు కాంగోలోని ము ఖ్యంగా అతిపెద్ద గోమా నగరాన్ని స్వాధీనం చేసుకుని అనేక పట్టణాలను చేజిక్కించుకునేందుకు జైత్రయాత్ర ప్రారంభించారు. కాంగో ప్రభుత్వ దళాలతో పోరాటం చేస్తున్నారు. ఈ దశలో ఒక్క గోమా నగరంలోనే తిరుగుబాటుదారుల దాడుల్లో 900 మంది మరణించారు. గోమా నగరంలో 900 మృతదేహాలు పలుచోట్ల కనిపించాయని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఇక ఎం–23 తిరుగుబాటు దళం కూడా మానవతా దృక్పథంతో కాస్త విరామం ఇస్తున్నట్లు ప్రటించింది. మధ్య ఆఫ్రికాలో 90,000 సంవత్సరాల మానవచరిత్రలో జాతులమధ్య జరుగుతున్న ఘర్షణలో భాగంగా టుట్సీ తెగలు తమదైన అస్తిత్వంకోసం పెద్ద పోరాటం చేస్తున్నారు. ఈ పోరాటంలో భాగంగానే టుట్సీలు ఒక తిరుగుబాటు దళంగా ఏర్పడి ఎం–23 ఉద్యమం ప్రారంభించారు. 2013లో జరిగిన శాంతి ఒప్పందంలో తిరుగుబాటుదారులు భాగం కాకపోయినప్పటికీ మౌనంగా ఉండిపోయారు. తర్వాత 2021 లో తిరిగి తలెత్తి తమ అస్తిత్వ పోరాటం ప్రారంభించా రు. కాంగోకు పొరుగున ఉ న్న రువాండా ప్రభుత్వం మ ద్దతుతో ఆ దేశ సరిహద్దుల్లో ఉన్న కాంగో తూర్పు ప్రాం తాలను ఎం–23 తిరుగుబాటుదారులు ఆక్రమిస్తూ పోరాటం సాగిస్తున్నారు. గడచిన రెండు వారాలుగా ఈ పోరాటం ఉద్ధృతరూపం దాల్చింది. జనవరి చివరివారంలో కాంగోలోని అతిపెద్ద తూర్పు ప్రాంత నగరం గోమాతోపాటు పలు ఇతర పట్టణాలను కూడా స్వాధీనం చేసుకున్నారు.



**కాంగో సమస్యపై 7,8 తేదీల్లో శిఖరాగ్ర సమావేశం**

డి.ఆర్.కాంగోలో తలెత్తిన సంక్షోభంపై మరో మూడు రోజుల్లో ఫిబ్రవరి 7,8 తేదీలలో శిఖరాగ్ర సమావేశం జరుగుతుంది. టాంజానియా ఆర్థికకేంద్రం దార్ ఎస్ సలామ్‌లో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి డి.ఆర్.కాంగో అధ్యక్షుడు ఫెలిక్స్ షిసెకెడి, రువాండా అధ్యక్షుడు పాల్ కగెమేలు హాజరవుతున్నారని కెన్యా అధ్యక్షుడు విలియం రూటో ప్రకటించారు. గోమాలో తలెత్తిన సమస్య పరిష్కారంలో వీరిద్దరే ప్రధాన భూమిక నిర్వహించాల్సి ఉంది. ఈ సదస్సుకు తూర్పు ఆఫ్రికా కమ్యూనిటీ (ఇఎసి) నుండి ఆరుగురు ప్రతినిధులు, దక్షిణ ఆఫ్రికా అభివృద్ధి కమ్యూనిటీ (ఎస్ఎడిసి) నుండి 16 మంది ప్రతినిధులు హాజరవుతున్నారు. ఇదొక అసాధారణమైన శిఖరాగ్ర సదస్సు అని విలియం రూటో చెప్పారు. దక్షిణాఫ్రికా, ఉగాండా, సోమాలియా దేశాధ్యక్షులు కూడా ఈ సదస్సులో పాల్గొంటారు. ఇదిలా ఉండగా జి–7 దేశాలు గడచిన ఆదివారం జరిగిన సమావేశంలో ఎం–23 హింసను తీవ్రంగా ఖండించింది. తక్షణం ఆక్రమణ చర్యలు, సామాన్య ప్రజలపై నరమేధాన్ని ఆపేయాలని హెచ్చరించింది.

## మూడింటికి ఓకే (మొదటి పేజీ తరువాయి)

సమస్యను పరిష్కరిస్తామని సిఎం ప్రకటించారు. శాసనసభ ప్రత్యేక సమావేశంలో మంగళవారం 'ఎస్‌సి వర్గీకరణ'పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన చేశారు. అభివృద్ధి అంటే రంగుల గోడలు, అద్దాల మేడలు కాదని, చివరి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమనే డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అశయానికి అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని సిఎం చెప్పారు. సుమారు 4 దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలిపారు. ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులోభాగంగా ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి పూర్తి అధ్యయనం చేసిందన్నారు. అంతేకాకుండా వర్గీకరణ అమలులో పూర్తి పారదర్శకత ఉండేలా డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ సైతం ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి 475 ం విజ్ఞప్తులను స్వీకరించడగా, అన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో మొత్తంగా 8681 విజ్ఞప్తులు కమిషన్‌కు అందాయని తెలిపారు. ఈ కమిషన్ 82 రోజుల పాటు పూర్తిగా అధ్యయనం చేసి తుది నివేదికను అందజేసిందన్నారు. ఈ సందర్భంగా ఏకసభ్య కమిషన్ ఎస్‌సి ఉపకులాల వర్గీకరణకు పలు కీలక సిఫార్సులను చేసిందని ముఖ్యమంత్రి సభకు వివరించారు. ఎస్‌సిలలో మొత్తం 59 ఉప కులాలు ఉండగా, వాటిలో 15 ఉప కులాలను గ్రూప్1గా, 18 ఉప కులాలను గ్రూప్ –2గా, 26 ఉప కులాలను గ్రూప్ –3గా వర్గీకరించాలని కమిషన్ సిఫార్సు చేసిందని వెల్లడించారు. ఎస్‌సిలకు చట్టబద్ధంగా 15 శాతం రిజర్వేషన్లు ఉండగా ఇందులో అత్యంత వెనకబడినట్లు గుర్తించిన (జనాభా 3.288 శాతం ) ఉన్న గ్రూప్–1కు 1 శాతం రిజర్వేషన్, కొంత మెరుగైన స్థితిలో ఉన్న 18 ఉప కులాలు (జనాభా 62.74 శాతం) ఉన్న గ్రూప్ –2కు 9శాతం రిజర్వేషన్లు ఈ రెండు గ్రూప్‌ల కంటే మరింత మెరుగైన స్థితిలో ఉన్న 26 ఉప కులాలు (జనాభా 33.963శాతం) ఉన్న గ్రూప్– 3కి 5శాతం రిజర్వేషన్ కల్పించాలని కమిషన్ తన నివేదికలో పేర్కొందని ముఖ్యమంత్రి సిఎం వివరించారు. ఎస్‌సి కులాల గ్రూప్‌లకు రోస్టర్ పాయింట్లు, క్రిమీలేయర్ విధానాన్ని కూడా అమలు చేయాలని కమిషన్ సిఫార్సు చేసిందన్నారు.

**చరిత్రలో నాకంటు ఓ పేజీ :ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

ఎస్‌సి వర్గీకరణ, కులగణన నా రాజకీయ జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన అంశాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 'ఫిబ్రవరి 4, 2025 నా రాజకీయ జీవితంలో ప్రత్యేకంగా గుర్తుండి పోతుంది. చరిత్రలో తనకంటూ ఓ పేజీ ఉంటుంది' అని సిఎం అన్నారు. ఎందరో ముఖ్యమంత్రులకు రాని అవకాశం తనకు వచ్చిందని, చాలా రాజకీయ పార్టీలు ఎస్‌సి వర్గీకరణ అంశాన్ని ఓటు బ్యాంకుగా చూశాయే తప్ప ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే ప్రయత్నం చేయలేదని సిఎం అన్నారు. అందుకే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడం ద్వారా సమాజంలో తరతరాలుగా నిర్లక్ష్యానికి, దోపిడీకి గురైన వారికి న్యాయం చేయాలని సంకల్పించామని సిఎం చెప్పారు. వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. ఈ ఉద్యమంలో చనిపోయిన వారికి సిఎం నివాళ్లు అర్పించారు. వారి మరణం వృథా కాకుండా వారు కోరుకున్న విధానాన్ని అమలు చేస్తామన్నారు. ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి అనుగుణంగా నడుచుకుంటుందన్నారు. బలహీనవర్గాలకు సంబంధించి ఇతర రాష్ట్రాల్లో అమలు చేసేందుకు సహకారం అందిస్తామని సిఎం చెప్పారు.

## భారీ అగ్ని ప్రమాదం
(మొదటి పేజీ తరువాయి)

వ్యాపించాయి. ఎగసి పడుతున్న మంటలకు తోడు ఘాటైన దుర్వాసనతో కూడిన దట్టమైన పొగలు కిలో మీటర్ల కొద్దీ వ్యాపించాయి. తమ నివాసాలకు వెళ్లే ప్రధాన రహదారిలో చోటు చేసుకొన్న ఈ అగ్ని ప్రమాద సంఘటన ప్రయాణీకులతో పాటు సమీపంలో ఉన్న పలు కాలనీ, బస్తీ వాసులు తీవ్ర భయభ్రాంతులతో ఉక్కిరి బిక్కిరయ్యారు. అగ్ని ప్రమాద సిబ్బంది మూడు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రమాద సమయంలో కార్మికులు ఉన్నారా లేరా అన్న విషయంపై స్పష్టమైన సమాచారం లేదు. రాచకొండ పోలీసులకు అందిన సమాచారంతో ఎసిపి మహేష్, కుషాయిగూడ, నాచారం ఇనస్పెక్టర్లు అక్కడికి చేరుకొన్నారు. మంగళవారం సాయంత్రం 6.49 నిమిషాలకు ఈసిఐఎల్‌ఎన్‌ఎఫ్‌సి కేబుల్ చౌరాస్తా మార్గంలోని చర్లపల్లి పారిశ్రామిక వాడలోని ఫేస్1లో ఉన్న సర్వోదయ (శేషసాయి) రసాయన పరిశ్రమలో ఒక్కసారిగా మంటలు చెలరేగి భారీ పేలుళ్ల శబ్దంతో మంటలు ఎగసి పడ్డాయి. వెంటనే దట్టమైన పొగలు కిలో మీటర్ల కొద్దీ వ్యాపించాయి. కర్మాగారంలో మంటలు వ్యాపించగానే లోపలి నుండి పలువురు కార్మికులు పరుగులతో ప్రాణభయంతో బయటకు వచ్చారు. మంటల్లో ఎవరైనా ఉన్నారా లేదా అన్న విషయం మంటలు పూర్తిగా అదుపులోకి వస్తే కానీ చెప్పలేమని అగ్నిమాపక దళాధికారులు చెబుతున్నారు. ప్రమాదానికి కారణాలేమై ఉంటాయన్న విషయం మంటలు పూర్తిగా అదుపులోకి వస్తే కానీ చెప్పలేక పోతున్నారు. రసాయనాల ఘాటుతో సమీప వాసులు ఉక్కిరి బిక్కిరవుతున్నారు.

## చరిత్ర సృష్టించాం (మొదటి పేజీ తరువాయి)

ఎస్‌సి వర్గీకరణ విషయాల్లో తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు మార్గనిర్దేశనం చేస్తుందని ఆయన అన్నారు. దీనితో, కులగణనపై ప్రధానమంత్రిపై ఒత్తిడి పెరుగుతుందని ఆయన అన్నారు. ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో పాటు మంత్రివర్గ ఉపసంఘం, ఏకసభ్య కమిషన్ సిఫార్సుల ప్రకారం ప్రభుత్వం ముందుకు సాగుతుందని సిఎం స్పష్టం చేశారు. 'ప్రధాన ప్రతిపక్షానికి బాధ్యత, చిత్తశుద్ధిలేదు. వారిని పరిగణనలోకి తీసుకోవడంలేదు. ప్రతిపక్ష నాయకుడు సభకు రావాలి కదా' అని సిఎం అన్నారు.దేశంలోనే మొదటిసారి కులగణన నిర్వహించి చరిత్ర సృష్టించామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వెల్లడించారు. పకడ్బందీగా కులగణన సర్వే చేసి సమాచారం సేకరించినట్లు సిఎం తెలిపారు.

**ఎపుడైనా రిఫరెన్స్ డాక్యుమెంట్**

రాష్ట్రంలో 56 శాతం వెనుకబడిన తరగతులు, 17.5 శాతం ఎస్‌సిలు కలిపి మొత్తం 73.5 శాతం ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారమవుతాయని, ప్రధానిపై కూడా ఒత్తిడి పెరుగుతుందని సిఎం అన్నారు. కులగణన, ఎస్‌సి వర్గీకరణకు రోడ్ మ్యాప్ తెలంగాణ నుంచి ఇస్తున్నామని సిఎం చెప్పారు. సభలో ప్రవేశపెట్టిన డాక్యుమెంట్ భవిష్యత్‌లో ఎపుడైనా రిఫరెన్స్ డాక్యుమెంట్ అవుతుందని వివరించారు. రాజకీయం కోసం చేయడంలేదని, ఈ డాక్యుమెంట్‌ను డెడికేటెడ్ కమిషన్ తగిన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

**అసెంబ్లీలో కులసర్వే నివేదిక ప్రవేశపెట్టిన సీఎం రేవంత్**

అసెంబ్లీలో 88 జనరల్ సీట్లలో 30 సీట్లు 33 శాతం సీట్లు బిసిలకు ఇచ్చామని సిఎం రేవంత్‌రెడ్డి వివరించారు. కోర్టు ఇచ్చిన క్లిమిలేయర్‌ను మంత్రివర్గం తిరస్కరించిందని సిఎం చెప్పారు. బిసి రిజర్వేషన్లపై కోర్టు ఆదేశాల మేరకు కమిషన్ వేసినట్లు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకే కమిషన్ నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. అసెంబ్లీకి రాని వారు అసెంబ్లీ టైం గురించి మాట్లాడుతున్నారని సిఎం విమర్శించారు.గత ప్రభుత్వం సర్వే రిపోర్టు ఎక్కడుందో తెలీదు : 'కొందరు ఉప ఎన్నికల గురించి మాట్లాడుతున్నారు. సిరిసిల్లలో కెటిఆర్ సూసైడ్ చేసుకుంటాడేమో' అని సిఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే రిపోర్ట్ ఎక్కడ ఉందో కూడా తెలియదని సిఎం పేర్కొన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ఎవరు చేసారు? ఎలా చేసారు? ఆ రిపోర్ట్ ఎక్కడ పెట్టారో ఎవరికీ తెలియదని పేర్కొన్నారు. తాము ఎన్నికల కోసం కులగణన చేయలేదని, అభివృద్ధి ఫలాలు అందించడం కోసమే వారి తాపత్రయం అంతా అని సిఎంవివరించారు. పార్టీ మారిన ఎంఎల్‌ఎలకు నోటీసులపై సిఎం స్పందిస్తూ ఇదంతా ప్రొసీజర్‌లో భాగమేనని పేర్కొన్నారు.

## చరిత్రాత్మక నిర్ణయాలు
(మొదటి పేజీ తరువాయి)

'తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే'పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 46.25 శాతం ఉన్న బిసిలు, మైనారిటీలలోని బిసిలు కలుపుకుని 56.33 శాతం ఉన్న బిసిలందరికీ సమాజంలో సముచితమైన గౌరవం, స్థానం కల్పించాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ఈ నివేదిక అభివృద్ధికి ఒక మోడల్ డాక్యుమెంట్‌గా మారనుందని, అందుకే ఈ నివేదికకు చట్టబద్ధత కల్పించేందుకే శాసనసభలో ప్రకటన చేశామని సిఎం చెప్పారు. ఈ గణాంకాల ఆధారిత, సమగ్ర, పారదర్శకత ప్రాతిపదికగా నడిచే పాలనకు నూతన దశ ప్రారంభాన్ని సూచిస్తుందని, సమాన వృద్ధి పట్ల ప్రభుత్వ నిబద్ధతను, తెలంగాణ ప్రజల విభిన్న అవసరాలను తీర్చే పద్ధతిని ప్రతిబింబిస్తుందని సిఎం తెలిపారు. ఈ సర్వే ద్వారా సేకరించిన డేటాను షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, వెనుకబడిన తరగతులు, రాష్ట్రంలోని ఇతర బలహీనవర్గాల సంక్షేమానికి విధానాలను రూపకల్పన చేసేందుకు ప్రభుత్వం ఉపయోగిస్తుందని సిఎం తెలిపారు. బలహీనవర్గాల జనాభా 50 శాతం వరకు ఉన్నదని పలువురు చెబుతున్నప్పటికీ, దీనికి సంబంధించి క్రమబద్ధంగా సేకరించిన సమాచారంలేదని, పారదర్శకత కూడా లేదని రేవంత్‌రెడ్డి వివరించారు. తద్వారా స్థానిక సంస్థల రిజర్వేషన్లు, విద్యా,ఉద్యోగాల్లో రిజర్వేషన్ల అమలు విషయంలో న్యాయస్థానాల్లో ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. 1931లో కులగణన జరిగిందని, ఆ తర్వాత స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కూడా కులగణన జరగలేదని సిఎం అన్నారు. ప్రతి పదేళ్లకు ఒకసారి నిర్వహించే జన గణనలో ఎస్‌సి, ఎస్‌టిల జనాభాను పొందపర్చారని, కానీ బలహీనవర్గాల వారి లెక్కలు పొందుపర్చలేదన్నారు. వివిధ ప్రజా సంఘాలు, సామాజికవేత్తలు, మేధావులు, ఇతర స్టేక్ హోల్డర్‌ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని హౌస్ లిస్టింగ్ షెడ్యూల్, సర్వే షెడ్యూల్, ఎన్యుమరేటర్లకు మార్గదర్శకాలు పద్ధతిన సర్వే నిర్వహించినట్టు సిఎం వివరించారు. అన్ని విషయాలను పరిగణలోకి తీసుకున్న తర్వాత రాష్ట్రంలో వెనుకబడిన తరగతులు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తరగతి ప్రజలు, రాష్ట్రంలోని ఇతర బలహీన వర్గాల స్థితిగతులను మెరుగుపరచడానికి వివిధ సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన ఉపాధి రాజకీయ అవకాశాల కోసం ప్రణాళికను రూపొందించి అమలు చేయాలన్న లక్ష్యంతో ఈ సర్వే చేపట్టినట్లు వివరించారు. తెలంగాణ గవర్నర్‌తో మొదలుపెట్టి, రాష్ట్రంలో నవంబర్ 6వ తేదీన సర్వే ప్రారంభించిగా డిసెంబర్ 5వ తేదీ నాటికి పూర్తయిందని, 50 రోజులు సర్వే ముగిసే సమయానికి మొత్తం కుటుంబాల సంఖ్య గ్రామీణ ప్రాంతాలలో 66,99,602, నగర ప్రాంతాల్లో 45,15,532 కాగా మొత్తం 1,12,15,137 కుటుంబాలు (96.09 శాతం) ఉందని, సరిగ్గా ఏడాది కాలంలో పూర్తి చేసి నివేదికను శాసనసభ ముందుకు తీసుకువచ్చామన్నారు. ఈ సర్వే ద్వారా సేకరించిన డేటాను ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇతర బలహీన వర్గాల సంక్షేమానికి అవసరమైన విధానాల రూపకల్పనలో ప్రభుత్వం ఉపయోగిస్తుందన్నారు.

**75 ఏళ్లలో బిసిల లెక్కలే లేవు**

తమ లెక్కలు లేక, తమ హక్కులను కాలరాస్తున్నారని, తమను మనుషులుగా కూడా గుర్తించడంలేదని బలహీనవర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జనాభా లెక్కల్లో భాగంగా కులాల లెక్కలను కూడా సేకరించాలని, తద్వారా నిధులు, రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ, అవకాశాలలో సరైన న్యాయం చేసేందుకు ముందుకు రావాలని మొరపెట్టుకున్నప్పటికి కేంద్ర ప్రభుత్వం ముందుకు రాలేదని సిఎం చెప్పారు. కులగణన సమాజానికి ఒక ఎక్స్‌రే లాంటిదని రాహుల్‌గాంధీ చెప్పిన విషయాన్ని రేవంత్‌రెడ్డి సభలో గుర్తు చేశారు.

## అసెంబ్లీ ఆమోదం
(మొదటి పేజీ తరువాయి)

షెడ్యూల్ తెగలు (ఎస్‌టి), రాష్ట్రంలోని ఇతర బలహీనవర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉంది. రాష్ట్రంలోని వివిధ కులాల మధ్య వెలువడిన అసమానతలను తగ్గించడానికి అనుకూల విధానాలు, అఫెర్‌మేటివ్ పాలసీలను రూపొందించడానికి తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో కట్టుబడి ఉంది. దేశ స్వాతంత్ర్యం నాటి నుంచి ఎదురు చూస్తున్న ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొదటి సారి ఆచరించడం ఆదర్శనీయం. దేశంలోని వివిధ కులాల సంబంధిత స్థితిగతులను అర్థం చేసుకోవడానికి, తెలంగాణలో నిర్వహించిన విధంగానే దేశ వ్యాప్తంగా ఇంటింటి సమగ్ర సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్యా, రాజకీయ, కుల సర్వేను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతుంది'' అని ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని చర్చ అనంతరం సభ ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు.

## తొలగింపు
(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంట్‌కు వెల్లడించారు. ఒక ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానమిస్తూ 2022 23 ఆర్థిక సంవత్సరంలో 86,17,887 మందిని, 2023 2024 ఆర్థిక సంవత్సరంలో 68,86,532 మందిని జాబితానుంచి తొలగించామని, మొత్తం గా 1,55,04,419మందిని ఉపాధి హామీ పథకంనుంచి తొలగించినట్టు పాశ్వాన్ తెలిపారు. నకిలీ, అవాస్తవ జాబ్ కార్డుదారులను, గ్రామ పంచాయతీల నుంచి పట్టణ ప్రాంతాలకు వలసవెళ్లిన వారిని, అర్బన్ ప్రాంతాలలో విలీనమైన గ్రామాలకు చెందిన కార్మికులను జాబితా నుంచి తొలగించినట్టు వివరించారు. జాబ్ కార్డులను తొలగించడం అన్నది నిరంతర ప్రక్రియ అని, గ్రామీణ హామీ పథకాన్ని నిర్దుష్టంగా అమలు చేయడం ప్రభుత్వాల బాధ్యత అని తెలిపారు. అర్హులైన కార్మికులను ఎవరినీ ఈ జాబితానుంచి తొలగించ లేదన్నారు. జాబ్ కార్డుల తొలగింపు, పునరుద్ధరణపై రాష్ట్ర ప్రభుత్వాలకు జనవరి 25న నిర్దుష్ట విధి విధానాలను వెల్లడించడం జరిగిందన్నారు. నకిలీ జాబ్ కార్డులను తొలగించేందుకు ఆధార్ కార్డును అనుసంధానం చేసినట్టు వివరించారు.

## సంపద పన్ను (మొదటి పేజీ తరువాయి)

మూడోతేదీ సోమవారంనాడు సమావేశమై కేంద్ర బడ్జెట్‌పై చర్చించాయి. ఈ మేరకు వామపక్షాల ప్రత్నామ్నాయ ప్రతిపాదనలు, ప్రచార కార్యక్రమంపై మంగళవారంనాడు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.''కేంద్ర ప్రభుత్వ 2025–26 బడ్జెట్ దేశ ప్రజల తక్షణ–మౌలిక అవసరాలకు నమ్మక ద్రోహం చేసింది. ప్రజల చేతుల్లో డబ్బులు లేకపోవడంవల్ల వారికి కొనుగోలు శక్తి లేదు. ఎందుకంటే దేశవ్యాప్తంగా సామూహికంగా నిరుద్యోగం తాండవిస్తోంది, వేతనాలు సన్నగిల్లిపోయాయి. ఈ కారణంగా దేశ ఆర్థికవ్యవస్థలో ఏర్పడిన డిమాండ్ సమస్య పరిష్కరించడానికి బదులుగా, కేంద్ర ప్రభుత్వ వ్యయాలలో కోత పడినాగానీ పట్టించుకోకుండా బడా కార్పొరేట్ వ్యాపారశక్తులకు, సంపన్నులకు బడ్జెట్ ద్వారా రాయితీలు ఇచ్చి ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించాలని మోదీ ప్రభుత్వం భావించింది. దేశంలో సంపన్నులు, పెద్ద పెద్ద వ్యాపార సంస్థలపై పన్నులు విధించడంద్వారా, ప్రభుత్వపెట్టుబడులను విస్తరించి ప్రభుత్వ వనరులు సమీకరించాల్సిందిపోయి కేంద్రప్రభుత్వం అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నది. ప్రభుత్వ పెట్టుబడులను విస్తరిస్తే కొత్త ఉద్యోగాల సృష్టికి దోహదపడుతుంది. ప్రజలకు కనీస వేతనాలు లభిస్తాయన్న భరోసా వస్తుంది. కానీ ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించడం ద్వారా సంపద ఒకేచోట భారీ ఎత్తున పేరుకుపోయేందుకు వీలైన ప్రతిపాదనలనే బడ్జెట్ ప్రోత్సహించింది. అంతేకాకుండా ప్రభుతరంగంలో ఉన్న ఆస్తులను ప్రైవేటురంగ సేవలకు ఉపయోగించుకునేందుకు వీలు కల్పించారు. విద్యుత్ రంగంతోపాటు ఇతరరరంగాలను ప్రైవేటీకరించే ప్రతిపాదనలను బడ్జెట్‌లో ప్రోత్సహించారు.కేంద్ర బడ్జెట్ పూర్తిగా నిరుద్యోగ సమస్యను నిర్లక్ష్యం చేసింది, ఆహార సబ్సిడీలపై వ్యయాలను నిర్లక్ష్యం చేసింది, వ్యవసాయం తదనుబంధ కార్యకలాపాలు, విద్య, ఆరోగ్యం, గ్రామీణ అభివృద్ధి, సామాజిక సంక్షేమం, పట్టణ అభివృద్ధి వంటవన్నీ స్తంభించిపోయాయి లేదా గత ఏడాది కంటే ఈ బడ్జెట్‌లో తక్కువ కేటాయింపులే వచ్చాయి. దీనికి గల కారణాలలో ద్రవ్యోల్బణం కూడా ఒకటి కావచ్చు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద అమలు చేసే పథకానికి డిమాండ్ పెరుగుతున్నప్పటికీ కూడా కేటాయింపులు మాత్రం రూ.86,000 కోట్ల వద్దనే ఆగిపోయాయి. రూ.12 లక్షల వరకూ వ్యక్తిగత ఆదాయాలపై పన్ను చెల్లించాల్సిన అవసరం లేదన్న బడ్జెట్ నిర్ణయం ఒకవర్గం ప్రజలకు ఊరట కలిగించినప్పటికీ, పెరిగిన ధరలతో, వస్తు సేవలపన్ను వంటి పరోక్ష పన్నులతో బాధపడుతున్న దేశంలో పెద్దసంఖ్యలో ఉన్న శ్రామికవర్గాన్ని మాత్రం విస్మరించారు. వ్యక్తిగత ఆదాయపన్ను చెల్లింపులో భారీ ఊరట కలిగించినందువల్ల ఏర్పడిన లోటును సంపన్నవర్గాలు, బడా వ్యాపారసంస్థలపై విధించే పన్నులశాతాన్ని పెంచడంద్వారా భర్తీ చేసుకోవచ్చు. కానీ ప్రభుత్వం మాత్రం అలా చేయకూడదని నిర్ణయించుకోవడమేకాకుండా, కార్పొరేట్ రంగానికి, మితిమీరిన సంపన్నులకూ భారీ రాయితీలు సమకూర్చింది.

**ప్రజావ్యతిరేక ప్రతిపాదనలకు తిరస్కృతి**

బడ్జెట్‌లో కేంద్రం ప్రతిపాదించిన ప్రజావ్యతిరేక ప్రతిపాదనలన్నింటినీ వామపక్షాలన్నీ తిరస్కరించడంతోపాటు ప్రభుత్వం పేర్కొన్న ప్రతిపాదనలకు బదులుగా ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ఒక ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను వామపక్షాలు ముందుకు తెచ్చాయి. వామపక్షాలు చేసిన ఈ ప్రత్యామ్నాయ ప్రతిపాదనలవల్ల ప్రజల్లో కొనుగోలుశక్తి పెరిగి డిమాండ్ సృష్టికి దారితీస్తుంది, దీనివల్ల ఉద్యోగ అవకాశాలు వస్తాయి, వేతనాల పెరుగుదలకు దారితీస్తాయి. ఈ ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు విద్య, ఆరోగ్యం, సామాజిక భద్రతా ప్రయోజనాలు వంటి ప్రజల హక్కులకు భరోసా కలిగిస్తాయి. పార్లమెంటులో ఆర్థికబిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించడానికి ముందుగానే ఈ ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు, డిమాండ్లను బడ్జెట్‌లో చేర్చాలని కోరుతూ వామపక్షాలు సంయుక్తంగా ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నాయి. ఫిబ్రవరి 14 నుండి 20వ తేదీ వరకూ దేశవ్యాప్తంగా వారం రోజులపాటు వామపక్షాలు ఈ ప్రచారం నిర్వహిస్తాయి. రాష్ట్రాలలో వామపక్షాల పార్టీ శాఖలు ఇందుకు తగినవిధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలి. ఇంటింటి ప్రచారం ద్వారా గరిష్ఠస్థాయిలో ఎక్కువమంది ప్రజలకు చేరువ కావాలి. వీధి చివరి సమావేశాలు నిర్వహించాలి. ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించాలి'' అని వామపక్షాల సంయుక్త ప్రకటన పేర్కొంది. ఈ ప్రకటనపై డి.రాజా (సిపిఐ ప్రధాన కార్యదర్శి)తోపాటు ప్రకాశ్ కారత్ (సమన్వయకర్త, సిపిఐ–ఎం పొలిట్‌బ్యూరో), దీపాంకర్ భట్టాచార్య(ప్రధాన కార్యదర్శి, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్), మనోజ్ భట్టాచార్య(ప్రధాన కార్యదర్శి, ఆర్‌ఎస్‌పి), జి.దేవరాజన్(ప్రధాన కార్యదర్శి, ఎఐఎఫ్‌బి)లు సంతకాలు చేశారు.

**బడ్జెట్‌లో చేర్చేందుకు వామపక్షాల ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు ఇవే**

1) దేశంలో ఉన్న 200 మంది బిలియనీర్లు (డాలర్లలో సంపన్నులు)పై నాలుగు శాతం సంపద పన్ను విధించాలి. కార్పొరేట్ పన్నును పెంచాలి.
2) వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు సమకూర్చేందుకు చట్టపరమైన హామీ ఇవ్వాలి, పోటీ తత్త్వంతోకూడిన, దాపరికంలేని వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను సృష్టించాలనే పేరుతో ప్రభుత్వం ప్రతిపాదించిన జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ ముసాయిదా(ఎన్‌పిఎఫ్‌ఎఎం)ను ఉపసంహరించుకోవాలి.
3) జాతీయ ద్రవ్యీకరణ విధానం (ఎన్‌ఎంపి) పేరుతో ప్రభుత్వరంగంలో ఉన్న కీలక ఆస్తులను, కీలక సంస్థలను ప్రైవేటు రంగానికి తాకట్టుపెట్టే ప్రైవేటీకరణ ప్రక్రియను నిలిపివేయాలి. బీమా రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తూ చేసిన ప్రతిపాదనను ఉపసంహరించాలి.
4) మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్‌ఆర్‌ఇజిఎ) కింద కేటాయింపులను 50 శాతం పెంచాలి. పట్టణ ఉద్యోగ హామీ చట్టాన్ని ప్రవేశపెట్టాలి. కేంద్ర ప్రభుత్వ వృద్ధాప్య పెన్షన్ల కేటాయింపులను పెంచాలి.ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాలను కూడా పెంచాలి.
5) స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో ఆరోగ్యానికి మూడూశాతం, విద్యకు ఆరూశాతం కేటాయింపులను పెంచాలి.
6) ప్రభుత్వ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఆహార సబ్సిడీని పెంచాలి.
7)షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, మహిళలు, పిల్లల అభివృద్ధికి కేటాయింపులను గణనీయంగా పెంచాలి. వీటిల్లో సమగ్ర బాలల అభివృద్ధి సేవలు (ఐసిడిఎస్)ను కూడా కేటాయింపులను చేర్చాలి. స్కీమ్ వర్కర్లకు ఇచ్చే గౌరవ వేతనంలో కేంద్రం వాటాను పెంచాలి.
8) రాష్ట్రాలకు బదిలీచేసే నిధులను పెంచాలి, కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలకు కూడా గణనీయంగా నిధులు పెంచాలి. కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే మొత్తం పన్ను ఆదాయాలలో రాష్ట్రాలకు కేటాయించే వాటాలో చేర్చని పెట్రోలియం ఉత్పత్తులపై సుంకాలను, సర్‌ఛార్జీలను రద్దు చేయాలి.



# మీడియా పాయింట్

## అసెంబ్లీని వాయిదా వేయడం సబబు కాదు

**బిఆర్ఎస్ ఎంఎల్ఎ వేముల ప్రశాంత్‌రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిజినెస్ గురించి ఒక్క మాట లేకుండా అసెంబ్లీని వాయిదా వేయడం సబబు కాదని బిఆర్ఎస్ ఎంఎల్ఎ వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు అసెంబ్లీ ప్రారంభమైన వెంటనే వాయిదా వేయడంపై అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ..అసెంబ్లీ ఇలా ప్రారంభంకాగానే అలా వాయిదాపడడం చరిత్రలో మొదటిసారి అని ఆయన ఆరోపించారు. ఒక్క మంత్రి కూడా శాసన సభలో లేరని ఆరోపించారు. ఇది శాసనసభను అవమానపరచడం కాదా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ నిర్ణయాల వల్ల అన్ని రంగాల్లో వెనకబడుతున్నదని విమర్శించారు. బిసిలు, ఎస్‌సి వర్గీకరణకు సంబంధించిన చాలా ముఖ్యమైన చర్చ ఉంది. ఉదయమే ఎనిమిది గంటలకు మంత్రి వర్గ సమావేశం పెట్టాల్సిందని సూచించారు. ఒక్క నిమిషం కూడా నడవకుండా అసెంబ్లీ వాయిదా వేయడాన్ని ఆయన ఖండించారు.

## మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పలేదు

**బిఆర్ఎస్ ఎంఎల్ఎ గంగుల కమలాకర్**



బిసిలను 11 గంటలకు రమ్మని చెప్పి అసెంబ్లీ సభ వాయిదా వేయడం ఘోరమైన చర్య అని బిఆర్ఎస్ ఎంఎల్ఎ గంగులకమలాకర్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీని వాయిదా వేశారు అయితే తిరిగి మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారో స్పీకర్ చెప్పలేదని, సాయంత్రమా, రేపా, ఎల్లుడా ఎప్పటి వరకు అసెంబ్లీని వాయిదా వేశారో తెలపకపోవడం శోచనీయమన్నారు. ఇదా కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు ఇచ్చే గౌరవం అని ప్రశ్నించారు. క్యాబినెట్ చర్చ లేకుండా, అప్రూవల్ లేకుండా ఇదేం పద్ధతి అని ప్రశ్నించారు. ఏంచేసే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇలా చేస్తుందని ప్రశ్నించారు. కులగణన శాస్త్రీయంగా జరగాలి అన్నారు.

## ఒక్క రోజులోనే ముగించడం ఏమిటి?

**బిఆర్ఎస్ ఎంఎల్ఎ శ్రీనివాస్‌యాదవ్..**



మంత్రి శ్రీధర్ బాబు అడగ్గానే స్పీకర్ గడ్డం ప్రసాద్ శాసనసభను వాయిదా వేయడం దారుణమని బిఆర్ఎస్ ఎంఎల్ఎ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఉదయం 11 గంటలకు సభ వాయిదపడిన తరువాత మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. అత్యంత ప్రాధాన్యత గల అంశంపై నాలుగు రోజులు చర్చించకుండానే ఒక్క రోజులోనే ముగించడం ఏమిటని ప్రశ్నించారు. అన్యాయంగా, కుట్రపూరితంగా వ్యవహరించడాన్ని తాము సహించబోమని చెప్పారు. బిసిలకు అన్యాయం జరిగితే... బిసిల ఐక్యతతో అతిపెద్ద ఉద్యమం వస్తుందని హెచ్చరించారు.

## నిన, మొన్న సిఎం, మంత్రులంతా ఏంచేశారు?

**బిజెపి ఎంఎల్ఎ పాయల్ శంకర్**



నిన్న, మొన్న ముఖ్యమంత్రి, మంత్రులంతా ఏం చేశారని క్యాబినెట్ మీటింగ్ పెట్టుకోవచ్చు కదా, అసెంబ్లీ సమావేశంలో బిసి ఘణపై చర్చ అని అసెంబ్లీకి వస్తే రెండు నిమిషాలలో మధ్యాహ్నానికి సభ వాయిదా వేయడంపై బిజెపి ఎంఎల్ఎలు మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా వద్ద బిజెపి పార్టీకి చెందిన అదిలాబాద్ ఎంఎల్ఎ పాయల్ శంకర్ మాట్లాడారు. ఆయనతో పాటు కామారెడ్డి ఎంఎల్ఎ వెంకట రమాణారెడ్డి, అర్మూర్ ఎంఎల్ఎ రాకేష్ రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పవార్ ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవర్తన చూస్తుంటే వీరికి చిత్తశుద్ధి ఉన్నట్లు కనిపించడం లేదని విమర్శించారు. క్యాబినెట్ సమావేశం అసెంబ్లీ ఉన్నారోజే ఎందుకు నిర్వహించారని మండి మడ్డారు. అదిలాబాద్ నుంచి ఉదయం నాలుగు గంటలకు లేచి బయలు దేరి వస్తే అసెంబ్లీ వాయిదా వేశారని మండి పడ్డారు.

## బిసిలపై బిఆర్ఎస్ మొసలి కన్నీరు

**ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ ఆది శ్రీనివాస్**



అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. బిసిలపై బిఆర్ఎస్ మొసలి కన్నీరు కారుస్తున్నదని విమర్శించారు. గతంలో ఒక్కరోజు సర్వే చేసి నివేదిక బయట పెట్టని ఈ పార్టీ ఈరోజు బిసి కుల గణనపై మాట్లాడుతున్నదని ఎద్దేవచేశారు. స్పీకర్ అనుమతితో సభ వాయిదాపడిందని గుర్తుచేశారు. స్థానిక సంస్థల్లో 34% ఉన్న బిసిల రిజర్వేషన్లు 29%నికి తగ్గించిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఆరోపించారు. ఆరోజు బిసిలపై మీకు ఉన్న చిత్తశుద్ధి ఏమైంది? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలా నలుగురు నాలుగు గోడల మధ్య మాట్లాడి సభ ముగించే పద్ధతి కాంగ్రెస్‌ది కాదని అన్నారు. బిఆర్ఎస్ అటకెక్కించిన కుల గణనలో 51% బిసిలు ఉంటే మా కుల గణనలో 56% బిసిలు ఉన్నారని తెలిపారు.

## ఈ ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కింది

**ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బీర్ల ఐలయ్య**



50 రోజుల్లో కులగణన దేశ చరిత్రలో ఎన్నడూ జరగలేదని ఈ ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బీర్ల ఐలయ్య అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. గంగుల కమలాకర్ కు బిసి కుల గణనపై మాట్లాడే హక్కు లేదన్నారు. గతంలో చేసిన సమగ్ర కుటుంబ సర్వే లెక్కలు ఫాం హౌస్లో దాచిపెట్టారని ఆరోపించారు. రాజకీయంగా, విద్యా, ఉపాధి పరంగా బిఆర్ఎస్ ప్రభుత్వం బిసిలను అణగదొక్కారన్నారు. చర్చల్లో పాల్గొనే దమ్ము ధైర్యం లేక కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. బిసిలకు బిఆర్ఎస్ పార్టీ పదేళ్లు అన్యాయం చేసి ఇప్పుడు మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేసి తీరుతామన్నారు.

## దేశానికి రోల్ మోడల్‌గా నిల్చింది

**ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ రామ్‌చంద్రునాయక్**



తెలంగాణ రాష్ట్రం ఈ రోజున దేశానికి రోల్ మోడల్‌గా నిల్చిందని ప్రభుత్వ విప్ ఎంఎల్ఎ రామ్‌చంద్రునాయక్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. కేవలం 50 రోజుల్లో కుల గణన పూర్తిచేయడం సాహస చర్యనేనని అన్నారు. సభాపతి అందరికీ మాట్లాడే అవకాశం ఇస్తామని అన్నా, రాజకీయ అవివేకంతో బిఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. బిసి, బడుగు బలహీన వర్గాలకు అనుకూలంగా బిఆర్ఎస్ నేతలు మాట్లాడడం లేదన్నారు. ప్రజలే వీరికి బుద్ధి చెప్పాలని తెలిపారు.

## మీలాగా స్క్రిప్ట్ మేము చదవడంలేదు

**ఎంఎల్ఎ మధుసూదన్‌రెడ్డి**



ఇంటి దగ్గర తయారు చేసిన స్క్రిప్ట్ మీలాగా తాము చదవడం లేదని బిఆర్ఎస్ నేతలను ఉద్దేశించి ఎంఎల్ఎ మధుసూదన్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. ఫాం హౌస్‌లో నలుగురు కూర్చొని బిల్లులు అసెంబ్లీలో పెట్టే సాంప్రదాయం కాంగ్రెస్‌ది కాదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతుంది. ఇది హరీష్ రావు గుర్తించాలి అని అన్నారు.

# కుటుంబ సర్వేద్వారానే 'స్థానిక' రిజర్వేషన్లు

బడ్జెట్‌లో కేటాయింపులకు
సర్వే సమాచారాన్ని వినియోగిస్తాం

ఉప ముఖ్యమంత్రి
మల్లు భట్టి విక్రమార్క ప్రకటన

తెలంగాణ సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి,
రాజకీయ కులగణన సర్వే నివేదిక





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన సర్వే నివేదికకు, ఎస్‌సి వర్గీకరణ కమిషన్ నివేదికను తెలంగాణ రాష్ట్ర శాసనమండలి ఆమోదించింది. శాసనమండలి ప్రత్యేక సమావేశంలో మంగళవారం కులగణన సర్వేపై, ఎస్‌సి వర్గీకరణ నివేదికలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వేర్వేరుగా ప్రకటనలు చేశారు. ఈ ప్రకటనలపై జర్చించిన శాసనమండలి వాటిని ఏకగ్రీవంగా ఆమోదించింది. అంతకు ముందు కులగణన సర్వేపై జరిగిన చర్చకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమాధానమిచ్చారు. సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. కులగణన సమగ్రంగా లేదని బిఆర్ఎస్ సభ్యులు పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం ఎస్‌సి వర్గీకరణ నివేదికపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటన చేశారు. ఎస్‌సి వర్గీకరణకు బిఆర్ఎస్ ఎంఎల్‌సి బండ ప్రకాష్, ఎంఎల్‌సి అలుగుబెల్లి నర్సిరెడ్డి, బిజెపి సభ్యుడు ఎవిఎన్ రెడ్డి మద్దతు ప్రకటించారు.

**ఎన్నికల్లో రిజర్వేషన్‌లు, బడ్జెట్‌లో కేటాయింపులకు వినియోగిస్తాం : భట్టి విక్రమార్క**

షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతులు, రాష్ట్రంలోని ఇతర బలహీన వర్గాల సంక్షేమానికి విధానాల రూపకల్పన చేయడానికి ప్రభుత్వం కుటుంబ సర్వే సమాచారాన్ని ఉపయోగిస్తుందని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. రాష్ట్రంలో మొత్తం బిసిల సంఖ్య 56. 33 శాతం అని సమగ్ర ఇంటింటి సర్వే ద్వారా తేలిందన్నారు. ఈ సంఖ్యల ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు, బడ్జెట్‌లో కేటాయింపులకు సర్వే సమాచారాన్ని వినియోగిస్తామన్నారు. సర్వే సమాచారం ఆధారంగా సమగ్రత, పారదర్శకత ప్రాతిపదికగా నడిచే పాలనకు నూతన దశ ప్రారంభాన్ని ఈ సర్వే సూచిస్తుందన్నారు. ఈ సర్వే సమాచారం ఆధారంగా రాబోయే రోజుల్లో చాలా చేయబోతున్నామని ప్రకటించారు. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రజల వివిధ రకాల స్థితిగతులపై ఫుల్ బాడీ చెకప్ ఒక ఎక్సరే లాంటిదని అభివర్ణించారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్దతతో ఉందని ఈ సర్వే స్పష్టం చేస్తుందన్నారు. రాష్ట్రంలో 3.56 లక్షల మంది సర్వేలో పాల్గొనలేదు, ఇందులో కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి లాంటి వారు ఉన్నారని చెప్పారు. వారు ఇప్పుడు ఆసక్తి కనబరిచి సమాచారం ఇస్తే తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. టిఆర్ఎస్ నాయకులు సమగ్ర కుటుంబ సర్వే పేరిట ఒకేరోజు ఆరు గంటల్లో సర్వే పూర్తి చేశామన్నారు. మీరు(బిఆర్ఎస్ సభ్యులను ఉద్దేశించి) చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ఏం చేసుకున్నారో, ఎవరికీ తెలియదన్నారు. మీరు అధికారంగా చేసి ఉంటే సభలో పెట్టలేదన్నారు. బహిరంగంగా ప్రకటన చేయలేదు కాబట్టి, అది అధికారిక డాక్యుమెంట్ ఎలా అవుతుందని భట్టి విక్రమార్క ప్రశ్నించారు. రాష్ట్రంలో కులగణనపై ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి సైంటిఫిక్ సర్వే జరగలేదన్నారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ఇది మొదటిదని స్పష్టం చేశారు. సర్వే ఆధారంగా రాష్ట్ర వనరులు సంపదను అభివృద్ధికి కావాల్సిన విధంగా వినియోగిస్తామన్నారు. రాజకీయ, విద్య, ఆర్థిక రంగాల్లో వెనుకబడిన వారిని గుర్తించి, ఆ వర్గాల ప్రగతికి వినియోగిస్తామని తెలిపారు. బలహీన వర్గాలకు మేలు జరగాలన్న ఆలోచన ఉండదు కాబట్టి టిఆర్ఎస్ నాయకులకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వేపై నమ్మకం ఉండదన్నారు.

**బిసి కులగణన సర్వే చరిత్రాత్మకం : మహేశ్ కుమార్ గౌడ్**

బిసి కులగణన సర్వే చరిత్రాత్మకమని కాంగ్రెస్ ఎంఎల్‌సి, టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. బిసి కులగణనతో రాహుల్ గాంధీ ఆశయం నెరవేరిందన్నారు. దేశంలో మొదటిసారి కులగణనను తెలంగాణ ప్రభుత్వం చేపట్టి పూర్తి చేసిందన్నారు. తెలంగాణలో బిసిలు 50 శాతం పైగా ఉన్నారని కుల సర్వేతో వెలుగులోకి వచ్చిందన్నారు. ఇప్పటి వరకు జనాభాలో 50 శాతానికిపైగా ఉన్న జనాభాకు అన్యాయం జరిగిందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి అగ్రకులాల వాడైన రాహుల్ గాంధీ పిలుపు మేరకు సమగ్ర కుల సర్వేను జరిపించారన్నారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసి, బిఆర్ఎస్ సమగ్ర కుటుంబ సర్వే చేసి, ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. దురుద్దేశపూర్వకంగానే బిఆర్ఎస్ సభ నుంచి వాకౌట్ చేశారని విమర్శించారు.

**బిసిలకు చెందిన 135 కులాల లెక్కలు చూపించాలి : తీన్మార్ మల్లన్న :** కులగణన సర్వేలో కాంగ్రెస్ చిత్తశుద్ధిలో లోపాలు కనిపిస్తున్నాయని ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న అన్నారు. బిసి కులాల వారిగా లెక్కలు చెప్పాలన్నారు. కెసిఆర్ హయంలో సర్వేను సభలో ప్రవేశపెట్టలేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛగా అడుగుతున్నా బిసిలలో 135 కులాలలో, కులాలవారిగా లెక్కలు చెప్పాలన్నారు.

**సమగ్ర కుల సర్వే చర్చ నుంచి బిఆర్ఎస్ వాకౌట్..**

సమగ్ర కుల సర్వేలో బిసిలకు అన్యాయం జరిగిందని, ఇందుకు నిరసనగా బిఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. అంతకు ముందు చర్చలో సమగ్ర కులగణన తప్పులతడకగా ఉందని బిఆర్ఎస్ ఎంఎల్‌సి మధుసూదనాచారి, బండ ప్రకాష్, ఎల్.రమణ ఆరోపించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సమగ్ర కుల సర్వేపై సమగ్ర చర్చ జరిపాలని మధుసూదనచారి డిమాండ్ చేశారు. కెసిఆర్ హయంలో సర్వే నిర్వహిస్తే పండుగ వాతావరణంలా ఉందని, కాంగ్రెస్ హయంలో జరిగిన సర్వేలో బిసి జనాభా 20 లక్షలు తగ్గిందని రాష్ట్ర ప్రజలు గగ్గోలు పెడుతున్నారని అన్నారు. బిసిలకు అన్యాయం చేసేలా సర్వే నివేదిక ఉందని, దీన్ని తాము తీవ్రంగా నిరసిస్తున్నామని తెలిపారు. కెసిఆర్ హయాంలో జరిగిన సమగ్ర కుటుంబ సర్వే నివేదికను బయటపెట్టలేదుగా అని చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మధుసూదనచారిని ఉద్దేశించి అన్నారు. బిసి జనాభా 20లక్షలు తగ్గిందని, ఎస్‌సిల జనాభా కూడా తగ్గిందని, ఓసిల జనాభా పెరిగినట్లు చూపించారని బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత అన్నారు. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌లను కేంద్ర ప్రభుత్వం సిగ్గు లేకుండా తెచ్చిందని బండ ప్రకాష్ విమర్శించారు. బిసి 42 శాతం రిజర్వేషన్‌లను వెంటనే అమల్లోకి తేవాలన్నారు. ఎస్‌సి వర్గీకరణపై చర్చించిన సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం సభను ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నిరవధికంగా వాయిదా వేశారు.

## కులాలవారీగా ఎస్సీవర్గీకరణ వివరాలు

**గ్రూప్ – I**

| వరుస సంఖ్య | కులం | కులం పేరు | జనాభా | మొత్తం షెడ్యూల్డ్ కులాల జనాభాలో శాతం |
|---|---|---|---|---|
| 1 | 8 | బావురి | 127 | 0.002 |
| 2 | 9 | బేడా (బుడ్గ) జంగం | 1,11,710 | 2.141 |
| 3 | 12 | చదాటి | 125 | 0.002 |
| 4 | 17 | డక్కల్, డొక్కల్వార్ | 2558 | 0.049 |
| 5 | 27 | జగ్గలి | 2579 | 0.049 |
| 6 | 29 | కొలుపులవాండ్లు, పంబాడ, పంబండ, పంబాలా | 931 | 0.018 |
| 7 | 42 | మాంగ్ | 13260 | 0.254 |
| 8 | 43 | మాంగ్ గరోడి | 1392 | 0.027 |
| 9 | 44 | మన్నే | 29656 | 0.568 |
| 10 | 45 | మష్టి | 1246 | 0.024 |
| 11 | 46 | మాతంగి | 704 | 0.013 |
| 12 | 47 | మెహతర్ | 6973 | 0.134 |
| 13 | 49 | ముండాల | 212 | 0.004 |
| 14 | 55 | సంబన్ | 108 | 0.002 |
| 15 | 56 | సప్రు | 44 | 0.001 |
| మొత్తం | | | 171625 | 3.288 |

**గ్రూప్ – II**

| వరుస సంఖ్య | కులం | కులం పేరు | జనాభా | మొత్తం షెడ్యూల్డ్ కులాల జనాభాలో శాతం |
|---|---|---|---|---|
| 1 | 5 | అరుంధతీయ | 107 | 0.002 |
| 2 | 10 | బైండ్ల | 13082 | 0.251 |
| 3 | 14 | చమర్, మోచి, ముచి, చమర్-రవిదాస్, చమర్-రోహిదాస్ | 17068 | 0.327 |
| 4 | 15 | చంబర్ | 632 | 0.012 |
| 5 | 16 | చండాల | 64 | 0.001 |
| 6 | 18 | దండాసి | 86 | 0.002 |
| 7 | 20 | డోమ్, డొంబరా, పైడి, పానో | 1926 | 0.037 |
| 8 | 21 | ఎల్లమ్మల్వార్, ఎల్లమ్మలవాండ్లు | 504 | 0.010 |
| 9 | 23 | గోదారి | 208 | 0.004 |
| 10 | 28 | జాంబువులు | 108 | 0.002 |
| 11 | 31 | మాదిగ | 3233642 | 61.967 |
| 12 | 32 | మాదిగ దాసు, మష్టీన్ | 1663 | 0.032 |
| 13 | 51 | పామిడి | 51 | 0.001 |
| 14 | 52 | పంచమ, పరియ | 63 | 0.001 |
| 15 | 54 | సమగర | 1046 | 0.020 |
| 16 | 57 | సింధోల్లు (చిందోల్లు) | 3872 | 0.074 |
| 17 | 58 | యాటల | 163 | 0.003 |
| 18 | 59 | వల్లువన్ | 92 | 0.002 |
| మొత్తం | | | 3274377 | 62.748 |

**గ్రూప్ – III**

| వరుస సంఖ్య | కులం | కులం పేరు | జనాభా | మొత్తం షెడ్యూల్డ్ కులాల జనాభాలో శాతం |
|---|---|---|---|---|
| 1 | 1 | ఆది ఆంధ్ర | 2289 | 0.044 |
| 2 | 2 | ఆది ద్రావిడ | 651 | 0.012 |
| 3 | 3 | అనాముక్ | 17 | 0.0003 |
| 4 | 4 | అరే మాల | 1992 | 0.038 |
| 5 | 6 | అర్వ మాల | 8398 | 0.161 |
| 6 | 7 | బారికి | 83 | 0.002 |
| 7 | 11 | బ్యాగర, బ్యాగరి | 9672 | 0.185 |
| 8 | 13 | చలవాడి | 160 | 0.003 |
| 9 | 19 | డోర్ | 2146 | 0.041 |
| 10 | 22 | ఘాసి, హడ్డి, రెల్లి, చాచండి | 84 | 0.002 |
| 11 | 24 | గోసంగి | 23351 | 0.447 |
| 12 | 25 | హోలేయా | 358 | 0.007 |
| 13 | 26 | హోలేయ దాసరి | 8482 | 0.163 |
| 14 | 30 | మాదాసి కురువ, మదారి కురువ | 3707 | 0.071 |
| 15 | 33 | మహర్ | 31938 | 0.612 |
| 16 | 34 | మాల, మాల అయ్యవార్ | 1527143 | 29.265 |
| 17 | 35 | మాల దాసరి | 6630 | 0.139 |
| 18 | 36 | మాల దాసు | 925 | 0.018 |
| 19 | 37 | మాల హన్నాయ్ | 37 | 0.001 |
| 20 | 38 | మాలజంగం | 3187 | 0.061 |
| 21 | 39 | మాల మస్టి | 108 | 0.002 |
| 22 | 40 | మాలసాలే, నేతకాని | 133072 | 2.550 |
| 23 | 41 | మాల సన్యాసి | 162 | 0.003 |
| 24 | 48 | మిత అయ్యల్వార్ | 3118 | 0.060 |
| 25 | 50 | పాకి, మోటి, తోటి | 947 | 0.018 |
| 26 | 53 | రెల్లి | 3025 | 0.058 |
| మొత్తం | | | 1771682 | 33.963 |

## గాంధీ భవన్‌లో సంబరాలు

బిసి కులగణనపై
అసెంబ్లీలో తీర్మానం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎస్‌సి వర్గీకరణ పై ప్రభుత్వం నివేదిక ఇవ్వడం, బిసి కులగణనపై అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించడం పట్ల గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎంఎల్‌సి వెంకట్, ఒబిసి చైర్మన్ నూతి శ్రీకాంత్, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయి, దళిత కాంగ్రెస్ చైర్మన్ ప్రీతమ్ లతో పాటు పెద్దఎత్తున కార్యకర్తలు, నేతలు సంబరాలు జరుపుకున్నారు. డప్పులు, వాయిద్యాలతో ఒకరినొకరు సన్మానించుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ... జీవితాంతం ఎస్సీలు కాంగ్రెస్ పార్టీ ని, రేవంత్ రెడ్డిని గుర్తుపెట్టుకుంటారని అన్నారు. కాంగ్రెస్ మార్క్ విజయం కులగణన, ఎస్సీ వర్గీకరణ అని పేర్కొన్నారు. సిఎం రేవంత్, మంత్రుల బృందానికి టిపిసిసి తరపున శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టో పొందుపరిచిన విధంగా కులగణన, ఎస్‌సి వర్గీకరణ జరగడం సాహసోపేతమైన నిర్ణయాలని అని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు కుల గణన సర్వే చేపట్టి పూర్తిచేశామన్నారు. మాటకు కట్టుబడి కాంగ్రెస్ పార్టీ ఉంటుందని అనడానికి నిదర్శనం కుల గణన, ఎస్‌సి వర్గీకరణ అని తెలిపారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ నేతలు అవకాలు చెవాకులు పేలడం మానుకోవాలిలన్నారు. ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ మాట్టాడుతూ...ఎస్‌సి వర్గీకరణ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రోజు అసెంబ్లీలో తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మక అంశం అని పేర్కొన్నారు. మంత్రులు చంద్రశేఖర్, పుష్పలీల, ఎ.సోమన్న, నమిల్ల శ్రీనివాస్, సతీష్ మాదిగ పాల్గొన్నారు.



సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య రాజకీయ మరియు కుల సర్వే-2024 తీర్మానాన్ని అసెంబ్లీలో ఆమోదించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఎంఎల్‌సి మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, బిసి ఎంఎల్‌లు, ఎంఎల్‌సిలు

## మరోసారి కులగణన సర్వే చేపట్టాలి

**ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కుల గణన సర్వే దరఖాస్తు నమూనాను మార్చి, మరోసారి కులగణన సర్వే చేపట్టాలని బిఆర్ఎస్ సభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రిజర్వేషన్లను అమలు చేయాలని శాసనసభ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసినప్పటికీ ఎటువంటి ప్రయోజనం ఉండబోదన్నారు. బలహీనవర్గాల తమ హక్కుల కోసం పోరాటం చేసినప్పటికీ 75 సంవత్సరాల కాలంలో ఏ ప్రభుత్వం కూడా ఆలోచన చేసిన దాఖలాలు లేవన్నారు. శాసనసభ ప్రత్యేక సమావేశంలో 'కులగణన సర్వే'పైన సిఎం చేసిన ప్రకటనపైన మంగళవారం జరిగిన చర్చలో తలసాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లో 30 శాతం కూడా సర్వేలో జరగలేదని, దరఖాస్తు ప్రొఫార్మను చూసి చాలా మంది సర్వేలో పాల్గొనలేదని తెలిపారు. 42 శాతాన్ని కల్పించిన తర్వాత స్థానిక సంస్థ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. బిసి రిజర్వేషన్ల అంశంపైన తమిళనాడు తరహా చట్టబద్ధత కల్పించాలన్నారు.

## టివివిపి ఆస్పత్రులలో కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి

ఏడునెలలుగా వేతనాలు ఇవ్వకుంటే
పేద కార్మికుల జీవనం ఎలా?

జీతాలు చెల్లించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా
నిరవధిక సమ్మె

ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి
ఎం. నరసింహ హెచ్చరిక




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అత్యంత దుర్భర పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్న టివివిపి ఆస్పత్రులలో పారిశుధ్యం, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ డిమాండ్ చేశారు. వెంటనే వేతనాలు చెల్లించకపోతే నిరవధిక సమ్మె చేపడుతామని హెచ్చరించారు. టివివిపి ఆస్పత్రుల్లో జీతాల కోసం చేపట్టిన రోజులో ఒక గంట నిరసన ధర్నాలో భాగంగా మంగళవారం కింగ్‌కోఠి జిల్లా ఆస్పత్రిలో జరిగిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

మాట్లాడుతూ తెలంగాణ వైద్య విధానపరిషత్ పరిధిలోని పారిశుద్ధ్యం, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల జీతాలపై ప్రభుత్వం సంవత్సరానికి ఒకసారి మాదిరిగా జీతాలు చెల్లిస్తే పేద కార్మికులు ఏవిధంగా జీవిస్తారని ప్రశ్నించారు. గత ఏడునెలల క్రితం ఒకసారి సమ్మె నోటీసు ఇస్తే కొన్ని జీతాలు ఇచ్చిన ప్రభుత్వం మళ్ళీ గత ఏడు నెలలుగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం, కాంట్రాక్టర్ల మధ్య పేద కార్మికుల జీవితాలు నలిగిపోతున్నాయని నరసింహ ఆవేదన వ్యక్తం చేశారు. నెలవారి వేతనాలపై జీవనం సాగించే కార్మికులు పిల్లల చదువులు, ఇంటి అద్దెలు సకాలంలో చెల్లించలేక తీవ్ర స్థాయిలో సతమతమవుతున్నారని అన్నారు. గత రెండున్నర సంవత్సరాల క్రితం పిలిచిన టెండర్‌లో వీరి జీతాలు 13600 రావాల్సిన ఉండగా కేవలం 11000 మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారని, పిఎఫ్ డబ్బులను కూడా తక్కువగా చెల్లిస్తున్నారని తెలిపారు. ఈ విషయాలపై రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. ఇతర ప్రభుత్వ శాఖలలో ప్రతినెల 1వ తేదీలోపు వేతనాలు చెల్లిస్తున్నామని చెప్పుతున్న ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు మాత్రం నెలల తరబడి వేతనాలు అందకపోయిన పట్టించుకపోవడం అన్యాయమన్నారు. టివివిపి కార్మికులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం నుండి జీతాలు అందే విధంగా కమిటీని ఏర్పాటు చేసిన ప్రభుత్వం దానిపై ముందడుగు వేయకుండా ఉందన్నారు. వెంటనే కార్మికుల సమస్యలపై స్పందించి రాష్ట్ర ప్రభుత్వం జీతాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెను చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు సంతోష్, ఎన్.లక్ష్మి, కౌసల్యమ్మ, అంజమ్మ, ప్రకాష్, గణేష్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నపై డిజిపికి రెడ్డి సంఘంనేతల ఫిర్యాదు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న ఇటీవల రెడ్డి సామాజిక వర్గంపై చేస్తున్న వివాదస్పద విమర్శల పట్ల రెడ్డి సంఘాలు మండిపడుతున్నాయి. బిసి కులాల సమావేశాల్లో రెడ్లను దూషిస్తున్న తీరుపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరి 28న వరంగల్ వేదికగా నిర్వహించిన బిసి సభలో తీన్మార్ మల్లన్న రెడ్డి కులంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారని, కుక్కలతో పోలుస్తూ దూషించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. మల్లన్న వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా రెడ్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెడ్డి కులాన్ని కించపరిచేలా దూషించారని, అతనిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తున్నారు. ఈమేరకు ఇప్పటికే హైదరాబాద్ ఉప్పల్ పోలీసులకు రెడ్డి మహిళా సంఘం నేతలు ఫిర్యాదు చేయగా.. మంగళవారం డిజిపి డాక్టర్ జితేందర్‌ను కలిసిన రెడ్డి సంఘం నేతలు మల్లన్నపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. బబ్బూరి వెంకటేష్ ఆధ్వర్యంలో రెడ్డి నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లన్న ఎక్కడి నుంచి ఎక్కడికి వచ్చారో గుర్తుచేసుకోవాలన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో మా ఓట్లు కూడా వేశామన్న సంగతి మరువరాదని వారు పేర్కొన్నారు. మల్లన్న సిఎం, పిఎం ఏదైనా మాకు అభ్యంతరం లేదని.. మా కులాన్ని అవమానిస్తే మాత్రం సహించేది లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా మల్లన్న వ్యవహారంపై వెంటనే స్పందించాలని వారు కోరారు. ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆ సంఘం నేతలు డిమాండ్ చేశారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ : మల్కాజిగిరి సర్కిల్-28**

**NIT No. 52/EE-28/SBZ/GHMC/2024-25**

**పని పేరు:** నిర్వహణ పనులు: ఇతర పనులు-03, **అంచనా విలువ:** రూ.57.60 లక్షలు, **బిడ్స్ దాఖలుకు ప్రారంభ తేదీ & సమయం / బిడ్స్ దాఖలుకు ఆఖరి తేదీ & సమయం:** 05.02.2025న మ.3.30గం.ల నుండి 12.02.2025న మ.3.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్‌నెం. 9154796465, 7331189186. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 9967-PP/CL/ADVT/1/2024-25, Date: 04-02-2025

ప్రజాపక్షం
బుధవారం, ఫిబ్రవరి 05

# కొత్త చరిత్రకు నాంది

తెలంగాణ శాసనసభ చరిత్రలో మంగళవారం కొత్త అధ్యాయం ఆరంభమైంది. ఒకేసారి రెండు చరిత్రాత్మక నిర్ణయాలు సువర్ణాక్షరాలతో లిఖించబడినాయి. ఒకటి, కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన సమగ్ర కుటుంబ సర్వే(కులగణన) నివేదికను మంత్రివర్గం ఆమోదించిన తదుపరి శాసనసభ/మండలి ఆమోదించాయి. రెండు, ప్రభుత్వ విద్య, ఉద్యోగాల్లో చట్టబద్ధ రిజర్వేషన్‌లలో ఎస్‌సిల కోటాను మాల, మాదిగల మధ్య వారి జనాభా నిష్పత్తిలో పంపిణీ చేసేందుకు ఉద్దేశించి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జస్టిస్ షమీమ్ అఖ్తర్‌తో నియమించిన ఏక సభ్య కమిషన్ సమర్పించిన నివేదికకు స్వల్పమార్పుతో ఆమోదం. ప్రభుత్వ పరిభాషలో ఒసిలుగా పిలవబడే అగ్రవర్ణాల జనాభా (కుటుంబ సర్వే ప్రకారం 15.79శాతం), యేతర విభాగాలన్నిటికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ లాభం చేకూర్చేందుకు, వారి జనాభా దామాషాలో భాగస్వామ్యానికి ఈ రెండు నిర్ణయాలు బాటలు వేస్తాయి. వీటిని చిత్తశుద్ధితో అమలు జరిపే నిజాయితీ పాలకవర్గాల్లో ఉండాలి. జనాభాలో అల్పసంఖ్యాకులుగా ఉన్న అగ్రవర్ణాలు రాజకీయం సహా అన్ని రంగాల్లో చారిత్రకంగా ఆధిపత్యం వహిస్తున్నాయి. స్వాతంత్ర్యం నాటినుంచీ దేశాన్ని పాలిస్తున్న పార్టీలు దళితులకు, బడుగు బలహీన తరగతులకు బహుస్వల్పంగా ఉపశమన చర్యలు ప్రకటిస్తూ, జనాభాలో మెజారిటీగా ఉన్న బిసిలను ప్రలోభాలతో అణిచిపెడుతూనే ఉన్నాయి. జాతీయస్థాయిలో ఎన్ని బిసి కమిషన్‌లు వేసినా వాటి నివేదికలకు చెదలు పట్టింది తప్ప సవ్యంగా అమలుకు నోచుకోలేదు. రెండోవైపున, ఆ బిసిల్లో తమ హక్కులకోసం, సామాజిక న్యాయంకోసం చైతన్యం వృద్ధి చెందసాగింది. దాని పర్యవసానమే బి.సి.మండల్ కమిషన్ ఏర్పాటు. ఆ కమిషన్ బిసిలు జనాభాలో 50శాతంపైగా ఉన్నారని నిర్ధారణకు వచ్చికూడా, అన్ని రకాల రిజర్వేషన్‌లు కలిపి 50శాతం మించరాదని సుప్రీంకోర్టు లక్ష్మణరేఖ గీసినందున బిసిలకు 27 శాతం రిజర్వేషన్‌లు సిఫారసు చేసింది. ఇందిరాగాంధి ప్రభుత్వం దాదాపు 10సంవత్సరాలు ఆ నివేదికకు దుమ్ము పట్టించారంటే, పాలకపార్టీలపై అగ్రవర్ణాలకు ఆనాడున్న పట్టును అర్థం చేసుకోవచ్చు. ఈనాడు ఆ పట్టు పారిశ్రామిక, వాణిజ్య తరగతుల చేతుల్లోకి మారింది.

> కేంద్రం సానుకూల నిర్ణయం చేయకపోయినా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ – రాష్ట్ర జనాభాలో 56.33 శాతంగా ఉన్న బిసిలకు 42శాతం సీట్లు కేటాయిస్తుందని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి ప్రకటించారు.

మన దేశంలో రాజకీయ అస్థిరత తలెత్తినపుడే ప్రజలకు మేలుచేసే సంస్కరణలు అమలులోకి వచ్చిన విషయాన్ని గుర్తు చేసుకోవాలి. 1969లో కాంగ్రెస్‌లో చీలిక సందర్భంలో ఇందిరాగాంధి బ్యాంకుల జాతీయకరణ, రాజాభరణాల రద్దు వంటి చర్యలు తీసుకున్నారు. 1972 ఎన్నికల అనంతరం ఆమె ఆదేశంపై కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వాలు మౌలికమైన భూగరిష్ట పరిమితి చట్టాలు తెచ్చాయి. అమలులో తూట్లు పొడిచారు – అది వేరు విషయం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో నాటి ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావు ఆ రాడికల్ బిల్లు పెట్టి చట్టం చేశారు. అయితే భూస్వామ్య శక్తులు 'జై ఆంధ్ర' పేరుతో కోస్తాంధ్రలో ఆందోళన లేవదీసి ఆయన పదవి ఊడగొట్టారు. అలాగే కేంద్రంలో కాంగ్రెస్ అధికారం కోల్పోయి బిజెపి, వామపక్షాల మద్దతుతో వి.పి.సింగ్ ప్రభుత్వం పనిచేస్తున్న కాలంలో ఆయన రాజకీయ ప్రయోజనం ఆశించి మండల్ కమిషన్ నివేదిక దుమ్ముదులిపి ఆ సిఫారసులు అమలులోకి తెచ్చారు. దాంతో బిజెపి ఆ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుని బిహార్ తదితర రాష్ట్రాల్లో మండల్ వాదులకు వ్యతిరేకంగా కమండల్(అయోధ్య) ఆందోళనను భుజాన వేసుకుంది. మండల్ కమిషన్ బిసిల్లో తెచ్చిన రాజకీయ చైతన్యం బిహార్, యుపి తదితర రాష్ట్రాల్లో బిసి పార్టీలను అధికారంలోకి తెచ్చింది.

వర్తమానంలోకి వస్తే దళితులు, బిసిలకు జనాభా దామాషాలో ప్రాతినిధ్యం, పథకాల అంశాన్ని గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధి ప్రచారంలోకి తెచ్చారు. ఇందుకుగాను దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతో పాటు కులగణనను ఆయన డిమాండ్ చేశారు. ఆ నేపథ్యంలోనే తెలంగాణా కాంగ్రెస్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్‌లు వాగ్దానం చేసింది. అందుకై సంవత్సరం క్రితం అసెంబ్లీలో తీర్మానం చేసి కులగణన సమగ్ర సర్వే నిర్వహించింది. ఆ జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్‌లు కల్పిస్తూ రాజ్యాంగ సవరణ చేయాలని కేంద్రాన్ని అసెంబ్లీ కోరింది. అందుకు బిఆర్‌ఎస్. బిజెపి తోడ్పాటును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. కేంద్రం సానుకూల నిర్ణయం చేయకపోయినా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ – రాష్ట్ర జనాభాలో 56.33 శాతంగా ఉన్న బిసిలకు 42శాతం సీట్లు కేటాయిస్తుందని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి ప్రకటించారు. వచ్చే బడ్జెట్ కేటాయింపుల్లో జనాభా దామాషాలో పథకా లు, నిధులు కేటాయింపు మొదలు పెట్టాలి. ఏ ప్రభుత్వ నిజాయితీకైనా ఆచరణే కదా గీటురాయి.

ఎస్‌సిల కేటగిరీలో దేశంలో కొన్ని వందల కులాలున్నాయి. రిజర్వేషన్ ఫలాల్లో న్యాయం కోసం ఎస్‌సి వర్గీకరణ ఉద్యమం ఉమ్మడి రాష్ట్రంలో మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ముప్పదేళ్ల క్రితం మొదలైంది. అది వటుడు ఇంతింతై అంతింతైనట్లు ఉధృతంగానే సాగింది. ఇరవైఏళ్ల క్రితమే రాష్ట్ర శాసనసభ వర్గీకరణకు అనుకూలంగా ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. కేంద్రం ఉషా మెహ్రా కమిటీ వేసింది. నివేదిక వచ్చినా ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క రకం అవరోధా లు. ఎట్టకేలకు సుప్రీంకోర్టు గత సంవత్సరం రాష్ట్రాలకు వర్గీకరణ వెసులుబాటు ఇచ్చింది. ఆంధ్ర–తెలంగాణ రాష్ట్రాలు వెంటనే హర్షం ప్రకటించి అమలు చేస్తామని ప్రకటించాయి. తెలంగాణలో ఈ అంశం అమలు దశకు చేరింది, అయితే దీనిపై గుర్రుగా ఉన్న మాలలు ఏదో ఒక కొర్రీ లేవనెత్తకపోరు. అయితే జస్టిస్ అఖ్తర్ ఎస్‌సి కులాలను సామాజిక, ఆర్థిక స్థితిగతులు ప్రాతిపదికగా వర్గీకరించినందున లిటిగేషన్‌కు అవకాశం ఉండకపోవచ్చు. ఇప్పుడిక ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిపై ఒత్తిడి మొదలవుతుంది.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నట్లు ఈ రెండు ప్రధాన చర్యలు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే అమలులోకి రావటం ముఖ్యమంత్రిగా ఆయనకు ఎంతో సంతృప్తి నిచ్చే సందర్భం. ఆచరణలో ఎదురయ్యే ఆటుపోట్లను ఇంతే పట్టుదలతో ఆయన అధిగమించాలని కోరుకుందాం!

## ప్రజల మనిషి, వైతాళికుడు

# వట్టికోట ఆళ్వారుస్వామి

అతను ఒక ఉద్యమకర్త, సేవాశీలి, కమ్యునిష్టు నేత, ప్రచురణకర్త, పాత్రికేయు లు, నవలలకు ప్రాణం పోసిన మేధావి, ధిక్కార స్వరం, వైతాళికుడు, అభ్యుద య రచయిత ఆయనే. వట్టికోట ఆళ్వారుస్వామి 'ప్రజలమనిషి' నవల ద్వారా ప్రజల కోసం పనిచేసే నాయకులు ఎలా ఉండాలో దిశానిర్దేశం చేశారు. గ్రంథాలయోద్యమకారుడిగా, ప్రచురణకర్తగా విశిష్టమైన పాత్ర పోషించారు. ''ఒక సందర్భంలో అసలు ఆళ్వార్లు పన్నెండు మందే, పదమూడో ఆళ్వారు మా వట్టికోట ఆళ్వారుస్వామి'' అని మహాకవి దాశరథి కీర్తించిన స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజారచయిత, నిస్వార్థ సేవా పరాయణుడు వట్టికోట ఆళ్వారుస్వామి. నల్లగొండ జిల్లాలోని శాలిగౌరారం మండలం (నకిరేకల్ సమీపంలోని) మాధవరం గ్రామంలో 1915 నవంబర్ ఒకటిన, ఒక నిరుపేద బ్రాహ్మణ కుటుంబంలో ఆళ్వారుస్వామి జన్మించారు. చిన్నతనంలోనే తండ్రి చనిపోగా, పరాయి ఇండ్లలో వంటలు చేసిపెట్టి, పనులుచేసి బతికాడు. అందువల్ల ప్రాథమిక దశలో కూడా విద్యాభ్యాసానికి నోచుకోలేదు. పదమూడు, పధ్నాలుగేండ్ల వయసులో సూర్యాపేటలో గ్రంథాలయం ద్వారా ఆయనకు చదువు పరిచయం మొదలైంది. ఈ గ్రంథా లయంలోనే అనేక పుస్తకాలు చదువుకున్నారు. సొంతంగా తెలుగు, ఇంగ్లీషు కూడా నేర్చుకున్నారు. ఈ క్రమంలోనే నకిరేకల్, సూర్యాపేట, ప్రాంతాల్లోని ఇండ్లలో వంట పనులు, విజయవాడలో హోటల్ సర్వర్ వృత్తి, హైదరాబాద్‌లో రీడర్ పని వంటి అనేక జీవన ప్రయాణాలు చేశాడు. చివరికి, 1936–37 ప్రాంతంలో హైదరాబాద్ చేరి గోల్కొండ పత్రి క లో ప్రూఫ్ రీడర్ ఉద్యోగంలో చేరాడు. అప్పటి నుండి 1961 ఫిబ్రవరిలో మరణించేవరకూ ఆయన జీవితమంతా సాహిత్య, సామాజిక కార్యక్రమాలకే అంకితమయింది. కమ్యూనిస్టు కావడం వల్లనే జైలుకు వెళ్లాల్సి వచ్చింది. జైలు జీవితం నుంచి బయటికొచ్చాక కూడా అనేక ఉద్యమాల్లో పనిచేశారు. స్టేట్ కాంగ్రెస్, ఆర్య సమాజం, ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ, అభ్యుదయ రచయితల సంఘం, తెలంగాణ రచయితల సంఘం వంటి సామాజిక, రాజకీయ, సాహిత్య సంస్థలన్నింటిలో చురుకయిన కార్యకర్తగా, నాయకుడిగా పనిచేశాడు. ఆల్ హైదరాబాద్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, గుమస్తాల సంఘం, రిక్షా కార్మికుల సంఘం, రైల్వే ఉద్యోగుల ఆందోళన వంటి కార్మికోద్యమ సంస్థలకు ముందు వుండి నాయకత్వం వహిస్తూ , తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట విరమణ తర్వాత కమ్యూనిస్టు పార్టీకి దూరమైనా, 1959లో కేరళలో నంబూద్రిపాద్ మంత్రివర్గాన్ని కేంద్రప్రభుత్వం బర్తరఫ్ చేయగానే, అందుకు నిరసనగా మళ్లీ కమ్యూనిస్టు పార్టీలో చేరారు. ఆళ్వారుస్వామి, 1938లో 'ప్రజల మనిషి' నవల రూపొందించారు. ఆళ్వారుస్వామి మొదట్లో రచించిన కథల కన్నా 'జైలు లోపల' కథలు భాష, శైలి, కథనం, కథన శిల్పంలో ముఖ్యమయినవి. కథకునిగా, నవలాకారునిగా, ప్రజా ఉద్యమ నాయకునిగా ఆళ్వారుస్వామి జీవితకాలమంతా చేసిన కృషి ఈనాటి రచయితలకీ, కవులకీ ఆదర్శప్రాయం. తెలంగాణ సాయుధ పోరాటకాలంలో ఆరు సంవత్సరాల పాటు జైలు జీవితం అనుభవించిన రచయిత ఆళ్వారుస్వామి. వారు 1961, ఫిబ్రవరి 5న మరణించారు.



కామిడి సతీష్ రెడ్డి,జయశంకర్ భూపాలపల్లి జిల్లా, 9848445134

# శ్రామిక సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర బడ్జెట్!

## ఫిబ్రవరి 5న నిరసనలకు పిలుపు!!



ఉజ్జిని రత్నాకరరావు
9490952646

బిజెపి నాయకత్వంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ముచ్చటగా మూడో సారి అధికారంలో చేపట్టిన తరువాత ప్రవేశపెట్టిన రూ.50,65,345 కోట్ల బడ్జెట్ దేశ సంపద సృష్టికర్తల్లో ప్రధాన భూమిక పోషిస్తున్న శ్రమజీవులకు, కార్మికులకు, రైతులకు రక్షణలు, సామాజిక భద్రత కల్పించే విధంగా లేదనే చెప్పాలి. గ్రామీణ ప్రజలకు మొండి చేయి చూపించి, మధ్య మరియు ఉన్నత వర్గాల వేతన జీవులకు ఆదాయం పన్ను రూ.12 లక్షల వరకు మినహాయించడం కొంత ఊరట కల్పించినప్పటికీ, దేశంలో 140 కోట్ల ప్రజల కొనుగోలు శక్తి పెరగకుండా, నేటికీ 40 శాతం రైతాంగం భూమిని నమ్ముకుని దేశప్రజలకు పంటలు పండించి ఆహారాన్ని అందించే వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు నిర్ణయించకపోవడం, రుణమాఫీ, ఫసల్ బీమా, ఎరువు ధరల క్రమబద్ధీకరణ లాంటి డిమాండ్లతో చేస్తున్న ఆందోళనలను గుర్తించక పోవడం, జిఎస్టి పేరుతో ట్యాక్స్ లు వసూలు చేస్తూ ..ఆదాయం పన్ను చెల్లిస్తున్న 4 కోట్ల మందికి కొంత ఊరట కలిగించి చేతులు దులుపుకుంది. ఆదాయం మినహాయింపు కారణంగా ప్రభుత్వ ఖజానాపై లక్ష కోట్ల రూపాయల అదనపు భారం పడుతుందంటూ మొసలి కన్నీరు కార్చింది.. గ్రామీణ ప్రజలకు మొండి చెయ్యి చూపించింది. బడ్జెట్ రూపకల్పన సమాఖ్య స్ఫూర్తి, ఆర్థికవిధానానికి అనుగుణంగా ఉండాలి. కానీ బడ్జెట్ పూర్తిగా బిజెపి పాలిత రాష్ట్రాలకు అనుకూలం గా, ఎన్నికలు జరుగబోతున్న బీహార్ కు అధిక నిధులు కేటాయించటం బట్టి చూస్తే ఇది పూర్తిగా పక్షపాతంతో వివక్షతతో ఉన్నదనేది స్పష్టం. కార్పొరేట్ అనుకూల విధానాలను ప్రతిబింబించే ఈ బడ్జెట్‌ను వ్యతిరేకించాలని, ప్రజల జీవనాధార సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వానికి నిరసన తెలియజేయాలని ప్రజా కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి.

**తిరోగమన బడ్జెట్ :** శ్రమజీవులకు, ప్రజల జీవితాలకు బతుకు తెరువుకు భారంగా ఉందని, కార్మికుల హక్కులను హరిస్తూ, గ్రామీణ రైతు కూలీలకు ఇస్తున్న రాయితీలను తగ్గిస్తూ, కార్పొరేట్ పెట్టుబడుదారులకు రాయితీలు ఇస్తున్న కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసనలు తెలపాలని కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. బడా బాబుల బొజ్జలను మరింతగా నింపేలా, మధ్యతరగతి ఉద్యోగులను మభ్య పెట్టేలా ఈ బడ్జెట్ ఉందని, సరళీకృత ఆర్థిక విధానాలను వేగంగా అమలు చేసేందుకు ఊతమిచ్చేలా బడ్జెట్ రూపకల్పన జరిగిందని. నిత్య జీవితాల సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని, ఆహార సరుకుల ధరలు విపరీతంగా పెరుగుటతో పాటు, కష్టజీవుల జీవితాలను అతలాకుతలం చేసే విధంగా ఉన్నాయని, ఉపాధి నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని.. సూక్ష్మ చిన్న మధ్యతర పరిశ్రమల్లో ఉపాధి కల్పన, కార్మిక భద్రతకు సంబంధించిన అంశాలు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించకపోవడం తీవ్ర అన్యాయం జరిగింది.

**బడ్జెట్లో తెలంగాణకు అన్యాయం:** తెలంగాణ రాష్ట్ర విభజన చట్టంలో అనేక అంశాలను తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ పదేళ్ల తర్వాత కూడా పరిష్కరించే చర్యలు తీసుకోకపోవడం, పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలైన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఐటిఐఆర్ పునరుద్ధరణ, ఐఐటి, ఐఐఎం, ఐ కార్, ఎన్‌ఐడి, ట్రిపుల్ ఐటీ వంటి ఉన్నత విద్యా సంస్థల్లో ఏది ఇవ్వకపోవడం తీవ్ర అన్యాయం జరిగింది. విభజన చట్టంలో తెలంగాణలో గిరిజన యూనివర్సిటీకి అనుమతి ఇచ్చినప్పటికీ పూర్తిస్థాయి నిధులు కేటాయించలేదు. విభజన చట్టంలోని కీలకంగా ఉన్న 9, 10 షెడ్యూల్ లోని అంశాలను నేటికీ పరిష్కరించకపోవడం, ఈ షెడ్యూల్‌కు సంబంధించిన 20 సంస్థల నిధుల పెంపకంపై పరిష్కరించకపోవడం, ఇచ్చిన హామీలపై కనీసం చర్చించక పోవటం, వాటిని అమలుపర్చేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దృష్టి పెట్టకపోవటమే కాకుండా నిండు పార్లమెంటులో తల్లినిబిడ్డను విడదీసినారని రాష్ట్రవిభజనపై మోడీ విషం వెళ్ళగక్కినారు. రెండు రాష్ట్రాల మధ్యఉన్న విభజనచట్టం లోని అంశాలు అమలుకు కేంద్రం పెద్దన్న పాత్ర వహించి పరిష్కరించటంలో ఏమాత్రం శ్రద్ధచూపలేదు..

**తెలంగాణ ప్రాజెక్టులకు మొండిచెయ్యి**

నరేంద్ర మోదీ విడిపోయిన రెండు రాష్ట్రాల పునర్నిర్మాణానికి గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వానికి, నేడు కాంగ్రెస్ ప్రభుత్వానికి చేయూతనివ్వడంలో పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారు. అందుకు తార్కాణం 2025–26 సంవత్సరము కేంద్ర బడ్జెట్లో నిధులు ఇవ్వకపోవడమే.. హైదరాబాదుతో పాటు రాష్ట్ర అభివృద్ధికి చేపట్టనున్న ప్రాజెక్టులకు సాయం అవసరం అని నిధులు, అనుమతుల మంజూరు కోరుతూ ప్రభుత్వం పలు ప్రతిపాదనలు చేసి సుమారు రూ.1.63 లక్షల కోట్ల నిధులు కావాలని కోరితే.. ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. గోదావరి బేసిన్‌లోని మల్లన్న సాగర్ నుంచి 15 టిఎంసిలను హైదరాబాదుకు తరలించడానికి 'గోదావరి మూసి అనుసంధాన' ప్రాజెక్టుకు ప్రత్యేక గ్రాంట్ క్రింద రూ.7,440 కోట్లు, మెట్రో రైలు రెండో దశ కింద రూ.24,249 కోట్లతో 76.4కి.మీ పొడవుతో ఐదు కారిడార్ల నిర్మాణానికి నిధుల మంజూరును పట్టించుకోలేదు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతలకు కేంద్ర ప్రభుత్వ పథకాల కింద 60 శాతం నిధులు ఇవ్వాలని విన్నవించిన ఊసులేదు. మూసి రివర్ ఫ్రంట్‌కు రూ. 14,100 కోట్లు, రీజనల్ రింగ్ రోడ్డుకు రూ. 34,367 కోట్లు, వరంగల్‌లో భూగర్భ మురుగు నీటి వ్యవస్థ అభివృద్ధికి రూ.4,170 కోట్లు, బందర్ పోర్ట్ నుంచి హైదరాబాద్ డ్రై పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి రూ.17వేల కోట్లు కోరిన పట్టించుకోలేదు. వరంగల్ ఎయిర్ పోర్టుకు నిధులు కేటాయిస్తే రాష్ట్ర అభివృద్ధికి దోహదపడేది. చివరికి 15వ ఆర్థిక సంఘం రాష్ట్రానికి సిఫార్సు చేసిన రూ.2,233 కోట్లను కేటాయించాలని కోరినా పట్టించుకోలేదు. తెలంగాణాకు ఈ బడ్జెటులో పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని చెప్పకనే తెలుస్తుంది..



**అసంఘటిత కార్మికులను ఆదుకోని బడ్జెట్**

దేశ సంపద ఉత్పత్తిలో శ్రమశక్తిని ధారపోస్తున్న అసంఘటిత రంగంలో పనిచేస్తున్న 50 కోట్ల కార్మిక వర్గానికి కేంద్ర బడ్జెట్లో నిరాశ ఎదురయింది. వారికి సామాజిక భద్రత కల్పించే విధంగా ఈఎస్‌ఐ, పిఎఫ్ గ్రాట్యుటీ లాంటి పథకాలను వర్తింప చేస్తామని మోదీ పదేపదే చెబుతున్నప్పటికీ వారిని ఆదుకొనుటకు ఈ బడ్జెట్లో నిధులు కేటాయించలేదు. కనీసం వారికి ఉద్యోగ భద్రత, కనీస వేతన విధానాన్ని అమలుపరిచే విధంగా చర్యలు లేవు. అయితే స్విగ్గి, జొమాటో, ఉబర్, ఓలా లాంటి ఆన్‌లైన్ ప్లాట్ ఫామ్స్‌లో పనిచేస్తున్న గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పిస్తామని, వాళ్లకు ఆయుష్మాన్ భారత్ పథకం కింద రూ.5 లక్షల వరకు ఫ్రీ ట్రీట్మెంట్, హెల్త్ ఇన్సూరెన్స్ అందజేస్తామని, ఈ – శ్రం పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గిగ్ వర్కర్లకు అవకాశం కల్పిస్తాం, ఐడి కార్డులు అందజేస్తాం అని ప్రకటించటం..దీనివలన దేశంలో ఒక కోటి మందికి లబ్ధి చేకూరుతుందని పేర్కొంది.

**గ్రామీణ అభివృద్ధికి అంతంతే :** జాతీయంగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న 15 కోట్ల మంది గ్రామీణ కార్మికులకు, గ్రామీణ అభివృద్ధి పనులకు గత బడ్జెట్‌లో రూ. 60వేల కోట్లు కేటాయించారు. ఆ తరువాత అదనపు నిధులు కేటాయించారు. వాస్తవ వ్యయం రూ. 89,153.71 కోట్లుగా ఉంది.. అయితే ఈ బడ్జెట్లో రూ. 86 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. వలసలు తగ్గించటం, గ్రామీణ ప్రాంతాల్లో తగినంత ఉపాధి అవకాశాలను సృష్టించడం ఈ స్కీమ్ లక్ష్యం అయినప్పటికీ నిధులను పెంచకపోవడంతో ఉపాధి అంతంత మాత్రమే. పేదరికం లేని భారతదేశ కోసం, పేదరికం లేని గ్రామాలను సృష్టించడంపై దృష్టి పెట్టిందని చెపుతూనే నిధులను తగ్గించడం ఎంతవరకు సబబు.

**పెట్టుబడిదారులకు ప్రోత్సాహం, రాయితీలు:**

ప్రధాని నరేంద్ర మోదీ మొదటి నుంచి స్వదేశీ విదేశీ పెట్టుబడిదారులకు గత పది సంవత్సరాలుగా అనేక రాయితీలు ఇస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. ఈ బడ్జెట్‌లో కూడా ఎఫ్‌డిఐ లను ప్రోత్సహించే విధంగా బీమారంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టబడులను 74శాతం నుంచి 100 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. ఎల్‌ఐసి వంటి ప్రభుత్వరంగ సంస్థలను దెబ్బతీసి, దశల వారీగా ప్రైవేటీపరం చేసే కుట్రగా ఉంది. ప్రభుత్వ రంగ సంస్థలను, రోడ్లు, రవాణా, విమానయాన, రైల్వే, తదితర రంగాలలో ప్రైవేట్ భాగస్వాములను చేస్తూ ఆదాయాన్ని సమకూర్చుకోవాలని బడ్జెట్ చెప్పకనే చెబుతుంది.

ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసనలను జయప్రదం చేయండి! పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను సంస్కరణ పేరుతో కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాలుగు కోడ్‌లుగా మార్చటం, రైతాంగ వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరలు నిర్ణయం అమలు, వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ కింద పని దినాలు పెంపు అధిక నిధులు, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సామాజిక భద్రత, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, ప్రైవేటీకరణ విధానాలను విడనాడాలని, ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిరసనలను తెలియజేయాలని కార్మిక సంఘాల సంయుక్త సమావేశం పిలుపునిచ్చాయి.

# బాలికలు, మహిళా క్రీడాకారిణుల పట్ల చిన్నచూపు తగదు

తెలంగాణకు గర్వకారణంగా నిలుస్తున్న భద్రాచలం అమ్మాయి గొంగడి త్రిష భారత అండర్19 టి20 ప్రపంచ కప్ క్రికెట్ జట్టులో ఆల్‌రౌండర్‌గా ఇటీవల స్కాట్‌లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రతిభ తో 59 బంతుల్లో 110 పరుగులు చేయడమే కాకుండా మూడు వికెట్ల ను కూడా పడగొట్టి భారత్‌కు తిరుగులేని విజయం తీసుకురావడంతో పాటు తర్వాత మ్యాచ్‌ల్లో కూడా తన సత్తా చాటి భరతమాత చేతికి కప్ అందించడంలో ప్రధాన భూమిక పోషించి సగర్వ పుత్రికగా జట్టులో సుస్థిర స్థానంతో పాటు భారతీయుల, ముఖ్యంగా తెలుగు ప్రజల మన్ననలు పొందగలగడం హర్షదాయకం. అదే విధంగా వరంగల్ జిల్లా కల్లెడ గ్రామానికి చెందిన దీప్తి జివాంజీ అనేక ఛీత్కారాలు, హేళనలు, ఒడుదుడుకులను అధిగమిస్తూ సెప్టెంబర్ 2024లో నిర్వహించిన ప్యారిస్ పారాలింపిక్స్‌లో 400 మీ. పరుగు పందెంలో పాల్గొని కాంస్య పతకం గెలిచి సత్తా చాటడం, ఇటీవల భారత ప్రభుత్వం చేత పద్మశ్రీ పురస్కారం పొందడం చూసాం. ఈ విధంగా క్రీడారంగంలో రాణించిన బాలికలు, మహిళల సంఖ్య వేళ్లమీద లెక్కించే విధంగా ఉంటున్నది.



**లింగ అసమానతల వివక్ష – జాతీయ బాలికల, మహిళా క్రీడల దినం**

భరతమాత ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యల్లో సామాజిక, లింగ, ఆర్థిక, పెంపక అసమానత కూడా ఉండడం విచారకరం. ఆడ బిడ్డ పుట్టిన క్షణం నుంచి పెంపకం, విద్యాభ్యాసం, ఆదరణ, లైంగిక వేధింపుల సమస్యలు, అవకాశాల కల్పన, ప్రోత్సాహం, సామాజిక గుర్తింపుల్లో తల్లిదండ్రులు, పౌర సమాజ అసమానతల వివక్షలో నలిగి వంటింటికి, పిల్లల్ని కనే యంత్రంగా మాత్రమే వినియోగించబడుతున్నది. భారతదేశ వ్యాప్తంగా లింగ వివక్ష సర్వత్రా వ్యాపించింది. బాలికలను మహిళా లోకాన్ని క్రీడల వైపుకు ఆకర్షించడానికి ప్రతి ఏట 05 ఫిబ్రవరి రోజున జాతీయ బాలికల, మహిళా క్రీడల దినం (నేషనల్ గర్ల్ అండ్ ఉమెన్ స్పోర్ట్స్ డే) నిర్వహించడం 1987 నుంచి ప్రారంభం అయ్యింది. క్రీడల పట్ల ఆసక్తి చూపుతున్న బాలికలు, మహిళలను ప్రోత్సహించడం, క్రీడా నైపుణ్యాలను సరైన శిక్షణల ద్వారా పెంపొందించడం, వారిలో దాగి ఉన్న అనంతమైన శక్తియుక్తులను బహిర్గత పరచడం లాంటి అంశాలను చర్చించడం, అవగాహన పర్చడం జరుగుతుంది. క్రీడలతో ఆత్మ గౌరవం, విశ్వాసం, స్థిరత్వం, క్రీడాస్ఫూర్తి, శారీరక మానసిక పటుత్వం, సంపూర్ణ ఆరోగ్యం, సమాజ గుర్తింపు, ఉద్యోగాలు, అవార్డులు లాంటివి ఒనగూరుతాయి.

**భారత మహిళా క్రీడాకారిణిలు ఎదుర్కొంటున్న సమస్యలు**

పాఠశాల దశలోనే బాలికలను క్రీడల పట్ల ఆకర్షించడం, వారు చూపుతున్న ఆసక్తిని బట్టి క్రీడల్లో కోచింగ్ ఇస్తూ, వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలకు మెరుగులు దిద్దుతూనే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహిస్తూ అంతర్జాతీయ క్రీడాకారిణిల స్థాయికి తీసుకురావడం మనందరి కర్తవ్యం అని తెలుసుకోవాలి. క్రీడాకారిణిలు ఆట స్థలంలో నేర్చుకున్న క్రీడాస్ఫూర్తి తమ జీవిత కాలంలో కూడా నిలదొక్కుకోవడానికి, విజేతలుగా నిలవడానికి దోహదపడతాయని గమనించాలి. క్రీడారంగంలో చేరిన బాలికలు, మహిళల పట్ల సమాజంలో చిన్నచూపు, వివక్షపూరిత ప్రవర్తనకు గురికావడం, కుటుంబాల అభ్యంతరాలు, బాడీ షేమింగ్ దురాచారం, నిధుల కేటాయింపులో వివక్ష, కవరేజ్ చేయడంలో తేడాలు, స్పాన్సరర్స్ దొరక్క పోవడం, దాదాపు 65 శాతం వరకు లైంగిక వేధింపులు, బలవంతపు పెళ్లిళ్లు చేయడం, క్రీడాభివృద్ధి వసతుల లేమి లాంటి ప్రతిబంధకాల నడుమ స్త్రీ సమాజం క్రీడల్లో చూపాల్సింతగా ప్రతిభను ప్రదర్శించడం లేదు.

**భారత క్రీడా క్షేత్రంలో మెరిసిన మహిళా క్రీడాకారిణులు**

భారత క్రీడా క్షేత్రంలో తమ సత్తాను చాటుతూ అంతర్జాతీయ మైదానాల్లో మెరిసి పతకాలతో మురిసిన మహిళామణులు ఎందరో ఉన్నారు. మేరీ కోమ్(బాక్సర్), కరణం మల్లేశ్వరీ(వెయిట్ లిఫ్టింగ్ రాజీవ్ గాంధీ ఖేల్ రత్న), పి వి సింధూ (బ్యాడ్మింటన్), దూటీ చంద్(అథ్లీట్), సానియా మిర్జా (టెన్నీస్), సైనా నెహ్వాల్ (బ్యాడ్మింటన్), సాక్షి మల్లిక్(కుస్తీ), మీరాభాయి చాను(వెయిట్ లిఫ్టింగ్), మను బాకర్ (షూటర్), పి టి ఉషా (రన్నర్), దీపా కర్మాకర్(జిమ్నాస్టిక్), మిథాలీ రాజ్(క్రికెట్), హిమా దాస్(అథ్లెట్) లాంటి ఎంద రో క్రీడాకారిణిలు తమ సత్తాను చాటి ప్రపంచ స్థాయి క్రీడల్లో పతకాలు పొందారు. ఆసక్తి, క్రీడా నైపుణ్యాలు మెండుగా ఉన్న ఎందరో మహిళలు, బాలికలు ప్రోత్సాహం కరువై ఇంటికి మాత్రమే పరిమితం అవుతున్నారు. నేటి ఆధునిక సమాజంలో తల్లిదండ్రులు, పౌర సమాజం బాలికలను, మహిళలను క్రీడా క్షేత్రంలోకి దించుతూ, తగు సౌకర్యాలను కల్పిస్తూ, మరో పివి సింధు లేదా కరణం మల్లేశ్వరీల వారసులను తయారు చేయడానికి కృషి చేయాలని కోరుకుందాం.

**(05 ఫిబ్రవరి జాతీయ బాలికలు, మహిళా క్రీడల దినం సందర్భంగా)**

బిఎంఆర్

# దశాబ్దాల పరుగుల చరిత్ర..సచిన్...

ఎప్పటిలాగే క్లాస్ రూంలోకి రాగానే నిన్నటి ప్రాబ్లమ్స్ చేశారా? అని అడిగాడు మ్యాథ్స్ టీచర్.ఆ టీచర్ టీచింగ్‌ను బాగా ఇష్టపడే ఆ విద్యార్థులు కొన్నింటికి సొల్యూషన్స్ రాలేదన్నారు. ఇంతకు ఎన్ని సార్లు ప్రయత్నం చేశారన్నారు ఆ సార్ ..నవ్వుతూ..!

ఓ తెలివైన కుర్రాడు...ఎన్నిసార్లు చేస్తే వస్తాయి సార్ అన్నాడు.. కొంచెం క్రొత్తగా..!
జవాబు వచ్చే వరకు చేయాలన్నారు ఆ సార్.. ఇంకొంచెం తెలివిగా..!

'ఆ పని ప్రయత్నాల పరంపరే ఏ ప్రాబ్లమ్ కైనా సొల్యూషన్ అని ఆ సార్ మాటలోని నిగూడార్థం.'

మన జీవితం కూడా గణితం లాంటిదే. ప్రతిదీ సమస్యే. ఆర్థిక, ఆరోగ్య, విద్య, సామాజిక, శారీరక, మానసిక ఇలా ఎన్నో సమస్యలు మన కలల్ని, లక్ష్యాల్ని అడ్డుకుంటుంటాయి. మనం మన ప్రయత్నాలను నిరాశతో ఆపుతుంటాం. సమాజం మనల్ని ఎగతాళి చేస్తూనే వుంటుంది.

నిరాశావాదపు మేఘాల్లో మునిగి అయోమయ స్థితిలో వున్న వ్యక్తుల గురించి, విద్యార్థులను ఉద్దేశించి...

'నిరంతరం ప్రయత్నమున్నదా నిరాశకే
నిరాశ పుట్టదా..!
సంద్రమెంత పెద్దదైనా ఈదుతున్న చేపపిల్ల
మొప్ప ముందు చిన్నదేనురా!
ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి..!
అంటారు సీతారామ శాస్త్రి.

చిన్నప్పుడు టివిలో ఓ ఆటను చూస్తూ భవిష్యత్తు లో తన దేశాన్ని విశ్వ విజేతగా చూడాలనుకున్నాడు ఓ పిల్లాడు. ఆ కల నిజం కావడం కోసం అలుపెరగని 24 సంవత్సరాలు ప్రయాణం కొనసాగించాడు. ఎన్నో అపజయాలను, అవమానాలను భరించాడు.

ఓ సందర్భంలో తన తండ్రి చనిపోయిన బాధను సైతం దిగమింగి తన సెంచరీతో మన దేశాన్ని గెలిపించాడు.



అంతర్జాతీయ క్రికెట్‌లో వంద సెంచరీ లు సాధించడమే కాకుండా మనందరికీ వన్డే క్రికెట్ లో వరల్డ్ కప్ అందించాడు. ఓ స్థాయిలో సచిన్ ఆట కోసమే యావత్ ప్రపంచం క్రికెట్ చూసింది.

సచిన్ ఆటకు వీడ్కోలు పలికినప్పుడు ఐక్యరాజ్యసమితి మొదలు ప్రపంచ ప్రముఖులు సైతం స్పందించారు.

మన దేశ ప్రభుత్వం ఆయనని భారతరత్నతో సత్కరించింది.

సచిన్ టెండూల్కర్ తాను ఆడిన ఫస్ట్ వన్డే మ్యాచ్ లో తన పరుగుల ఖాతా ఆరంభించకుండానే ఔటయ్యాడు. కానీ అక్కడే ఆగిపోలేదు. నిత్యం తనలోని ఆట నైపుణ్యపు మెరుగుదల కోసం దశాబ్దాల యుద్ధమే చేశాడు మైదానంలో...బ్యాట్, బంతితో..!

క్రికెట్ ను అందరూ గౌరవించే
ఓ మతంగా చేశాడు మన దేశంలో..!

అనుకున్నది సాధించి 'ప్లేయింగ్ ఇట్ మై వే' అంటూ తన ఆత్మకథలో ఎన్నో తన జీవిత అనుభవాలకు అక్షర రూపం ఇచ్చారు. 'నాపై ఎన్నో రకాల రాళ్లను విసిరారు. నేను అవి నా జీవితానికి మైలురాళ్ళుగా మార్చుకున్నాను' అంటారు సచిన్.

మనమంతా జీవన సమస్యల పరిష్కారాల సాధనలో ఎక్కడా ఆగకుండా ఆశావాదంతో, ఆత్మవిశ్వాసంతో ప్రయత్నాల ప్రయాణం కొనసాగిస్తే మనలో వున్న సచిన్ బయటికొస్తాడు.

ఎదగాలనే ప్రయత్నం ప్రతి జీవి లక్షణం..! సమస్యను సాధిస్తే ప్రపంచానికి నువ్వు నడిచిన దారే భవిష్యత్తు తరాలకు రహదారి అవుతుంది. నీ గురించి కొత్త చరిత్ర రాస్తుంది..!

ఆగకు...అలసిపోకు..! చావకు...నీ లక్ష్యాన్ని చంపకు..!

నీ జీవితం చెప్పే ఇలాంటి రాతలే భవిష్యత్తు తరాలకు ప్రేరణ తారలు అవుతాయి.

ఫిజిక్స్ అరుణ్ కుమార్
9394749536

## బెంగాల్‌ను ‘బంగ్లా’గా మార్చండి



### తృణమూల్ కాంగ్రెస్ డిమాండ్

**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్ పేరును ‘బంగ్లా’గా మార్చాలని తృణమూల్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. రాష్ట్ర చరిత్ర, సంస్కృతిని ప్రతిబింబించేలా బెంగాల్ పేరును మార్చాలని రాజ్యసభలో టిఎంసి ఎంపి రితబ్రత బెనర్జీ జీరో అవర్‌లో చర్చ సందర్భంగా ఈ అంశాన్ని ప్రస్తావించారు. 2018లోనే పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని, కానీ కేంద్రం ఇప్పటి వరకు ఆమోదం తెలుపలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మమత బెనర్జీ గతంలోనే ప్రధాని మోడీకి లేఖ రాశారని, చరిత్ర, సంస్కృతి, ప్రాదేశిక గుర్తింపు అంశాల నేపథ్యంలో రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రం పేరును మార్చాల్సిన ఆవశ్యకతను తెలిపారన్నారు. 1947లో దేశ విభజన సందర్భంగా భారత్‌లోని బెంగాల్ ప్రాంతం వెస్ట్ బెంగాల్‌గా, రెండో ప్రాంతం ఈస్ట్ పాకిస్తాన్‌గా విడిపోయింది. 1971లో ఈస్ట్ పాకిస్తాన్ ప్రాంతం స్వాతంత్ర్యం ప్రకటించుకుని బంగ్లాదేశ్‌గా అవతరించింది. ప్రస్తుతం ఈస్ట్ పాకిస్తాన్ లేనందున పశ్చిమ బెంగాల్ పేరును మార్చాల్సిన అవసరం ఉందన్నారు. భారత్‌లో చివరిసారిగా 2011లో ఒరిస్సా రాష్ట్రం పేరు ఒడిషాగా మార్పు చెందింది. గతంలో మూడు దశాబ్దాల కాలంలో బొంబాయి నగరం ముంబయి (1995)గా, మద్రాస్ నగరం చెన్నయ్(1996)గా, కలకత్తా నగరం కోల్‌కతా(2001)గా, బంగళూర్ నగరం బెంగళూరు(2014)గా పేర్లు మార్చుకున్నాయి. టిఎంసికే చెందిన సాకేత్ గోఖలే పెట్రోల్ నుంచి చౌకగా లభించే ఇథనాల్ ప్రయోజనాలను వినియోగదారులకు అందేలా చూడాలని కోరారు. ఈ చర్చ సందర్భంగా పలువురు సభ్యులు తమ రాష్ట్రాలలోని సమస్యలను పరిష్కరించాలని కేంద్రాన్ని కోరారు.

# అర్బన్ నక్సల్స్‌లా మాట్లాడుతున్నారు

### రాహుల్‌పై మరోసారి ప్రధాని మోదీ ధ్వజం



**న్యూఢిల్లీ :** ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అర్బన్ నక్సల్‌లా మాట్లాడుతున్నారని ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి ధ్వజమెత్తారు. కొందరు వ్యక్తులు అర్బన్ నక్సల్ భావ జాలంతో మాట్లాడుతున్నారని, వారికి రాజ్యాంగంపై, దేశ సమగ్రతపై అవగాహన లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆప్ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్‌ను కూడా మోడీ వదిలిపెట్టలేదు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొన్ని పార్టీలు దేశ యువతకు ‘ఆప్’దలా పరిణమించాయన్నారు. మంగళవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే సందర్భంగా మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వ పథకాలు ఎంతో ధనాన్ని పొదుపు చేశాయని, అద్దాల మేడలు కట్టుకునేందుకు వాటిని ఉపయోగించలేదని పరోక్షంగా వ్యంగ్య బాణాలు విసిరారు.

పేదల గుడిసెల వద్ద ఫొటోలు దిగుతూ తమకు తాము పబ్లిసిటీ ఇచ్చుకునే నాయకులు పార్లమెంట్‌లో వారి గురించి చర్చను విసుగును ప్రదర్శిస్తారని రాహుల్‌ను ఉద్దేశించి మోదీ వ్యాఖ్యానించారు. జేబులో రాజ్యాంగం ప్రతిని పెట్టుకుని తిరిగేవారు ముస్లిం మహిళలను దయనీయ స్థితికి చేర్చిన అంశాన్ని మరిచారని, తమ ప్రభుత్వం త్రిపుల్ తలాక్‌తో వారి హక్కులను పరిరక్షించామన్నారు. కొందరు వ్యక్తులు బహిరంగంగా అర్బన్ నక్సల్స్ భాషను ఉపయోగిస్తున్నారని, వారి పనులు కూడా అందు కు అనుగుణంగానే ఉన్నాయన్నారు. వారి భావజాలంతో భారత దేశంపై వారు యుద్ధాన్ని ప్రకటించారన్నారు. మోదీ ప్రత్యేకించి ఎవరి పేరును ప్రస్తావించనప్పటికీ గత నెలలో రాహుల్ గాంధీ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లకు వ్యతిరేకంగా తాము పోరాడుతున్నామన్న వ్యాఖ్యలను పరోక్షంగా ప్రస్తావించారు.

ఆప్ నేత కేజ్రీవాల్‌పై సైతం మోదీ విమర్శలు ఎక్కుపెట్టారు. కొందరు నాయకులు హామీలతో ప్రజలను బుజ్జగిస్తున్నారని, ప్రతి ఇంటికీ నీటిని అందజేస్తామని అలవికాని వాగ్దానాలు చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో యువతకు చేసిన హామీలనుసైతం నెరవేర్చలేకపోయాన్నారు. వారి హామీలు ఎన్నటికీ నెరవేర్చలేరని మోడి స్పష్టం చేశారు. జనవరి 31న పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగం అనంతరం కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పార్లమెంట్ ఆవరణలో మాట్లాడుకుంటూ రాష్ట్రపతి ప్రసంగం విసుగు కలిగించిందన్నారని మోడి తెలిపారు. తాము మోసపూరిత వాగ్దానాలు చేయడం లేదని, వాస్తవమైన అభివృద్ధిని ప్రజలకు అందిస్తున్నామన్నారు. అయిదు దశాబ్దాలుగా ‘గరీబీ హటావో’ నినాదం విని విసిగిపోయామని, తమ ప్రభుత్వం 25 కోట్లమందిని పేదరికం నుంచి విముక్తి కలిగించిందన్నారు. ఇప్పటివరకు 4కోట్ల మంది పేదలకు ఇళ్లను అందజేశామని, సామాన్య ప్రజల బాధలు వాటిని అనుభవించిన వారికే అర్ధమౌతాయన్నారు. తాము రాజ్యాంగ స్ఫూర్తితో పని చేస్తున్నామని, స్వార్ధపూరిత రాజకీయలతో కాదని ప్రతిపక్షాలను ఉద్దేశించి అన్నారు. బడ్జెట్‌లో తమ ప్రభుత్వ నిర్ణయాలను కూడా మోదీ ప్రశంసించారు. 2002లో ఆదాయ పన్ను పరిమితి రూ.2 లక్షలుగా ఉండేదని, తమ ప్రభుత్వం దానిని రూ.12 లక్షలు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. పేద ప్రజల కోసం తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని కొన్ని రాష్ట్రాలు అమలు చేయడం లేదని, దీనితో అక్కడి పేదలు దుర్భర జీవితం గడపుతున్నారని అన్నారు.

# ముహూర్తం కోసం.. చూస్తున్నారా?

### రాష్ట్రంలోకి వచ్చిన విదేశీయులను వెంటనే పంపించేయండి

### నిర్బంధంలో ఉంచడమేంటి : అసోం ప్రభుత్వంపై ‘సుప్రీం’ ఆగ్రహం



**న్యూఢిల్లీ :** అసోం ప్రభుత్వంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్రమంగా రాష్ట్రంలోకి వచ్చిన విదేశీయులను వెంటనే పంపివేయకుండా నిర్బంధ కేంద్రాల్లో నిరవధికంగా ఉంచడంపై మండిపడింది. వారిని స్వస్థలాలకు పంపడానికి ముహూర్తం కోసం ఎదురు చూస్తున్నారా అని ప్రశ్నించింది. నిర్బంధ కేంద్రాల్లో ఉంచిన 63 మందిని రెండు వారాల్లోగా పంపించేయాలని న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఎవరైనా దేశంలోకి అక్రమంగా ప్రవేశించినవారని తెలిసినప్పుడు వారిని పంపివేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలి. నిర్బంధంలో ఉన్న విదేశీయులను వారి దేశాలకు పంపించమంటే వారి చిరునామా తెలియదని పేర్కొంటూ మీరు తరలింపు ప్రక్రియను ప్రారంభించడానికి నిరాకరిస్తున్నారు. అది మనం పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశంకాదు. అలాగే వారిని జీవితాంతం కేంద్రాల్లో ఉంచి పోషించలేం కదా.. వెంటనే వారిని వారి దేశాలకు తరలించండి. దానికి ఏమైనా ముహూర్తం కోసం ఎదురుచూస్తున్నారా..?’ అని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. అసోంలో ఉన్న అన్ని నిర్బంధ కేంద్రాల నుంచి ఇప్పటి వరకు ఎంతమందిని వారి దేశాలకు పంపించారన్న నివేదికలను సమర్పించాలని ఆదేశించింది. అసోం సహా మరి కొన్ని రాష్ట్రాల్లో అక్రమ వలసదారులు పెద్దయెత్తున పెరిగిపోవడంతో స్థానికుల్లో అభద్రతాభావం అధికమవుతోంది. తమ వనరులు పొరుగు దేశస్థుల పాలవుతున్నాయని... తాము మైనారిటీలుగా మారే ముప్పుందని వారు వాపోతున్నారు. వలసదారుల్లో కొందరు మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతూ దేశ భద్రతకు ముప్పుగానూ పరిణమిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్రమంగా రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్న వారిని తమ దేశాలకు పంపడంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన అత్యున్నత న్యాయస్థానం పైవిధంగా స్పందించింది.

# ఢిల్లీ సిఎం ఆతిశీపై పోలీసులు ఎఫ్‌ఐఆర్

**న్యూఢిల్లీ :** ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎంసిసి)ని ఉల్లంఘించారని, విధి నిర్వహణలోని ప్రభుత్వోద్యోగులను అడ్డుకున్నారని ఆరోపిస్తూ ఢిల్లీ ముఖ్యమంత్రి, కల్కాజి నియోజకవర్గం ఆప్ అభ్యర్థి ఆతిశీపై ఢిల్లీ పోలీసులు మంగళవారం ఒక ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు పోలీస్ అధికారి ఒకరు తెలియజేశారు. ఫతే సింగ్ మార్గ్‌లో డ్యూటీలో ఉన్న ఒక అధికారిని అడ్డుకున్న ఆప్ మద్దతుదారులతో ఆతిశీ ఉన్నారని పోలీసులు వెల్లడించారు. ఇద్దరు ఆప్ సభ్యులు ఒక పోలీస్ కానిస్టేబుల్‌పై దౌర్జన్యం చేశారని వారు ఆరోపించారు. ‘కల్కాజి ఆప్ అభ్యర్థిపై వివిధ సెక్షన్ల కింద గోవింద్‌పురి పోలీస్ స్టేషన్‌లో ఒక ఎఫ్‌ఐఆర్ నమోదు చేశాం. మరింత దర్యాప్తు సాగుతోంది’ అని పోలీస్ అధికారి తెలిపారు. ఆప్ అభ్యర్థి 5070 మంది మద్దతుదారులు, 10 వాహనాలతో ఫతే సింగ్ మార్గ్‌లో కనిపించినందున ఈ చర్య తీసుకున్నట్లు ఆయన వివరించారు. ఎంసిసి మార్గదర్శకసూత్రాల ప్రకారం ఆ ప్రాంతం నుంచి వెళ్లిపోవలసిందిగా వారిని పోలీసులు ఆదేశించినట్లు, కానీ వారు విధి నిర్వహణలో ఉన్న ఒక అధికారికి ఆటంకం కలిగించినట్లు ఆయన తెలిపారు. ‘మంగళవారం మధ్యాహ్నం 12.59 గంటలకు గోవింద్‌పురి బాబా ఫతే సింగ్ మార్గ్‌లో ఒక గుంపు చేరినట్లు



సమాచారం అందింది. హెడ్ కానిస్టేబుల్ కౌశల్ పాల్ స్పందించి, వీడియోగ్రఫీ ప్రారంభించారు. ఆప్ సభ్యులు అశ్మిత్, సాగర్ మెహతా అడ్డుకుని, ఆయనపై దౌర్జన్యం చేశారు’ అని డిసిపి (ఆగ్నేయం) అధికారిక ‘ఎక్స్’ పోస్ట్‌లో తెలియజేశారు.

**బిజెపి గూండాయిజం : ఆతీశీ**

బిజెపి గుండాయిజానికి పాల్పడుతున్నదని ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ ఆరోపించారు. ఎన్నికల కమిషన్, ఢిల్లీ పోలీసులు కాషాయపార్టీ కార్యకర్తలను కాపాడుతున్నారని, ఆప్ నాయకులు, సభ్యులను టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. ఆతిశీ ఢిల్లీలోని కల్కాజీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. భారత ప్రజాస్వామ్యం ఇప్పుడు ఎన్నికల ముఖ్య కమిషనర్ రాజీవ్‌కుమార్ చేతుల్లో ఉందని, ఇక దేశ రాజధానిలో ప్రజాస్వామ్యం ఏ మేరకు మనుగడలో ఉందనేది యావత్ దేశం చూస్తోందన్నారు. బిజెపి బహిరంగంగానే గూండాయిజానికి పాల్పడుతోందని, ఆ పార్టీపై చర్యలు తీసుకోవడానికి బదులు ఢిల్లీ పోలీసులు ఆ పార్టీ నాయకులను రక్షిస్తున్నారని ఆతీశీ మండిపడ్డారు. ఫిర్యాదుచేసిన వారిపై ఎన్నికల కమిషన్ కేసులు నమోదు చేస్తుందన్నారు. అయితే బిజెపి అభ్యర్థి రమేష్ బిధూరిని ఉద్దేశించి ఆతిశీ ఆరోపణలు చేశారు. బిధూరి ఆతిశీకి ప్రత్యర్థి అభ్యర్థిగా ఉన్నారు. కల్కాజీలో ఆయన కుటుంబ సభ్యులు గూండాయిజానికి పాల్పడుతున్నారని, అయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆతిశీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, ఒకవైపు కాషాయ పార్టీ సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకుంటూ గూండాయిజం చేస్తుంటే, మరోవైపు ఆప్ ప్రతి ఒక్క కుటుంబానికి నెలకు రూ. 25000 ఆదా చేస్తుందని చెప్పారు.

## మహాకుంభ్‌లో భూటాన్ రాజు



**ప్రయాగ్‌రాజ్:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక మేళాగా ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ్‌లో భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యేల్ వాంగ్‌చుక్ మంగళవారంనాడు పాల్గొన్నారు. త్రివేణి సంగమంలో పవిత్రస్నానం చేసి, గంగాహారతిలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆయన వెంట హాజరయ్యారు. ఇండియా—భూటాన్ మధ్య ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ భూటాన్ రాజు మహాకుంభ్‌కు హాజరుకావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇరుదేశాలకు చెందిన పలువురు ప్రముఖులు, భక్తులు గంగాహారతి, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీనికి ముందు సోమవారం మహాకుంభ్‌లో పాల్గొనేందుకు భూటాన్ రాజు ప్రయాగ్‌రాజ్ చేరుకోవడంతో ఆయనను చౌదరి చరణ్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సిఎం యోగి ఆదిత్యనాథ్ సాదర స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి ఆయన క్షేమసమాచారాలు అడిగి తెలుసుకున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలతో కళాకారులు వాంగ్‌చుక్‌కు స్వాగతం పలికారు.

## మృతుల సంఖ్యపై దోబూచులాట

### కేంద్రంపై అఖిలేశ్ ఆరోపణలు



**న్యూఢిల్లీ :** కుంభ మేళా సందర్భంగా మృతుల సంఖ్యను వెల్లడించడంలో కేంద్ర ప్రభుత్వం దోబూచులాడుతున్నదని సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. మేళా నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగానే ఈ దుర్ఘటన జరిగిందని, ఇందుకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో భాగంగా అఖిలేశ్ మాట్లాడుతూ కుంభమేళాను కేంద్రం డిజిటల్ కుంభ మేళాగా నిర్వహించాలని ప్రయత్నించిందని, కానీ తొక్కిసలాటలో మృతుల డిజిట్(సంఖ్య)ను దాచేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈ అంశంపై కేంద్రం ఒక అఖిల పక్ష సమావేశం నిర్వహించి దుర్ఘటనకు కారణాలను కనుగొనే బాధ్యతను ఆర్మీకి అప్పగించాలని ఉత్తర ప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్ డిమాండ్ చేశారు. కుంభమేళా ఏర్పాట్ల పర్యవేక్షణలో విఫలమైన అధికారులపైకూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దుర్ఘటనలో చనిపోయిన వారి సంఖ్యతోపాటు గాయపడిన వారెందరు, అందుబాటులో ఉంచిన డాక్టర్లు, మందులు, ఆహారం, నీరు, రవాణా సౌకర్యాల వివరాలను పార్లమెంట్‌కు అందజేయాలన్నారు. పుణ్య స్నానాలకు వచ్చిన ప్రజలు తమ బంధువులు, సన్నిహితుల మృతదేహాలతో వెనుతిరిగాల్సి రావడం దురదృష్టకరమన్నారు. మృతదేహాలను తరలించిన ప్రభుత్వం మృతుల సంఖ్యను తెలిపేందుకు నిరాకరించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. మృతదేహాలను తరలించేందుకు ప్రభుత్వం జెసీబీలను, ట్రాక్టర్లను వినియోగించడం ఏ సంప్రదాయమన్నారు. దుర్ఘటనపై విచారం వ్యక్తం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి సమయం లేకపోవడం శోచనీయమన్నారు. దుర్ఘటన జరిగిన 17 గంటల తరువాత ఆలస్యంగా రాష్ట్రపతి, ప్రధాని సంతాపం తెలుపడం విచారకరమన్నారు.

# ధాన్యం సేకరణలో అవినీతి లేదు

### కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రి వివరణ



**న్యూఢిల్లీ :** ధాన్యం సేకరణలో ఎటువంటి అవినీతి చోటు చేసుకోలేదని, రైతులకు వందశాతం చెల్లింపులు వారి ఖాతాలలో జమ చేశామని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. మంగళవారం రాజ్యసభలో ధాన్యం సేకరణలో అవకతవకలు జరిగాయన్న ప్రతిపక్షాల ఆరోపణలపై అనుబంధ ప్రశ్నలకు సమాధానమిస్తూ ఎలాంటి అవినీతి జరుగలేదని, ధాన్యం సేకరణలో మధ్యవర్తుల ప్రమేయంతో అవినీతి జరిగిందన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కాంగ్రెస్ ఎంపి దిగ్విజయ్ సింగ్ చేసిన ఆరోపణకు సమాధానమిస్తూ బహుశా యుపిఎ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిని ప్రస్తావిస్తున్నారా అని జోషి ఎదురు ప్రశ్నించారు. ఆర్‌ఎల్‌ఎం ఎంపి ఉపేంద్ర ఖుష్వాహ కూడా మధ్యవర్తుల ప్రమేయాన్ని ప్రస్తావిస్తూ రైతులకు దక్కాల్సిన ప్రయోజనాలు మధ్యవర్తుల వల్ల పక్కదారి మళ్లాయన్నారు. ఈ అంశంపై ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ధాన్యం సేకరణ చేసే వ్యక్తులు మధ్యవర్తులుగా మారి ప్రభుత్వానికి, ధాన్యం సేకరణ ఏజెంట్లకు అనుసంధానకర్తలుగా వ్యవహరించారని, అందువల్లనే అవినీతికి తావేర్పడిందన్నారు. ఇందుకు మంత్రి సమాధానమిస్తూ తాము నేరుగా రైతు బ్యాంకు ఖాతాలకే నగదు చెల్లింపులు చేశామని, ధాన్యం సేకరించిన 48 గంటలలోనే బ్యాంకు ఖాతాలలో నగదు చెల్లింపులు జరిగాయన్నారు. కేంద్రం రాష్ట్రప్రభుత్వాలకు తద్వారా ఏజెన్సీలకు చెల్లింపులు జరుగగా, వారు రైతుల ఖాతాలకు జమ చేశారని వెల్లడించారు. ఇందులో అవినీతికి ఆస్కారం లేదన్నారు.

గతంలో ఒక రూపాయికి కేవలం 15 పైసలు మాత్రమే రైతు లకు అందేవని, ఇపుడు పూర్తి రూపాయి రైతుకు అందుతోందన్నారు. తమ ప్రభుత్వం రైతు పండిం చే ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తోంద న్నారు. 200414 మధ్య కాలంలో 4,590 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరుగగా, 2014 24 మధ్య కాలంలో 6,899 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని మంత్రి వివరించారు.

## 14న రైతులతో మరోవిడత చర్చలు

**న్యూఢిల్లీ :** కనీస మద్దతు ధరపై స్పష్టమైన హామీ కోసం ఆందోళన చేస్తున్న పంజాబ్, హర్యానా రైతులతో ఈనెల 14న ఆరో విడత చర్చలు నిర్వహించనున్నట్టు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు తెలిపింది. గత నెలలో నిర్వహించిన చర్చలలో ధాన్యం సేకరణపై అయిదేళ్ల ప్రణాళికతో రైతులతో జరిపిన చర్చలు సత్ఫలితాన్నివ్వలేదు. కనీస మద్దతు ధరపై చట్టబద్ధమైన హామీ కావాలన్న రైతుల డిమాండ్‌పై కేంద్రం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. రైతులతో చర్చపై కేంద్ర వ్యవసాయ శాఖ సహాయమంత్రి రామనాథ్ ఠాకూర్ లిఖిత పూర్వక సమాధానమిస్తూ రైతులపై ఫిబ్రవరి 14న తదుపరి విడత చర్చలు జరుపుతామన్నారు. రైతుల డిమాండ్ అంశం కోర్టు విచారణలో ఉందన్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రైతులతో 2024 ఫిబ్రవరి8, 12, 15. 18, 2025 జనవరి 18న అయిదు విడతలలో చర్చలు జరిపింది.

## రాహుల్ చైనా వ్యాఖ్యలపై

# రాజ్‌నాథ్ ఫైర్



**న్యూఢిల్లీ :** భారత్—చైనా సరిహద్దు పరిస్థితిపై ఆర్మీ చీఫ్ చేసిన ప్రకటనపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేయడంపై కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నిప్పులు చెరిగారు. రాహుల్ పార్లమెంటు ప్రసంగంలో తప్పుడు ఆరోపణలు చేశారని మండిపడ్డారు. ఇరువైపులా ట్రెడిషనల్ పెట్రోలింగ్ డిస్ట్రబెన్స్‌పైనే ఆర్మీ చీఫ్ చెప్పారని, ఆయన చెప్పని మాటలు చెప్పినట్టుగా రాహుల్ మాట్లాడటం సరికాదని అన్నారు. ‘జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన విషయాల్లో రాహుల్ గాంధీ బాధ్యతారహిత వ్యాఖ్యలకు పాల్పడడం విచారకరం. భారత భూభాగం ఏదైనా చైనా చేతుల్లోకి వెళ్లిందంటే అది ఆక్సాయ్ చిన్‌లోని 38,000 చదరపు కిలోమీటర్ల భూభాగం మాత్రమే. 1962 యుద్ధం తరువాత ఇది జరిగింది. 1963లో పాకిస్థాన్ చట్టవిరుద్ధంగా చైనాకు 5,180 చదరపు కిలోమీటర్ల భూమిని ధారాదత్తం చేసింది. చరిత్రపై రాహుల్ అవగాహన పెంచుకోవాలి‘ అని రాజ్‌నాథ్ సింగ్ సోషల్‌మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. రాహుల్ గాంధీ రాష్ట్రపతి బడ్జెట్ ప్రసంగంపై సోమవారంనాడు జరిగిన చర్చలో పాల్గొంటూ, ‘మేక్ ఇన్ ఇండియా’లో భారత్ విఫలమైందని, ఆ కారణంగానే చైనా దేశంలో తిష్ట వేసుకు కూచుందని ఆరోపించారు. చైనా బలగాలు మన భూభాగంలోనే ఉన్నాయనే విషయాన్ని ప్రధాని మోదీ ఖండించారని, దీనిపై ఆర్మీ చీఫ్ మాత్రం వాస్తవం మాట్లాడారని అన్నారు. చైనా బలగాలు మన భూభాగంలోనే ఉన్నాయని ఆర్మీ చీఫ్ చెప్పినట్టు రాహుల్ పేర్కొన్నారు. తయారీ రంగంలో భారత్ వెనుకబడటం వల్ల చైనా వస్తువులు దేశంలోకి వస్తున్నాయని అన్నారు. ఉత్పత్తి రంగంపై భారత్ దృష్టి సారించాలని పేర్కొన్నారు.

# ఇసి ముగ్గురు సభ్యుల సంస్థ

### ఒక్కరే నడిపించలేరు: రాజీవ్ కుమార్

**న్యూఢిల్లీ :** ఎన్నికల కమిషన్‌ను సిఇసి రాజీవ్ కుమార్ నడిపిస్తున్నారంటూ ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. ఈ ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం తనదైన శైలిలో మంగళవారం తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించింది. ఢిల్లీ ఎన్నికల్లో ఎన్నికల సంఘాన్ని దుర్వినియోగం చేస్తున్నారంటూ తరచూ ఆరోపణలు గుప్పిస్తున్నారని.. ఇలాంటి దురాశలకు ఎన్నికల సంఘం లొంగదని స్పష్టం చేసింది. ఈ ఎన్నికల్లో ఇసిఐని ఒకే సభ్య సంస్థగా భావించి.. ఉద్దేశపూర్వకంగా ఒత్తిడి తెచ్చే వ్యూహాలను సైతం గమనించామంది. ఈ నేపథ్యంలో వివేకంతో వ్యవహరించాలని నిర్ణయించినట్లు తెలిపింది. అయితే ఎక్స్ ఖాతా వేదికగా ఇసిఐ స్పందిస్తూ.. ఎక్కడ ఆమ్ ఆద్మీ పేరు కానీ.. కేజ్రీవాల్ పేరు కానీ లేకుండా కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. ఈ ఎన్నికల వేళ.. రాజకీయ పార్టీలతోపాటు అభ్యర్థులు లేవనెత్తిన సమస్యలపై 1.5 లక్షల మంది అధికారులు చర్యలు తీసుకుంటున్నారని వివరించింది. వారంతా న్యాయబద్ధంగా.. ఎక్కడ పక్షపాతం లేకుండా.. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసిజర్ ద్వారా నిష్పక్షపాతంగా పని చేస్తున్నారని ఈసీఐ స్పష్టం చేసింది. కేంద్రంలోని బిజెపికి కేంద్ర ఎన్నికల సంఘం లొంగిపోయిందని మాజీ సిఎం కేజ్రీవాల్ సోమవారం న్యూఢిల్లీలో విలేకర్ల సమావేశంలో ఆరోపించారు. మీ పని మీరు చేయండి.. మీ పదవికి న్యాయం చేయండంటూ కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాజీవ్ కుమార్‌కు అరవింద్ కేజ్రీవాల్ ఈ సందర్భంగా సూచించారు. దేశ రాజధాని న్యూఢిల్లీ నగర ప్రజల మెదళ్లలో కొన్ని సందేహాలు ఉన్నాయన్నారు. వాటిని తీర్చండంటూ కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు ఆయన సూచించారు. ఈ మాసాంతం మీరు ఉద్యోగం నుంచి రిటైర్ అవుతున్నారు. ఆ క్రమంలో మీకు.. గవర్నర్? లేదా రాష్ట్రపతి? పదవి ఆశను కేంద్రం చూపించిందా? అంటూ ప్రశ్నించారు. ఈ రెండు పోస్టుల్లో మీకు ఏ ఆశ చూపించిందంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో తాను నమస్కరించి ఆయనకు ఒకటే సూచన చేయదలుచుకున్నానని తెలిపారు. మీ పని మీరు చేయండి.. మీ ఉద్యోగానికి తగిన న్యాయం చేయండని తాను రెండు చేతులు నమస్కరిస్తూ వేడుకొంటున్నానన్నారు. మీరు ఉద్యోగం నుంచి రిటైరవుతోన్న వేళ.. దేశాన్ని.. అలాగే దేశంలోని ప్రజా స్వామ్యాన్ని సైతం నాశనం చేయవద్దంటూ తాను వేడుకొంటున్నట్లు తెలిపారు.




BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL
ARB.NO. 502 of 2024
Between :-
Shri Kamalajoythi Chits Pvt Ltd., Thorrur-Branch
.... Disputant.
And
DEEKONDA MANJULA & Others
.....Opponents
2. Sri. Pasunoori Ramaraju, S/o, Sallu, Age: 51 Yrs, Occ: L.P (Telugu), Grade-II, O/o: Z.P.H.S, Athapur, Peddavangara, R/o: H.No: 3-123, Bollikunta, Sangem, Warangal.
3. Sri. Ravula Shoban Babu, S/o, Komuraiah, Age: 47 Yrs, Occ: Business, R/o: H.No: 3-106, Sriram Temple, Kondapuram, Somaram, Thorrur, Mahabubabad.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on 14-02-2025 for your appearance. On that day you have to appear in person at 11.00 A.M. Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
DEPUTY REGISTRAR OF CHITS WARANGAL

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL
ARB.NO. 503 of 2024
Between:-
Shri Kamalajoythi Chits Pvt Ltd., Thorrur-Branch
.... Disputant
And
VADICHERLA NAGARJUNA & Others
....Opponents
2. Sri. Adepu Nagaraju, S/o, Ramesh, Age: 42 Yrs, Occ: Artisian, Gr-III, O/o: 33/11 KV, Nakkalagutta Substation, R/o: H.No: 3-117/5, Sureshnagar, Dhanasari, Kesamudram, Mahabubabad.
6. Sri. Morapaka Babu Rao, S/o, Samuel, Age: 39 Yrs, Occ: Business, R/o: H.No: 3-118, Kesamudram, Mahabubabad.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. 14-02-2025 for your appearance. On that day you have to appear in person at 11.00 A.M. Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
DEPUTY REGISTRAR OF CHITS WARANGAL

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL
ARB.NO. 504 of 2024
Between:-
Shri Kamalajoythi Chits Pvt Ltd., Thorrur-Branch
... Disputant
And
KATAKAM NAGARAJU & Others
.....Opponents
3. Sri. Beerapula Narayana, S/o, Venkateshwarlu, Age: 42 Yrs, Occ: Business, R/o: H.No: 4-12, C/o, Sri Venkateshwara Hotel, Ambedkar Statue, Nagaram Road, Thungathurthy, Suryapet.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. 14-02-2025 for your appearance. On that day you have to appear in person at 11.00 A.M. Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
DEPUTY REGISTRAR OF CHITS, WARANGAL

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL
ARB.NO. 500 of 2024
Between:-
Shri Kamalajoythi Chits Pvt Ltd., Thorrur-Branch.
.... Disputant
And
SURA SURA KRISHNA & Others
.....Opponets
1. Sri. Sura Sura Krishna, S/o, Sunkanna, Age: 58 Yrs, Occ: S.G.T, O/o: MPPS, S.C.Colony, Thirumalagiri, R/o:P.No: 103, Padmavathi Colony, Nalgonda.
3. Smt. Sura Sura Swapna, D/o, Krishna, Age: 36 Yrs, Occ: S.G.T, O/o: Govt. School, Manchy Thanda, R/o: H.No: 5-16, Padmashalinagar, Thirumalagiri, Nalgonda.
5. Sri. Sunkari Ayodhya, S/o, Mallaiah, Age: 54 Yrs, Occ:S.G.T, O/o: MPPS, Eatoor, Sury R/o:H.No:1-1-484/A/1, C/o:Chaliganti Pichaiah, Gali Laxmamma Bazar, Nehru Na jar, Suryapet.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the sarne. The above dispute is posted on. 14-02-2025 for your appearance. On that day you have to appear in person at 11.00 A.M. Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
DEPUTY REGISTRAR OF CHITS WARANGAL

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL
ARB.NO. 501 of 2024
Between:-
Shri Kamalajoythi Chits Pvt Ltd., Thorrur-Branch
..... Disputant
And
YALAPATI INDRA REDDY & Others
....Opponent
2. Sri. Bashetti Hariprasad, S/o, Ramulu, Age: 50 Yrs, Occ: Seputy Tahsildhar, O/o: Civil AL Supply Officer, Kodakandla, R/o: H.No: 1-130, Gandhinagar, Zaffargadh, Jangaon.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. 14-02-2025 for your appearance. On that day you have to appear in person at 11.00 A.M. Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
DEPUTY REGISTRAR OF CHITS, WARANGAL

## వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/భద్రాచలం :** రానున్న వేసవిలో జిల్లాల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మిషన్ భగీరథ ఇఇ తిరుమలేష్‌ను మండలస్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పరిస్థితిని సమీక్షించాలన్నారు. మండలస్థాయి ఎంపిడిఒలు, పంచాయితీ కార్యదర్శులు, మిషన్ భగీరథ ఎఇలు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి సమస్యలు తలెత్తక్కుండా చూడాలన్నారు. అవసరమైన చోట చేతిపంపులు, బోర్లు, మోటార్లు మరమ్మత్తులు చేయాలని ఆదేశించారు.

## రైస్ మిల్లును తనిఖీ చేసిన సివిల్ సప్లయ్ అధికారి



**ప్రజాపక్షం/కరకగూడెం:** మండల కేంద్రంలోని నందీశ్వర రైస్ మిల్లులో డిప్యూటీ తహశీల్దార్ సివిల్ సప్లై గుంటి శివకుమార్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 25 సంవత్సరానికి 3,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నందీశ్వరి రైస్ మిల్లుకు ప్రభుత్వం ఇవ్వడం జరిగిందని దీనిలో భాగంగా 870 మెట్రిక్ టన్నులు రైస్ సివిల్ సప్లై కి అప్పగించారని ఇంకా 2130 మెట్రిక్ టన్నులు రైస్‌ను సివిల్ సప్లై కి ఇవ్వవలసి ఉందని ఆయన తెలిపారు.

## బిబిసికి వారబంధి లేకుండా నీటిని విడుదల చేయాలి

సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు



**ప్రజాపక్షం/బోనకల్;** బిబిసి కాలువకు వారబంధి లేకుండా నీటిని విడుదల చేయాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఐదు మైనర్ కాలువలను సిపిఐ బృందంతో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ..వారబంధితో బిబిసి కాలువ నుండి ఆళ్లపాడు, నారాయణపురం, కలకోట, ముష్టికుంట్ల, చిరునోముల మైనర్‌కాలువల చివరి భూములలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయని అన్నారు. మొక్కజొన్న పంట కంకి సమయంలో నీరు అందకపోవడంతో దిగుబడి తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వారబంధిలో నీరు విడుదల చేసి, నిలిపివేసే సరికి కనీసం మైనర్‌కాలువలోకి నీరు రానీ పరిస్థితి నెలకొనందని అన్నారు. గత పంట పత్తిసాగు సమయంలో నీరు అందక పూత, కాయ తగ్గి రైతులకు నష్టం వాటిల్లిందని అన్నారు. మైనర్‌కాలువ సమీపంలో ఎక్కువశాతం కౌలురైతులే ఉన్నారని, కౌలు, పెట్టుబడి, ఎరువులు, పురుగుమందుల ధరల పెరిగి ఇప్పటికే అప్పులో ఉన్నారని అన్నారు. పంటలు ఎండితే కౌలు రైతులకు ఆత్మహత్య శరణ్యమని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, నాయకులు గుంపుల జయరాజు, కాంగ్రెస్ నాయకులు పారా వెంకటమోహన్‌రావు, షేక్ దస్తగిరి, టిడిపి నాయకులు గొల్లపల్లి కృష్ణారావు, అల్లిక శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## వరమ్మ కుటుంబానికి సిపిఐ పరామర్శ

**ప్రజాపక్షం/బోనకల్:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యార్లగడ్డ వరమ్మ కుటుంబాన్ని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డితో కలిసి మంగళవారం పరామర్శించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వరమ్మ కుటుంబానికి నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్షతగాత్రులు కోలుకునేంత వరకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, జీవనభృతి కల్పించాలని కోరారు. వరమ్మ కుటుంబాన్ని పరామర్శించిన వారిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు, ఏఐటియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సహాయ కార్యదర్శి ఆకెన పవన్, చిరునోముల శాఖ కన్వీనర్ గుంపుల జయరాజు తదితరులున్నారు.

## అత్యవసరాలకు డయల్ 100 ను వినియోగించుకోండి

పోలీస్ కమిషనర్ సునిల్‌దత్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ తెలిపారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జనవరి మాసంలో డయల్ 100కు నాలుగువేల యాభైఆరు కాల్ రాగా విచారించిన అనంతరం 57 కాల్స్‌కు మాత్రమే కేసులు నమోదు చేసి ఎఫ్‌ఐఆర్ చేశామని తెలిపారు. వీటిలో హత్యాయత్నం 1, మహిళపై వేధింపులు 1, దొంగతనాలు 9, సాధారణఘాతాలు 14, ప్రమాదాలు 11, అనుమానాస్పద మరణాలు 4, ఇతర కేసులు 17 ఉన్నాయని తెలిపారు. అత్యవసరానికి వినియోగించే డయల్ వందను కొందరు ఆకతాయిలు ఫెక్ కాల్స్ చేస్తు దుర్వినియోగం చేస్తున్నారన్నారు. దీనివల్ల అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారు సహాయం పొందలేకపోతారన్నారు. ఫెక్ కాల్స్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని వేళాల్లో అన్ని రోజులు అందుబాటులో ఉండే డయల్ 100ను అత్సవపరానికి మాత్రమే వినియోగించుకోవాలని జిల్లావాసులకు సిపి సూచించారు.

## సెల్ పీకింగ్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం

**ప్రజాపక్షం/మణుగూరు:** సెల్ పీకింగ్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి మణుగురు ఏరియా కార్యదర్శి ఆదేర్ల సురేందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మణుగూరు ఓసి మేనేజర్ బైరెడ్డి వెంకటేశ్వర్లుకి వినతి పత్రాన్ని అందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మణుగూరు ఓసిలో సెల్ పీకింగ్ కాంటాక్ట్ కార్మికులకు నెల నెల వేతనాలు చెల్లించడంలో జాప్యం చెయ్యడంతో కుటుంబ పోషణ భారంగా మారి జీతాలు అందాక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వక్తం చేశారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే అట్టి కుటుంబాలకు ఆర్థిక భద్రత లేకుండా పోతుందని పనిని బట్టి స్కిల్డ్ వేతనం చెల్లించాలని, భూములు ఇచ్చిన బాధితులైన వీరిని పనిలో నుండి తొలగించాలని కాంట్రాక్టర్ అనుకోవడం సరైన విధానంకాదని మండిపడ్డారు. ఉద్యోగ భద్రత కల్పించాలని రక్షణ పరికరాలు ఇవ్వాలని హెల్త్ కార్డులు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిట్ ఎఐటియుసి నాయకులు జెల్లరాపు రమేష్, కాంట్రాక్టు కార్మికులు ప్రవీణ్, సుమంత్, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నజరానాలు! "అదుర్స్"

నోటిఫికేషన్‌కు ముందే వాగ్దానాలవర్షం
ఆడపిల్ల పెళ్లికి పదివేలట ?
రోడ్లు, డ్రైనేజీలు సరే సరి
పంచాయతీ ఆశావాహుల వాగ్దానాలు




**ప్రజాపక్షం/ఖమ్మం :** 'ఎన్నికల సందర్భంగా ప్రజలు అడిగినవి అడగనివి కలిపి హామీలు ఇస్తాం. నమ్మి గెలిస్తే హామీలను నెరవేర్చేందుకు ప్రయత్నిస్తాం. ఓడిపోతే నమ్మి ఓటు వేయని ఓటర్లది తప్పిదం. ఒకవేళ నమ్మి ఓటేస్తే హామీలు అమలు చేయలేదని పదవిని వెనక్కు తీసుకుపోలేరుగా' అని ఓ రాజకీయ నేతగా వ్యాఖ్యానించినట్లుగా గెలుపు, ఓటమి తర్వాత సంగతి గ్రామ పంచాయతీ సర్పంచుల ఆశావాహులు మాత్రం ఇది అది అని తేడా లేకుండా వాగ్దానాల వర్షం కురిపిస్తున్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయి ఎన్నికలను మించి వాగ్దానాలు చేస్తున్నారు. సాధారణ ఎన్నికలను తలపిస్తూ గ్రామాలకు వర్గాల వారీగా ఏమి చేస్తామో ప్రకటిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి మూడవ వారంలో స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వస్తుందని పరోక్షంగా వెల్లడించిన నేపథ్యంలో ఆశావాహులు గ్రామాల్లో ప్రచారం ప్రారంభించారు. నిన్న మొన్నటి వరకు రిజర్వేషన్ల గురించి చర్చించిన వారు సైతం సానుకూల రిజర్వేషనే వస్తుందని భావించి ఇల్లు ఇల్లు తిరుగుతూ వాగ్దానాలు చేస్తున్నారు. గ్రామాల్లోని అంతర్గత రోడ్లను సొంత ఖర్చులతో నిర్మిస్తామని కొందరు, డ్రైనేజీలు నిర్మిస్తామని, పాఠశాలలకు, దేవాలయాలకు పెద్ద మొత్తంలో వితరణ చేస్తామని ప్రజలకు హామీలు ఇస్తున్నారు. మరి కొందరు ఓ అడుగు ముందుకేసి గ్రామ పంచాయతీ పరిధిలో తనను సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామంలో జరిగే ప్రతి ఆడ పిల్ల పెళ్లికి రూ.10,116 అందజేస్తామని హామీ ఇస్తున్నారు. దేవాలయాల్లో పూజారులకు ఏడాదికి రూ. 25వేలు ఇస్తామని ఓ అభ్యర్థి ప్రచారం చేస్తూ లిఖిత పూర్వక హామీ ఇస్తామని ప్రచారం చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఈ నజరానాలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. ఇక ఏకగ్రీవంగా సర్పంచ్ పదవి ఇస్తే గ్రామానికి పెద్ద మొత్తంలో ఇస్తామంటూ ఇచ్చే మొత్తాన్ని రోజు రోజుకు పెంచుకుంటూ వెళ్తున్నారు. మరికొందరు ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా తమ సొంత నిధులతో హామీలను అమలు చేస్తామని చెబుతున్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు తమ ప్రభుత్వం అధికారంలో ఉందని తమను సర్పంచ్‌గా గెలిపిస్తే ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి గ్రామ స్వరూపాన్ని మార్చివేస్తామని హామీలు ఇస్తున్నారు. ఈ వాగ్దానాలను చూస్తూ ప్రజలు విస్తుపోతున్నారు. నోటిఫికేషన్ తర్వాత రిజర్వేషన్ల ప్రకటన వస్తే ఆశావాహులు మరింతగా వరాలు కురిపించే అవకాశం ఉంది. బిసి గణనకు రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలపడంతో రిజర్వేషన్లలో బిసి స్థానాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుత రిజర్వేషన్లు ఖచ్చితంగా మారనున్న నేపథ్యంలో నోటిఫికేషన్, రిజర్వేషన్ ప్రక్రియ కోసం ఎదురు చూస్తున్నారు.

## మహిళా ప్రాంగణ విద్యార్థినులకు కలెక్టర్ అభినందనలు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎంపిహెచ్‌డబ్ల్యూ ఫలితాల్లో రాష్ట్ర జిల్లా స్థాయిలో అద్భుత ప్రతిభ కనబర్చిన మహిళా ప్రాంగణ విద్యార్థినిలకు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రత్యేకంగా అభినందించారు. ఎంపిహెచ్‌డబ్ల్యూ (మల్టి పర్పస్ హెల్త్ వర్కర్) పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులు సాధించిన ఖమ్మం మహిళా ప్రాంగణ విద్యార్థినిలు మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఎంపిహెచ్‌డబ్ల్యూ పరీక్షల్లో ఫస్ట్ ఇయర్ మొదటి 10 ర్యాంకుల్లో 1,6, 8, 10 స్టేక్ ర్యాంకులు, ద్వితీయ సంవత్సరంకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో స్టేట్ రెండవ ర్యాంకు నుంచి 12వ ర్యాంకులను అదేవిధంగా జిల్లా స్థాయిలో మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలో 1 నుంచి 10 ర్యాంకులు ఖమ్మం మహిళా ప్రాంగణ విద్యార్థినిలకు వచ్చాయని మహిళా ప్రాంగణ మేనేజర్ వేల్పుల విజేత కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపిహెచ్‌డబ్ల్యూ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబర్చిన విద్యార్థినిలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. జీవితంలో మరింత ఉన్నత స్థానానికి ఎదగడానికి కృషి చేయాలన్నారు. మనం చదివిన కోర్సుల ద్వారా ఏ పోటీ పరీక్షలకు హాజరు కావచ్చు, ఏ రంగాల్లో ఎదగవచ్చు వంటి విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మొదటి సంవత్సరంలో రాష్ట్ర స్థాయి మొదటి, ఆరు, ఎనిమిది, పది



ర్యాంకుల విద్యార్థినిలు జే. పావని, ఎం. శ్రావణి, డి. సంధ్యావిక, బి. కల్పనలను అదేవిధంగా రెండవ సంవత్సరంలో రాష్ట్ర స్థాయి రెండవ ర్యాంకు నుండి 10వ ర్యాంకు పొందిన విద్యార్థినిలు మనీలా, ప్రమీలరాణి, బి. రచన, పి. శాంతిప్రియ, బి. శిరీష, బి. ఇందు, జే.ఎస్తేర్, డి. సాయికుమారి, ఆర్. శైలజలను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రాంగణ మేనేజర్ వేల్పుల విజేత, నాగ సరస్వతి, స్పందన, హిమబిందు, మల్లిక, విజయ్‌కుమార్, సుకన్య, మౌనిక, లాలయ్య, దుర్గారావు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## బాలల రక్షణకే బాల రక్షాభవన్

కలెక్టర్ జితేష్ వి పాటిల్

**ప్రజాపక్షం/భద్రాచలం :** బాలల రక్షణకే బాల రక్షా భవన్ ను ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాల రక్షణ భవన్‌లోని అన్ని గదులను ఆయన పరిశీలించారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బాలరక్షాభవన్‌లో కావాల్సిన వస్తువులు, కార్యాలయానికి అవసరమైన కంప్యూటర్లు, ఇతర సామాగ్రి ఏర్పాటుకు నివేదికలు అందజేయాలని మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ అధికారి స్వర్ణలత లెనీనాను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాల రక్షా భవన్‌లో బాలల పరిరక్షణ విభాగం, బాలల సంక్షేమ సమితి, బాలల న్యాయమండలి, ప్రత్యేక బాలల పోలీస్ విభాగం, జాతీయ బాలల కార్మిక నిర్మూలనా పథకం అధికారులంతా ఒక చోట అందుబాటులో ఉంటారన్నారు. సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో సమస్యలు పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యూసి చైర్ పర్సన్ భారతీయ రాణి, డిసిడిఓ హరికుమారి, సిడబ్ల్యూసి సభ్యులు సుమిత్రాదేవి, షాదిక్ పాషా, చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ సందీప్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## త్రిష మరింత ఎత్తుకు ఎదగాలి

సిపిఐ ఆధ్వర్యంలో అభినందన సభ




**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం ముద్దుబిడ్డ, ప్రపంచ అండర్ 19 క్రికెట్ కప్ విజేత గొంగటి త్రిష మరింత ఉన్నత శిఖరాలు అందిరోహించి జాతీయ మహిళా ప్రధాన క్రికెట్ జట్టుకు భవిష్యత్‌లో ప్రాతనిధ్యం వహించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో పట్టణ నాయకులు కంబంమెట్టు శ్రీనివాస్ అధ్యక్షతన అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ భద్రాచలం పట్టణంలో పుట్టి పెరిగి తండ్రి అడుగు జాడల్లో క్రికెట్ ఓనమాలు నేర్చుకున్న త్రిష జాతీయస్థాయికి ఎదగడం, అంతర్జాతీయ స్థాయిలో విజేతగా నిలవడం భద్రాచలానికే కాక, తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో ఎస్‌విఎస్ నాయుడు, మారెడ్డి శివాజీ, శోభన్, మహేష్, గంగాధర్, వెంగళరావు, సాయిరాం, విజయ్, సాయిరామ్, కృష్ణపాల్గొన్నారు.

## పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటాలి: రాజేశ్వరరావు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యార్థులు పోటీ పరీక్షల్లో తమ ప్రతిభను చాటాలని, సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రతిభా పరీక్షలు ఉపయోగపడతాయని ఇటువంటి పరీక్షల ద్వారా మానసిక ధైర్యాన్ని పెంపొందించుకుని ఒత్తిడిని తగ్గించుకోవాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రాజేశ్వరరావు,ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకులు బాగం హేమంతరావు పిలుపు నిచ్చారు. మంగళవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం నగరంలోని ఎన్నెస్పి క్యాంపులో గల ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో టాలెంట్ టెస్ట్ పేపర్‌ను ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. రాజేశ్వరరావు, ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకులు బాగం హేమంతరావు లు ఆవిష్కరించారు. అనంతరం ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ ఎస్. రాజేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి విద్యార్థి సంఘం, స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించి ఎందరినో అత్యున్నత మేధావులుగా తీర్చిదిద్దిన ఏకైక విద్యార్థి సంఘం ఎఐఎస్ఎఫ్ అని ఆయన తెలిపారు. విద్యా రంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎఐఎస్ఎఫ్ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి టాలెంట్ టెస్ట్‌లు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకులు బాగం హేమంతరావు మాట్లాడుతూ ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉద్యమాలతో పాటు విద్యార్థులకు ఇటువంటి టాలెంట్ టెస్ట్‌లు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు పరీక్షల పట్ల వారికి ఉన్న భయాన్ని పోగొట్టేందుకు ఉపయోగపడతాయన్నారు. ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ మాట్లాడుతూ టాలెంట్ టెస్ట్ విద్యార్థులకు ఉపయోగపడేవిధంగా పేపర్‌ను రూపొందించామని ఆయన తెలిపారు. వారి సిలబస్ నుండే 100 మార్కులకు అబ్జెక్టివ్ రూపంలో అన్ని సబ్జెక్టులు ఈ ప్రశ్నాపత్రంలో ఉంటాయని ఆయన తెలిపారు. విద్యార్థులకు ఉపయోగపడేవిధంగా ముఖ్యమైన ప్రశ్నలు మాత్రమే ఈ టాలెంట్ టెస్ట్‌లో ఉండేవిధంగా తగు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ పరీక్షను పదవ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నెస్పి పాఠశాల హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు యలమద్ది వెంకటేశ్వరరావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల్లో విజయమే లక్ష్యం:మట్టా



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అభ్యర్థుల గెలుపు లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయకుమార్. మంగళవారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా దయానంద్ హాజరై గ్రామాల వారీగా కాంగ్రెస్ నాయకులు నుండి అభిప్రాయాలు, ఇబ్బందులు తదితరాలను తెలుసుకున్నారు. అనంతరం దయానంద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోస్థానిక సంస్థలకు ఎన్నికలు నోటిఫికేషన్ రానున్న సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలన్నింటిని ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తి తెలియజేయాలన్నారు. అభ్యర్థి ఎన్నిక విషయంలో, గ్రూపులు కట్టకుండా ఐక్యంగా ఎన్నుకోవాలని, మీరు ఎన్నుకున్న అభ్యర్థి ఎన్నికల బరిలో అఖండ విజయంతో గెలవాలన్నారు. ప్రతిపక్ష పార్టీ మాటలను పట్టించుకోవాల్సిన లేదని, ఆ నాయకుల పని అయిపోయిందని ఆనాడు, ఈనాడు కేవలం మాటలు గారడీతోనే ప్రజాక్షేత్రంలో ఉంటున్నారని విమర్శించారు. ఎన్ని ఇబ్బందులు ఉన్న, నాడు ఇచ్చిన మాట ప్రకారం అన్ని పథకాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు అందిస్తున్నారన్నారు. మీ గ్రామాభివృద్ధి, మీ చేతుల్లోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, వేంసూరు మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ తీరు ప్రశంసనీయం

సిపిఐ నేత బాగం

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఎస్‌సి వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమని మూడు దశాబ్దాల వర్గీకరణ సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం ముగింపు పలికిందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. రాష్ట్ర శాసనసభ ఎస్సి వర్గీకరణకు ఆమోదం తెలపడంతో పాటు తదనుగుణంగా మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్‌సి వర్గీకరణకు సిపిఐ మొదటి నుంచి మద్దతుగా నిలిచిందని ఈ సందర్భంగా హేమంతరావు గుర్తు చేశారు. సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి సిపిఐ అభినందనలు తెలియజేస్తుందన్నారు. కుల గణనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందించదగినదని ప్రస్తుత కుల గణన ప్రకారం ఆయా కులాలకు సంబంధించి అన్ని వర్గాలు లబ్ది పొందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక అవకాశాలను కల్పించాలని సూచించారు. దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలన్నారు. మోడీ ప్రభుత్వం జన గణన, కుల గణన అంటే ఎందుకో భయపడుతుందని ఆయన ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో బిజెపి ఇందుకు తగిన మూల్యం చెల్లించక తప్పదని హేమంతరావు హెచ్చరించారు.

## చారిత్రక ఆనవాళ్లు ప్రతిబింబించాలి

* యాత్రికులను ఆకర్షించేలా పాలేరు లేక్ అభివృద్ధి
* 'పిక్నిక్ స్పాట్'గా ఖమ్మం ఖిల్లా
* పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీక్ష



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను చారిత్రిక ఆనవాళ్లు ప్రతిబింబించేలా అభివృద్ధి చేయాలని ఆ దిశగా అధికారులు అవసరమైన చర్యలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పురావాస్తు, పర్యాటక శాఖాధికారులతో నేలకొండపల్లి బౌద్ధ స్తూపం, పాలేరు లేక్, ఖమ్మం ఖిల్లా పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై సమీక్షించారు. నేలకొండపల్లి బౌద్ధ స్తూపం, పాలేరు లేక్, ఖమ్మం ఖిల్లా వంటి పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చేపడుతున్న చర్యల గురించి కలెక్టర్ వివరాలు తెలుసుకుని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చారిత్రాత్మక ప్రాంతాల వద్ద సిమెంట్ కట్టడాలను తగ్గించాలని అక్కడ చేపట్టే ప్రతి అభివృద్ధి పనిలో మన చరిత్ర ప్రతిభింభించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సందర్శకులకు మన చరిత్ర తెలిసేవిధంగా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. బౌద్ధ స్తూపం వద్ద ఎయిర్ మ్యూజియం ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు తయారు చేయాలని అక్కడ వాకింగ్ పార్క్ అభివృద్ధి చేయాలని, రాతి శిల్పాల ప్రదర్శనకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు అధికంగా పర్యాటకులు వచ్చేవిధంగా జాతీయ రహదారులలో, ముఖ్యమైన కూడళ్ల వద్ద సమాచార బోర్డులు, పర్యాటక ప్రాంతాలకు దారి చూపే విధంగా సైనేజ్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. చారిత్రాత్మక ప్రాంతాల వద్ద బోర్డులను ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్లు, ఇతర వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచంలోని ఏథెన్స్‌లోని పార్థినన్ ఈజిప్ట్ కార్నక్ టెంపుల్ వద్ద అక్కడ చరిత్ర తెలిసేవిధంగా అద్భుతంగా ఏర్పాటు చేశారని అదేవిధంగా మన జిల్లాలోని చారిత్రక ప్రాంతాలు కూడా ప్రజలకు సులభంగా చరిత్ర అర్థమయ్యేవిధంగా ఏర్పాట్లు చేయుటకు ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ సూచించారు. పాలేరు లేక్ పార్కు వద్ద ఉన్న పాత నిర్మాణాలకు కావాల్సిన మరమ్మతులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సందర్శన ప్రాంతాలుగా తీర్చిదిద్దాలన్నారు. చక్కటి ప్రాంతం సందర్శించిన అనుభూతి కలిగేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. సందర్శకులకు అవసరమైన మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించాలన్నారు. బోటింగ్‌కు చర్యలు చేపట్టాలని, కాటేజీల నిర్మాణానికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఖమ్మం ఖిల్లా వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ తయారు చేయాలని అధికారులకు సూచించారు. పిక్నిక్ స్పాట్ క్రింద ఖమ్మం ఖిల్లాను అభివృద్ధి చేసేందుకు అక్కడ నాలుగు నుండి ఐదు వ్యూ పాయింట్లను అభివృద్ధి చేయాలని కలెక్టర్ తెలిపారు. రోప్‌వే నిర్మాణానికి సమస్యల పరిష్కారం త్వరితగతిన చేయాలన్నారు. పాత్రికేయులు, ఉద్యోగులు, ఇతర ప్రముఖులు ఖమ్మంఖిల్లాను సందర్శించేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, ఆర్కిటెక్చర్ సత్యశ్రీనివాస్, సీనియర్ ఇంజనీర్ వెంకటేష్, టూరిజం శాఖ డిఈలు ఎన్. రామకృష్ణ, ఎంవి శ్రీధర్, పురావాస్తు శాఖ ఏడిలు బి. మల్లునాయక్, నర్సింగ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'నిట్' రిజిస్ట్రార్‌గా సుశీల్ కుమార్ మిశ్రా



ప్రజాపక్షం/కాజీపేట : నిట్ వరంగల్‌లో రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ ఎన్.వి. ఉమామహేశ్ నుంచి సుశీల్ కుమార్ మిశ్రా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమం నిట్ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుభుధి సమక్షంలో జరిగింది. సుశీల్ కుమార్ మిశ్రా ప్రస్తుతం ఉత్తర ప్రాంతం డైరెక్టర్‌గా బోర్డు ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ ఉన్నత విద్యా విభాగం, విద్యా మంత్రిత్వ శాఖలో పనిచేస్తున్నారు. నిట్ వరంగల్ రిజిస్ట్రార్‌గా ఆయన డిప్యూటేషన్‌పై పదవి స్వీకరించారు. సుశీల్ కుమార్ మిశ్రా సుమారు 25 ఏళ్లకుపైగా పరిపాలనా అనుభవాన్ని కలిగి ఉన్నారు. రిజిస్ట్రార్‌గా ఆయన ఐదేళ్లపాటు సేవలు అందించనున్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణపై స్పెషల్ డ్రైవ్



ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి: ములుగు జిల్లా ఎస్‌పి శబరీష్ ఆదేశాల మేరకు ములుగు జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణపై స్పెషల్ డ్రైవ్‌ను మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా జంగాలపల్లి గ్రామంలోని జంగాలపల్లి జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి అక్కడ జంక్షన్‌లో ఎన్‌హెచ్ డివైడర్‌పైన ఉన్న ఐరన్ బారికేడింగ్, చెట్లు ఉండడం వలన యూ తీసుకునే సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని గుర్తించి వాటిని జంగాలపల్లి గ్రామ పంచాయతీ సిబ్బంది సహాయంతో తొలగించారు. అలాగే రోడ్డు ప్రమాదాలకు కారణాలైన డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఇతర ట్రాఫిక్ నియమాల గురించి గ్రామ ప్రజలలో అవగాహన కల్పించారు.

## రోడ్డు ప్రమాదంలో యువ డాక్టర్ మృతి



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: మహబూబాబాద్ శివారు శనిగపురం గ్రామానికి చెందిన యువ డాక్టర్ చుక్క శ్రీచరణ్ మంగళవారం హైదరాబాద్ మేడ్చల్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో శనిగపురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడు చుక్క శ్రీనివాస్ కొడుకు. ఎంతో కష్టపడి తన కొడుకును డాక్టర్‌ను చేసిన తలిదండ్రులకు మనోవేదన మిగిలిపోయింది. ఈ విషయం తెలిసిన మహబూబాబాద్ మాజీ ఎంపి మాలోత్ కవిత హుటాహుటీన హైద్రాబాద్ బయలుదేరి గాంధీ హాస్పత్రిలో ఉంచిన శ్రీచరణ్ మృతదేహాన్ని సందర్శించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుంటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వెలిబుచ్చి వారిని ఓదార్చారు.

## పకడ్బందీగా నులిపురుగుల దినోత్సవం

### జిల్లా వైద్యశాఖ అధికారి మధుసూదన్

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పగడ్బందీగా నిర్వహించాలని డిఎంహెచ్ఓ డాక్టర్ మధుసూదన్ అధికారులను ఆదేశించారు. ఎంఒలు డాక్టర్లు సూపర్వైజర్లు జూమ్ మీటింగ్ ఏర్పాటు చేసి మాట్లాడారు. జాతీయ నులిపురుగుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి ఒక్కరికి నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలకు ఈ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ఫిబ్రవరి 10న అటెండెన్స్ సమయంలో విద్యార్థులకు మాత్రలు వేయాలని తెలియజేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైతం మాత్రలు వేయాలన్నారు. నులిపురుగులు పేగుల్లో ఉండి రక్తాన్ని పీల్చుకుంటాయని తద్వారా పిల్లల్లో రక్తహీనత అనిమియా ఏర్పడుతుందని తెలిపారు. ప్రతి ఒక్క పిల్లవారికి నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలన్నారు. తప్పిపోయిన పిల్లలకు 17వ తేదీన ఈ మాత్రలు వేయాలన్నారు. 0 నుండి 19 సంవత్సరాల పిల్లలు 69,652 అంగన్వాడి సెంటర్లు 18, 375 స్కూల్ పిల్లలు 46,330 కాలేజ్ పిల్లలు 3373 వీరందరికీ నులిపురుగు నివారణ మాత్ర అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశలు 413 మంది ఏఎన్ఎంలు 140 మంది అంగన్వాడి సెంటర్లు 604 ఎంఎల్ హెచ్పిలు5, ఎంఒలు 20, సూపర్వైజర్లు 28, ఆర్‌బిఎస్‌కే టీం 4 108 వెహికల్స్ పని చేస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్లు, డాక్టర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా కొనసాగుతున్న జిల్లా క్రికెట్ పోటీలు



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ స్టేడియంలో 2వ రోజు జరుగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు, పోలీసు క్రీడలు ఉత్కంఠగా ఉత్సాహంగా జరిగాయి. మంగళవారం జ్యూడిషరి వర్సెస్ జెన్కోకు జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణ బాబు, ఎస్పి కిరణ్ ఖరే, జెన్కో చీఫ్ ఇంజనీర్ సిహెచ్.ప్రకాశ్, న్యాయ మూర్తులు, జయరాం రెడ్డి, రామ చంద్ర రావు, అఖిల, పాల్గొని ఆటగాళ్లను ఉత్సాహపరిచారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



ప్రజాపక్షం/దేవరుప్పుల: ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సిరెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో మండలంలోని బంజారా గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామపార్టీ అధ్యక్షుడు దేవర వీరస్వామి తల్లి లచ్చమ్మ ఇటీవల మృతి చెదగా కాంగ్రెస్ పార్టీ నాయకులు వారికుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బిసి, ఎస్‌టి, ఎస్‌టి, మైనార్టి సెల్ అధ్యక్షులు కాడబోయిన గణేష్, ఇనుముల నాగరాజు, భూక్య సజ్జన్, గులాం రసూల్, బోనగిరి యాకస్వామి, అనిల్‌కుమార్, మాజీ ఎంపిటిసి ఎండి జాకీర్, కాడబోయిన వెంకన్న, నర్సయ్య, నాయకులు ఉమేష్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులోకి ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్యాన్సర్ చికిత్స

### వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య, సినీ నటి గౌతమి



ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాన్సర్ అవగాహన కార్యక్రమానికి సినీనటి గౌతమితో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా హనుమకొండ పబ్లిక్ గార్డెన్ వద్ద నుండి కాళోజీ కళాక్షేత్రంవరకు నిర్వహించిన వాక్‌థాన్ ను ఎంపి డాక్టర్ కడియం కావ్య జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కాళోజీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన వేదికపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. గ్రామీణ స్థాయిలో క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలు చేపట్టి, కాన్సర్‌ని తొలిదశలో గుర్తిస్తే నివారించడం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రాణాంతకమైన క్యాన్సర్ నుంచి కాపాడుకోవడానికి ఏకైక మార్గం ఆ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడటమేనని ఎంపి చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్యాన్సర్ చికిత్స అందుబాటులోకి వస్తే పేద మధ్యతరగతి వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్యాన్సర్ చికిత్సకు, మందులకు వెసులుబాటు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మద్యపానం, ధూమపానం, జంక్ ఫుడ్ తదితర వాటికి దూరంగా ఉండాలన్నారు. క్యాన్సర్ బారిన పడినవారు భయపడాల్సిన పనిలేదని, ధైర్యంతో క్యాన్సర్ జయించవచ్చని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలో మొదటిసారిగా క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తున్న ప్రతిమ ఫౌండేషన్ యాజమాన్యాన్ని ఎంపి అభినందించారు. వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే క్యాన్సర్ నయం చేయవచ్చునని సినీ నటి గౌతమి అన్నారు. తాను కూడ క్యాన్సర్ భారిన పడి 20 పోరాడి గెలిచానని అన్నారు. క్యాన్సర్ వ్యాధికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్సను అందుబాటులోకి తీసుకురావాలని, క్యాన్సర్ రోగులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెసులుబాటు కల్పించాలన్నరు. ఈ కార్యక్రమంలో ప్రతిమ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ హరిణి, ప్రతిమ ఇన్ స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ రమేష్, డైరెక్టర్లు డాక్టర్ ప్రతీక్, డాక్టర్ రాహుల్, డాక్టర్ అవినాష్ ఇతర వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలపై పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: రానున్న శాసనమండలి(ఎమ్మెల్సీ), పంచాయతీ, ఎంపిటిసి ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అన్నిరాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 482గ్రామ పంచాయతీలు, 4110 వార్డుల వారీగా ఓటరు జాబితా సవరణలు అభ్యంతరాలు, గ్రామ పంచాయతీ, వార్డు పోలింగ్ బూత్‌లు వివిధ అంశాలపై వారితో చర్చించి సలహాలు సూచనలు తీసుకున్నారు. జిల్లాలోని రెండవ ఓటరు సవరణ జాబితా ఓటరు సవరణపై మంగళ, బుధ వారం మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని, అట్టి వివరాలను సేకరిస్తామన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారి, జెడ్‌పి సిఇఓ పురుషోత్తం, జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నుండి సురేష్నాయక్, బిఆర్ఎస్ నుండి మార్నేని వెంకన్న, సిపిఐ నుండి పెరుగు కుమార కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి

### సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి రాజేందర్

ప్రజాపక్షం/ నర్సంపేట: కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని, ఫిబ్రవరి 20న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ పిలుపునిచ్చారు. నర్సంపేటపట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఫిబ్రవరి 20న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమం కరపత్ర ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం ఇంటిట సౌభాగ్యం అంటూ తెలంగాణ రాష్ట్ర ప్రజానీకానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు చేసిన వాగ్దానాలు పద్నాలుగు నెలలు గడుస్తున్న పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు తయారయిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మినహా మిగిలిన ఐదు గ్యారంటీలలో కొన్ని ఇంకా ప్రారంభమే కాలేదన్నారు. నిరంకుశపాలకు స్వస్తి చెప్పి తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు పూర్తిస్థాయి ప్రజాస్వామిక పాలన అందిస్తామన్న ప్రజాస్వామిక పాలన మాటలకే పరిమితమైందన్నారు. పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు బోగి సారంగపాణి, డివిజన్ నాయకులు భద్రజీ, మల్లన్న, గుగులోత్ కిషన్ స్వామి, పివైఎల్ జిల్లా నాయకులు రంజిత్ పాల్గొన్నారు.

# కుంభాభిషేకం మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరంలో ఈ నెల 7వ తేదీ 9వ తేదీ వరకు నిర్వహించనున్న కుంభాభిషేకం మహోత్సవాలకు విచ్చేయు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో కుంభాభిషేకం మహోత్సవాలు నిర్వహణపై దేవాదాయ, పంచాయతీ రాజ్, విద్యుత్, వైద్య, ఇరిగేషన్, పోలీస్, అగ్నిమాపక, ఆర్‌టిసి, సమాచార శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాళేశ్వరం బస్టాండ్ నుండి గోదావరి నది వరకు మరియు బస్టాండ్ వద్ద గల దేవస్థానం ఆర్చి గేటు నుండి శ్రీఆంజనేయ స్వామి దేవాలయం ముందుగల ఆర్చ్‌గేట్‌వరకు, దేవస్థానం బయట ఆవరణ మొత్తం ప్రత్యేక స్వీపర్లను నియమించి ప్రతిరోజు పారి శుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాకని సూచించారు. కుంభాభిషేకం జరుగు (3) రోజులు ప్రధాన ఘాట్, విఐపి ఘాట్‌వరకు మొత్తం ప్రత్యేక పారిశుద్ధ్య కార్మికులను నియమించి పరిశుభ్రత పనులు చేపట్టాలని ఆదేశించారు. 5వ తేదీ నుండి పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రారంభించాలని తెలిపారు. మహదేవపూర్ నుండి కాళేశ్వరంవరకు రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చాలని సూచించారు. 7 నుండి 9 వ తేదీ వరకు 3 రోజులు అత్యవసర వైద్య సేవలు నిమిత్తము అన్ని సదుపాయాలతో కూడిన మెడికల్ క్యాంపు పాత దేవస్థానం కార్య నిర్వహణ అధికారి కార్యాలయంలో ముందు ఏర్పాటు చేయాలని తెలిపారు. గోదావరి నది వద్ద దేవస్థాన ప్రాంగణములో భక్తులకు మంచినీటి వసతికి గాను ఆర్.ఒ. వాటర్ డ్రమ్ముల ద్వారా మంచినీటి సౌకర్యాలు కల్పన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆలయ వెనుక భాగంలో గల మరుగు దొడ్లను వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎఎస్‌పి బోనాల కిషన్, డిపిఓ నారాయణ రావు, విద్యుత్ శాఖ ఎస్ఎ మల్హార్ నాయక్, వైద్యాధికారి డా॥ మధు సూధన్, డిపిఆర్ఓ శ్రీనివాస్, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, పిఆర్ఇఇ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ప్రహద్ రాథోడ్, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఉచిత అన్నదానం వద్ద భకుల రద్దీ నియంత్రణకు క్యూ పాటించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్యసేవలు

### హనుమకొండ కలెక్టర్ ప్రావిణ్య



ప్రజాపక్షం/ హనుమకొండ ప్రతినిధి : వైద్య సేవల నిమిత్తం ప్రాథమిక ఆ రోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సహాయాన్ని అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల నిమిత్తం రోజు ఎంత మంది వస్తుంటారనే వివరాల ను సంబంధిత ఆరోగ్య కేంద్రం వైద్యులను, సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని ఫార్మసీలో మందులు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన పలు రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాలలో ప్రతి నెల దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పించి నిర్ధరణ పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షల ద్వారా గుర్తించిన బిపి, షుగర్ పేషెంట్లకు ఉచితంగా మందులను ఎమ్మెల్యేలు, ఆశా కార్యకర్తల ద్వారా అందే విధంగా చర్యలు చేపట్టాలని వైద్యాధికారులకు సూచించారు. అదేవిధంగా ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ క్యాన్సర్ పట్ల గ్రామాలలో ఎమ్మెల్యేలు, ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. క్యాన్సర్ లక్షణాలను ముందస్తుగా గుర్తించి టెస్టులు చేయించుకున్నట్లయితే సమస్యను పరిష్కరించుకునే అవకాశం లభిస్తుందన్నారు. చాలా కేసులలో క్యాన్సర్ అనేది ఆఖరు దశలోనే తెలుస్తుందని, అప్పుడు ఎవరు ఏమి చేయలేని పరిస్థితి నెలకొని ఉంటుందన్నారు. కాబట్టి క్యాన్సర్ గురించి ప్రజలలో ఎమ్మెల్యేలు, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సరైన సమయంలో క్యాన్సర్ సంబంధిత వైద్య సేవలు గురించి ఎమ్మెల్యేలు, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించినట్లయితే మంచి ట్రీట్మెంట్ తీసుకొని రికవరీ అయ్యే అవకాశాలు ఉంటాయన్నారు. ధూమపానం, మద్యపానం వలన తలెత్తే ఆరోగ్య సమస్యల పైన ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, హనుమకొండ ఆర్‌డిఓ రాథోడ్ రమేష్, స్థానిక తహసీల్దార్ జగత్ సింగ్, ఇతర అధికారులు, ఎమ్మెల్యేలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కలకలం సృష్టిస్తున్న మావోయిస్టు నేత లేఖ

### ఆజంజాహీ మిల్లు భూములు కబ్జా చేశారంటూ ఇద్దరిపై ఆరోపణ



ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి : అజాం జాహి మిల్లు భూములకు సంబంధించి హైకోర్టు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్, వరంగల్ వాసి సుద్దాల నాగరాజు తప్పుడు ప్రతాలు సృష్టించారని మావోయిస్టు నేతలు ఆరోపించారు. ఆ తప్పుడు పత్రాలతో వారు మిల్లు భూములు అమ్మేసి డబ్బులు దండుకున్నారని మండిపడ్డారు. ఈ లేఖ వరంగల్ జిల్లాలో కలకలం సృష్టిస్తున్నది. అజాం జాహి మిల్లు భూములు అన్యాక్రాంతం అయ్యాయంటూ మావోయిస్టులు విడుదల చేసిన లేఖలో పేర్కొన్నారు. అజాం జాహి మిల్లు కార్మికులకు సంబంధించిన భూములను కొత్త మంది వ్యక్తులు అమ్ముకున్నారంటూ జయశంకర్, మహబూబాబాద్, వరంగల్, పెద్దపల్లి (జెఎండబ్ల్యుపి) డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ పేరుతో లేఖ విడుదలైంది. హైకోర్టు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్, వరంగల్ వాసి సుద్దాల నాగరాజు మిల్లుకు సంబంధించిన కార్మిక భవనం, భూమి విషయంలో తప్పుడు పత్రాలు సృష్టించారని మావోయిస్టులు ఆ లేఖలో పేర్కొన్నారు. ఆ పత్రాలతో కార్మికుల భూమిని వరంగల్ కు చెందిన బడా వ్యాపారి నమశ్శివాయ అనే వస్త్ర వ్యాపారికి అమ్మేశారని ఆరోపించారు. అజాం జాహి మిల్లుకు సంబంధించిన భూములు, భవనంతోపాటు విలువైన డాక్యుమెంట్లను సైతం అమ్మేశారని ఆరోపించారు. ఈ విషయంలో వరంగల్‌కు చెందిన సుద్దాల నాగరాజు అసంఘటిత కార్మిక సంఘం పేరుతో చలామణి అవుతూ అక్రమంగా ఆస్తులు కూడబెట్టాడని ఆగ్రహించారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అజాం జాహి భూముల కబ్జాదారులను శిక్షించకుండా కొమ్ముకాస్తోందంటూ మండిపడ్డారు. పోలీసులకు కార్మికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కబ్జాదారులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని ఆ భూమిని తిరిగి కార్మికులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు కార్మికుల పోరాటానికి మద్దతు ఇవ్వాలని పేర్కొన్నారు. కాగా, రాజకీయ, వ్యాపార వర్గాల్లో మావోయిస్టుల లేఖ కలకలం రేపుతోంది.

## మన అగ్రిటెక్‌లో నూతన డ్రోన్ స్ప్రేయర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/ఖిలా వరంగల్: మన అగ్రిటెక్‌లో నూతన డ్రోన్ స్ప్రేయర్‌ను మార్కెట్ గ్రేడ్ సెక్రటరీ నిర్మల, ఇతర ప్రముఖులు మంగళవారం ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని నేటి ఈ మానవ లోకం ఎంతో ముగుందడుగువేస్తుందన్నారు. అనుకున్నదే తడవుగా నిమిషాలో అనుకున్న పనిని పూర్తి చేసే విధంగా ఆధునికరణ చెందిందంటే అతియోక్తి కాదు. నేడు వ్యవసాయ రంగంలో సైతం సాంకేతిక పరిజ్ఞానంతో ఒక్కో అడుగు ముందుకు వేస్తున్న తరుణంలో వ్యవసాయ రంగాన్ని మరింత సులభతరం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం ఆమోదించబడిన ప్రముఖ సంస్థ దక్ష కంపనీవారు మన అగ్రిటెక్ అధినేత పాషికంటి రమేశ్ నేతృత్వంలో మంగళవారం వరంగల్ ఎనుమాములలోని మన అగ్రి టెక్‌లో డ్రోన్ స్ప్రేయర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భగా మార్కెట్ గ్రేట్ సెక్రటరీ నిర్మల, మార్కెట్ మాజీ డైరెక్టర్ పిన్నింటి వెంకట్‌రావు, నూతకల్ పిఎసిఎస్ ఛైర్మన్ జయపుసుధ, ఇతర ప్రముఖులు ముఖ్యఅతిథులుగా హాజరైన రిబ్బన్ కట్‌చేసి నూతన డ్రోన్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మన అగ్రిటెక్ అధినేత పాషికంటి రమేశ్ మాట్లడుతూ.. వ్యవసాయంలో రైతులు ఆధునీకరణ దిశగా సాగుతూ ఎన్నో అద్భుతాలను సృష్టించడలంలో మన అగ్రిటెక్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అందులో భాగంగా మంగళవారం మన అగ్రిటెక్‌లో నూతన డ్రోన్‌ను ప్రారంభించారు. ఆధునిక ఫీచర్స్‌తో రైతుల సమయం, ఖర్చు ఆదా చేసుకోవడమే కాకుండా ఇతర రైతులకు స్ప్రే చేయడం ద్వారా అధిక మొత్తంలో సంపాదించవచ్చన్నారు. డ్రోన్ స్ప్రే యర్స్ కావల్సిన వారు మన అగ్రిటెక్‌ను సంప్రదించాలన్నారు. కాగా కేంద్ర ప్రభుత్వంతో ఆమోదించబడిన ప్రముఖ దక్ష కంపనీ వారి డ్రోన్ స్ప్రేయర్ మన అగ్రిటెక్‌లో ఆవిస్కృతమైంది. ఈ డ్రోన్ 10 లీటర్ల నీటి సా మర్థ్యంలో రెండు బ్యాటరీలు అందిస్తున్నారు. బ్యాటరీలను ఒక్కసారి ఛార్జ్ చేసే మూడు ఎకరాలకు వస్తుందన్నారు. ఒక ఎకరం కేలం 5 నుంచి 7 నిమిషాల వ్యవధిలో పిచికారి చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాల కోసం ఎనుమాములలోని మన అగ్రిటెక్ స్టోర్‌ను సందర్శించాలన్నారు.

# పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: ఎమ్మెల్సీ ఎన్నికల నియమావలిని తప్పక అనుసరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్‌లతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించిందన్నారు. ఈ నెల 10వరకు నామినేషన్లు, 11న పరిశీలన, 13న ఉపసంహరణ ఈ నెల 27న పోలింగ్, మార్చి 3న ఫలితాలు వెల్లడించడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో మోడల్ కోడ్ ఖచ్చితంగా అమ ల్లో ఉంటుందన, రాజకీయ పార్టీలు ప్రచారాలు, సమావేశాలు, ర్యాలీల నిర్వాహణకు తప్పక అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చెల్లింపు వార్తల నివారణకు ప్రత్యేక జిల్లా మీడియా దృవీకరణ కమిటీ ఏర్పాటు చేశామని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, స్వేచ్ఛగా, సాగేందుకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలో బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాలని, పార్టీల కార్యక్రమాలు ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాలన్నారు. జిల్లాలో 995 మంది ఓటర్లు ఉండగా 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల సూపరిండెంట్ శ్రీకాంత్, రాజకీయ పార్టీల ప్రతినిధులు బి భాస్కర్, జోగు ప్రకాష్, రావెల రవి, అజయ్‌కుమార్, ఏ విజయ్ భాస్కర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఇవిఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మంగళవారం ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జనగామలోని సమగ్ర జిల్లా కార్యాలయ సముదాయంలో ఉన్న ప్రధాన ఈవిఎం గోదాంను పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రతా నమోదు పుస్తకం, సిసి కెమెరాల పనితీరు, మంటల నియంత్రణ పద్దతులను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలు కట్టుదిట్టంగా అమలు చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ గోపిరాం, తహసీల్దార్ హుస్సెన్, ఎఒ మన్సూని పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ వ్యాపారుల ధర్నా



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిపాలన భవనం ముం దు శ్రీసాయి లక్ష్మీ ట్రేడర్స్ అడ్తి దుకాణం యాజమాని కడారి సదానంద అకస్మాత్తుగా మృతిచెందగా చింతిస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాల ని రెండు నిమిషాలు మౌనం పాటించి వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో సంతాప నిర్వహించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్‌లోని యార్డులో క్లీనింగ్ లేక మిర్చి, ఇతర రైతుల సరుకుల రాకతో రవాణా వాహనాలతో, మిర్చి ఘాటు, దుబ్బా ధూళితో గుమాస్తాలు, దడువాయిలు, రైతులు, హమాలీలు, కార్మికులు, వ్యా పారులు అనారోగ్యానికి గురై మృత్యువాత పడుతున్నారని ఇలాంటి అత్యవసర సమయాల్లో బాధితులకు చికిత్స చేయడానికి 24 గంటలు మార్కెట్‌లో డాక్టర్లు అందుబాటులో ఉంచాలన్నారు. బాధితులను ఆసుపత్రికి తరలించడానికి అంబులెన్స్ సౌ కర్యం కల్పించాలని ఛాంబర్ ప్రతినిధులు, పలు కార్మిక సంఘాల నాయకులు కోరారు. మార్కెట్ లో మౌలిక సదుపాయాల కొరతతో వైఫై లేక పీఓఎస్ యంత్రాలు సరిగ్గా పనిచేయక కాంటాలు లేటు కావడం, దొంగతనాలు చోటు చేసుకోవడం నిత్యకృత్యంగా మారాయని, మౌలిక సదుపాయాలు సమకూర్చాలని పలు మార్లు లిఖితపూర్వకంగా మార్కెట్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తులు చేసినప్పటికీ పెడచెవిన పెడుతూ ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఇలాంటి ప్రభుత్వాధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధ రించి ధర్నా నిర్వహించారు. దీనిపై స్పందించిన మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, జిల్లా కలెక్టర్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డితో ఫోన్‌లో సంప్రదించి మూడు రోజుల్లో సమావేశం ఏర్పాటుచేసి చర్చించి తక్షణమే మౌ లి కసదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## సజావుగా భూ రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ



ప్రజాపక్షం/రఘునాథపల్లి: భూరికార్డుల పహాణీ డిజిటలైజేషన్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించి ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన రోజువారీ భూరికార్డులకు సంబంధించిన పహాణీల డిజిటలైజేషన్ విధానాన్ని క్షుణ్ణంగా పర్యవేక్షించి సిబ్బంది పలు సూచనలు చేశారు. డిజిటలైజేషన్ ప్రక్రియను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం అక్కడి నుండి ఎంపిడిఓ కార్యాలయాన్ని సందర్శించిన నేపథ్యంలో గ్రామ పంచాయతీలకు సంబంధించిన రెండవ అనుబంధ ఓటరు జాబితాలో నమోదైన, నమోదుకాని ఓటర్ల వివరాల్లో మార్పులు, చేర్పులు వంటి వాటిని ఎలాంటి తప్పులు దొర్లకుండా సక్రమంగా ఆన్‌లైన్ నమోదు చేయాలని సూచించారు. అలాగే ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాలలో తగిన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు.ఈ తనిఖీలలో కలెక్టర్ వెంట తహసీల్దార్ మహ్మద్ మొసిన్, ఎంపిడిఓ గార్లపాటి శ్రీనివాసులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఫోకస్

# మహిళ

## పట్టుదలే ప్రధానం...

# లక్ష్యసాధనకు వయసు అడ్డంకి కానేకాదు



మహిళలు సహజంగా 40 ఏళ్లకే వృద్ధులమైపోయామన్న భావనతో, నిరాసక్తంగా జీవితాన్ని గడిపేస్తుంటారన్నది వివిధ నివేదికల సమాచారం. ఇక ఐదు పదుల వయసు దాటితే, జీవిత చరమాంకానికి చేరినట్టు ఉదాసీనంగా ఉండిపోవడాన్ని గమనించవచ్చు. కానీ, కొంత మంది మహిళలు వయసుతో సంబంధం లేకుండా, తమకు నచ్చిన రంగాల్లో ముందుకు దూసుకెళుతున్నారు. లక్ష్యాలను అందుకుంటున్నారు. ఎంతో మందికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. అలాంటి వారి జాబితాలో గోలి శ్యామల పేరు చేరుతుంది. ఇటీవల విశాఖపట్నం నుంచి కాకినాడ వరకు, బంగాళాఖాతం సముద్రంలో 150 కిలోమీటర్లు ఈదిన వైనం సోషల్ మీడియాలో వైరల్ అయింది. జాతీయ స్థాయిలో స్ఫూర్తిదాయకమైన వార్తగా మారింది. డిసెంబర్ 28న వైజాగ్‌లో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన 52 ఏళ్ల శ్యామల ఐదు రోజులు ఈది, జనవరి ఒకటో తేదీన కాకినాడలోని ఎన్‌టిఆర్ బీచ్‌కి చేరింది. ఆమె సగటున 30 కిలోమీటర్ల దూరాన్ని పూర్తిచేసింది. సముద్రంలోని తాబేళ్లు తనను పలకరిస్తున్నట్టు అనుభూతి చెందానని చెప్పిన ఆమె, కాలుష్యం కారణంగా వాటి సంఖ్య తగ్గిపోతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ ఆవేదన వ్యక్తం చేసింది. జలచరాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ప్రస్తావించింది. శ్యామల సృజనాత్మక రచయిత్రి. దర్శకురాలు. నిర్మాత. వివిధ కారణాలతో తన యానిమేషన్ స్టూడియోను మూసివేసిన తర్వాత, తీవ్రమైన నిరాశకు గురైంది. దాని నుంచి బయటపడేందుకు స్విమ్మింగ్‌ను ఉత్తమ మార్గంగా ఎంచుకుంది. ఓపెన్ వాటర్ స్విమ్మింగ్‌పై అవగాహన పెంచుకుంది. సవాళ్లతో కూడిన ఈ విభాగంలోనే స్విమ్మింగ్‌ను కొనసాగించింది. ప్రావీణ్యం సంపాదించింది. పలు సాహసోపేతమైన స్విమ్మింగ్ లక్ష్యాలను పూర్తి చేసింది.



పాక్ స్ట్రెయిట్: 13 గంటల 43 నిమిషాల్లో 30 కిలోమీటర్లు ఈదుతూ, ఈ ఘనత సాధించిన రెండో మహిళగా నిలిచింది.

**కాటాలినా ఛానల్:** కాటాలినా ద్వీపం నుండి లాస్ ఏంజెలిస్ వరకు, గడ్డకట్టే 12 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను తట్టుకొని, 36 కిలోమీటర్లు 19 గంటల్లో పూర్తి చేసింది.

**లక్షద్వీప్ దీవులు:** లక్షద్వీప్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు కిల్టన్ ద్వీపం నుండి కద్మత్ ద్వీపానికి 18 గంటల్లో 48 కిలోమీటర్లు ఈదింది. వీటితో పాటు, కృష్ణా నది (1.5 కిలోమీటర్లు), హుగ్లీ నది (14 కిలోమీటర్లు), గంగా నది (13 కిలోమీటర్లు), భాగీరథి నది (81 కిలోమీటర్లు) ఈదిన ఘనత ఆమెది. ఉత్సాహానికి వయసు అడ్డంకి కాదని, లక్ష్యాన్ని ఏ వయసులోనైనా చేరుకోవచ్చనీ నిరూపించింది. లక్షలాది మందికి మార్గదర్శకురాలైంది.

# నిర్ణయాధికారంలో వీరు ఎక్కడ?



రాజకీయాల్లో మహిళల పాత్ర గురించి ఘనమైన ఉపన్యాసాలు, అద్భుతమైన వర్ణనలే తప్ప, వాస్తవంగా వారికి సరైన ప్రాతినిధ్యం లభిస్తున్న దాఖలాలు లేవు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశమైన భారత్‌లో ఈ పరిస్థితి అనాదిగా కొనసాగుతున్నది. అయితే, మహిళలకు రాజకీయాలు అవసరం లేదేమోగానీ... రాజకీయాలకు మాత్రం మహిళల అవసరం ఎంతైనా ఉంది. నిజానికి, మహిళలకు ఓటు హక్కు కల్పించిన తొలి దేశాల్లో భారత్ ఒకటి. దేవి పాసి, దాక్షాయణి వేలాయుధన్ వంటి మహిళలు తమ ధైర్యం, నాయకత్వ లక్షణాలతో దేశ సామాజిక, రాజకీయ ముఖచిత్రాన్ని మార్చగలిగారు. రాణి రుద్రమ దేవి, ఝాన్సీ లక్ష్మీ బాయి లేదా ఇందిరా గాంధీ... ఇలా అతి కొద్ది మంది పేర్లు మాత్రమే భారత రాజకీయాల్లో తరచు వినిపిస్తుంటాయి. దాదాపుగా అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు మహిళల పాత్రను ఎంతగా పరిమితం చేశాయన్నది చెప్పకనే చెప్తుంటాయి. రాజకీయాల్లో మహిళల పాత్రను మెరుగుపరచడానికి 'నారీ శక్తి వందన్ అధినియం' బిల్లుకు ఆమోద ముద్ర పడినప్పటికీ, అది అమల్లోకి రావడానికి రెండుమూడు సంవత్సరాలు పడుతుంది. ఒకవేళ ఈ మహిళా రిజర్వేషన్ చట్టం పూర్తి స్థాయిలో అమలైనప్పటికీ, భార్య లేదా కుటుంబంలోని ఇతర మహిళలను అడ్డం పెట్టుకొని, పురుషులే అధికారం చెలాయించే ప్రమాదం లేకపోలేదు. వార్డు స్థాయి నుంచి లోక్‌సభ వరకు, మహిళలకు రిజర్వ్ చేసిన అనేక స్థానాల్లో వాస్తవాధికారాన్ని ఎవరు చెలాయిస్తున్నారన్నది అందరికీ తెలిసిన చేదు నిజం. 'బేటీ బచావో.. బేటీ పడావో', 'జన్ ధన్ యోజన' వంటి పథకాలు మహిళల అభ్యున్నతిని ఉద్దేశించి చేసినవేగానీ, కేంద్రంలోని బిజెపి వీటిని రాజకీయ ప్రచారం కోసం మాత్రమే ఉపయోగించుకుంటున్నది. మహిళల సంక్షేమం, అభివృద్ధి పట్ల బిజెపికి చిత్తశుద్ధి లేదని అనేక సందర్భాల్లో రుజువైంది. కొద్ది మంది మహిళలు రాజకీయ మూస పద్ధతులను బద్దలు కొట్టి, పార్టీ శ్రేణులకు అతీతంగా మహిళలు, ఉత్సవ పాత్రల నుండి వాస్తవ నిర్ణయాధికారులుగా మారారు. సమగ్ర ప్రజాస్వామ్యానికి ఉదాహరణగా నిలిచారు. అయితే, వీరి సంఖ్య చాలా తక్కువ. వాస్తవానికి మహిళల ప్రమేయం రాజకీయాల్లో భిన్న కోణాలను, దృక్పథాలను, ఆలోచనా సరళులను ఆవిష్కరిస్తుంది. అన్యాయానికి, నిర్లక్ష్యానికి గురైన వర్గాల స్వరాలకు మహిళలు ప్రతినిధులవుతారు. మహిళలు సహజంగానే అట్టడుగు వర్గాలను ప్రభావితం చేసే సమస్యలను ప్రాధాన్యం ఇస్తారు. అందరికీ సమానమైన న్యాయం జరగడానికి కృషి చేస్తారు. ఆరోగ్య సంరక్షణ, విద్య, ఆర్థిక భద్రత వంటి అంశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. పాలనలో స్థానిక సంఘాల వాస్తవ అవసరాలు ప్రతిబింబించేలా చూస్తారు. మహిళా ప్రాతినిధ్యం పెరిగితే, శతాబ్దాలుగా కొనసాగుతున్న పితృస్వామ్య నిబంధనలకు కళ్లెం పడుతుంది. పురుషాధిక్య సమాజ రూపురేఖలు క్రమంగా మారుతాయి. సామాజిక దృక్పథాలను పునర్నిర్మించడం, భవిష్యత్ తరాల మహిళలను నాయకత్వం వైపు నడిపించడం, వారిలో స్ఫూర్తి నింపడం వంటి మార్పులను చూడవచ్చు. మహిళల నేతృత్వంలోని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, మెరుగైన విద్యా ఫలితాలు, తక్కువ ప్రాజెక్టు జాప్యాలు సంభవమని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. లోక్‌సభలో మహిళల ప్రాతినిధ్యం 1952లో 4.4 శాతం నుండి 2019 నాటికి 14.4 శాతానికి పెరిగింది . 2024 ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 74 మంది మహిళా ఎంపిలు ఉన్నారు. వీరిలో చాలా మంది తొలిసారి లోక్‌సభలో అడుగుపెట్టారు. అయితే, రాష్ట్ర స్థాయిలో మహిళల ప్రాతినిధ్యం తక్కువగానే ఉంది, ఛత్తీస్‌గఢ్ (14.4 శాతం), పశ్చిమ బెంగాల్ (13.7 శాతం) వంటి రాష్ట్రాల్లోని అసెంబ్లీలలో మహిళల సంఖ్య కొంత మెరుగ్గా ఉంది. అయితే, ఇప్పటికీ ఆదర్శ స్థాయి కంటే తక్కువే. కాగా, రువాండా (61.3 శాతం), స్వీడన్ (47.3 శాతం) తో పోల్చితే భారతదేశ మహిళా పార్లమెంటరీ ప్రాతినిధ్యం తక్కువ. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 మహిళల సమాన హక్కులను ధృవీకరిస్తూ సెక్స్ ఆధారంగా వివక్షను నిషేధిస్తుంది. ఆర్టికల్ 243 'డి' పంచాయతీరాజ్ సంస్థల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించింది. ఆర్టికల్ 326 మహిళలతో సహా పెద్దలందరికీ ఓటు హక్కును హామీ ఇస్తుంది. నారీ శక్తి వందన్ అధినియం (2023) లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తుంది. 73వ , 74వ రాజ్యాంగ సవరణలు గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను తప్పనిసరి చేశాయి, కొన్ని రాష్ట్రాలు దానిని 50 శాతానికి పెంచాయి. ఏదిఏమైనా మన దేశంలో మహిళలు రాజకీయంగా ఎదగడానికి ఎన్నో సమస్యలు, సవాళ్లు ఎదుర్కోక తప్పడం లేదు. పితృస్వామ్య సామాజిక నిబంధనలు వారి ఎదుగుదలకు సంకెళ్లు వేస్తున్నాయి. వేళ్లూనుకున్న కుల, మత సంప్రదాయాలు మహిళల ఆశయాలను పరిమితం చేస్తున్నాయి. రాజకీయ కెరీర్ల కంటే గృహ బాధ్యతలకు ప్రాధాన్యం ఇచ్చేలా ఒత్తిడి తెస్తున్నాయి. దీనికితోడు రాజకీయాల్లోకి ప్రవేశించి, ఎన్నికల్లో పోటీ చేయాలంటే భారీ మొత్తాల్లో ఖర్చవుతున్నది. ఆర్థిక అడ్డంకులు చాలా మంది మహిళలు రాజకీయాల్లోకి ప్రవేశించడం కష్టతరం చేస్తున్నాయి. పురుష ఆధిపత్య రాజకీయ పార్టీలు తరచుగా పక్షపాతాన్ని ప్రదర్శిస్తాయి. మహిళలకు అవకాశాలను పరిమితం చేస్తున్నాయి. 'ప్రాక్సీ పాలన' గురించి ఎంత చెప్పినా తక్కువే. పేరుకు మాత్రమే మహిళలు ప్రజాప్రతినిధులుగా ఉంటుండగా, పురుషులే పెత్తనం చేస్తున్న వైనం తెలియందికాదు. రువాండాలోని ప్రతి రాజకీయ పార్టీ జాబితాలోని ప్రతి మూడవ అభ్యర్థి స్త్రీగా ఉండాలి. దీని ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మహిళా పార్లమెంటరీ ప్రాతినిధ్యం ఉంది. కమిటీలలో సమతుల్య లింగ ప్రాతినిధ్యాన్ని చిలీ దేశం నిర్ధారిస్తున్నది. సమానమైన నిర్ణయం తీసుకోవడాన్ని ప్రోత్సహిస్తున్నది. మహిళలకు రాజకీయ ప్రాధాన్యత దక్కాలంటే, మిగతా దేశాలు కూడా అలాంటి విధానాలను అవలంభించాలి. మహిళల రాజకీయ సాధికారతను మొదటి ప్రాధాన్యతగా బలోపేతం చేయాలి. ఆర్థిక, సామాజిక సమస్యలను పరిష్కరించడం ద్వారా రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యానికి మరింత సమానమైన రాజకీయ దృశ్యాన్ని ఆవిష్కరించవచ్చు. స్థానిక ఎన్నికల నుండి జాతీయ ఎన్నికల వరకు అన్ని స్థాయిల పాలనలో మహిళలను అన్ని రాజకీయ పార్టీలు ప్రోత్సహించాలి. కమ్యూనిటీ ఆధారిత సంస్థలు, స్వయంసహాయ సమూహాల ద్వారా స్థానిక పాలనలో మహిళా భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం భవిష్యత్తులో మహిళా రాజకీయ నేతల పెరుగదలకు సహరిస్తుంది. మహిళల నేతృత్వంలోని చొరవలకు మద్దతు ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. సుస్థిరత, సాంఘిక సంక్షేమం వంటి రంగాలలో నైపుణ్యం నిర్మాణం, కమ్యూనిటీ జ్ఞానభాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, మహిళల నేతృత్వంలోని ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వడం పరివర్తనాత్మక మార్పులకు పునాదులు పడాలి. అప్పుడే రాజకీయాల్లో మహిళలు కీలక పాత్ర పోషించగలుగుతారు. సమాజాన్ని, దేశాన్ని సరైన దిశలో నడిపించగలుగుతారు.

# కరాటే కిడ్

పశ్చిమ బెంగాల్‌లోని రాణిగంజ్‌లో ఇటీవల జరిగిన జాతీయ ఫుల్ కాంట్రాక్ట్ కరాటే చాంపియన్‌షిప్ మహిళల టైటిల్‌ను 16 ఏళ్ల రిషికా బెనర్జీ కైవసం చేసుకొని, సరికొత్త చరిత్ర సృష్టించింది. 28 సంవత్సరాల ఈ టోర్నమెంట్ చరిత్రలో, చాంపియన్‌షిప్‌ను గెల్చుకున్న పిన్న వయస్కురాలిగా ఆమె పేరు రికార్డు పుస్తకాల్లో చేరింది. తండ్రి మయూఖ్ బెనర్జీ నుంచి కరాటేలో ప్రాథమిక శిక్షణ పొందిన ఆమె, అతి చిన్న వయసులోనే జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే స్థాయికి ఎదిగింది. టైటిల్ సాధించిన అనంతరం మాట్లాడుతూ, 'ఇది నాకు మాత్రమే పరిమితమైన విజయం కాదు. గొప్పగా ఆలోచించుకొని, ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి శ్రమిస్తున్న ప్రతి ఒక్కరిది' అంటూ, ఎంతో మందికి స్ఫూర్తిదాయకమైన సందేశాన్నిచ్చింది.






# ముగ్దూం మొయినోద్దీన్‌కు నివాళి

**ప్రజాపక్షం / జనగామ ప్రతినిధి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, సిపిఐ నాయకులు ముగ్దూం మొయినోద్దీన్ 117వ జయంతి సందర్భంగా ఆయనకు సిపిఐ జనగామ జిల్లా పార్టీ ఘనంగా నివాళ్లు అర్పించింది. మంగళవారం కామాక్షి పంక్షన్‌హాల్‌లో జరిగిన శత వార్షికోత్సవ సభలో ముగ్దూం మొయినోద్దీన్ చిత్ర పటానికి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావులు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా చాడా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన పోరాటంలో ఎనలేని పాత్ర పోషించిన మహానాయకుడు ముగ్దూం మొయినోద్దీ న్ అన్నారు. 4వేల మంది చంపబడినా వెనక్కి తగ్గకుండా 10లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేయించారని కొనియాడారు. వా రి ఆశక సాధన కోసం ప్రతి కమ్యూనిస్టు కార్యకర్తల కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎంఎల్‌ఏ సిహెచ్ రాజారెడ్డి, సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి చొప్పరి సోమయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

- ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేసి కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్ వేస్తున్న పాలకులపై ఉద్యమించాలి
- ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర




**ప్రజాపక్షం/వలిగొండ :** యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనవని, ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేసి కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్ వేస్తున్న పాలకులపై ఉద్యమించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. ఎఐవైఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం వలిగొండ మండల కేంద్రంలో నిర్వహించా రు. ఈ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో హామీలు ఇవ్వడం ఆ తరువాత , హామీల అమలును మర్చిపోవడం నీచ స్వార్థ రాజకీయాలకు తార్కాణమని వారు అన్నారు. ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి కల్పన కోసం నిర్దిష్టమైన చర్య లు ప్రతిపాదించలేదని, విద్య, వైద్యం, ఉద్యోగకల్పన రంగంలో ప్రతిపాదనలన్నీ డొల్లగానే ఉన్నాయని, ఉ ద్యోగ కల్పనా రంగం ఉద్యోగాలు లేని రంగంగా మారిందని వాపోయారు. మోదీ ప్రభుత్వ తొలి పదేళ్లకాలంలో ఉద్యోగాల కల్పనే లేదన్నారు. మోదీ ప్రభుత్వకాలంలో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఆర్థిక మం త్రి నానాతంటాలు పడ్డారని ఆరోపించారు. సమ్మిళిత అభివృద్ధి, యువత సాధికారత, ఆర్థిక రంగ వృద్ధి, పచ్చదనం వృద్ధి అవకాశాలను అపారంగా వినియోగించుకోవడం, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడులు లాంటివి ప్రతిపాదించారన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్ర భుత్వం ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని వా రు డిమాండ్ చేశారు. సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మాట్లాడుతూ యువత నిరంతరం సమాజంలోని అంతరాలపై పోరాడాలని, శాస్త్రీయ భావజాలం వైపు ఆలోచనలు చేసేలా యువతను చైతన్యం చేయాలని వారు పిలుపునిచ్చారు. అదే విధంగా నేడు స్వార్థ పూరిత రాజకీయాలను భూస్థాపితం చే సేందుకు యువత రాజకీయాలకు ఆకర్షితులు కావాలని, దేశాన్ని అన్ని రంగా ల్లో అభివృద్ధి పర్చేలా మంచివైపు చూడాలని అందుకు సమసమా జ స్థాపన కోసం పాటుపడుతున్న వామపక్ష రాజకీయ పార్టీలకు రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సలిగంజి వీర స్వామి, ఎఐవైఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యద ర్శి పేరబోయిన మహేందర్, జిల్లా సహాయ కార్యదర్శి ఎండి.నయీమ్, సుద్దాల సాయి కుమార్, మొగుళ్ళ శేఖర్ రెడ్డి, తోటకూర శేఖర్, బత్తిని నరేష్, మెట్టు లక్ష్మీ నారాయణ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బడ్జెట్‌లో విద్యార్థుల హామీల అమలుకు నిధులు కేటాయించాలి

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో కాంగ్రెస్ పార్టీ విద్యార్థులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలైన ఎలక్ట్రిక్ స్కూటీలు, ల్యాప్‌టాప్‌లకు, రూ.5లక్షల భరోసా కార్డు పథకాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలలో విద్య భరోసాకార్డు, విద్యార్థులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు, ప్రతి విద్యార్థి ఇంటింటికి ఉచిత ఇంటర్నెట్ వంటి ఎన్నికల హామీల అమలుకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. విద్యారంగానికి 15 శాతం పైన నిధులు బడ్జెట్‌లో కేటాయించాలన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదల లేక విద్యార్థులతో పాటు ప్రైవేట్ యాజమాన్యాలు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నాయని, ప్రభుత్వం వెంటనే పెండింగ్ ఫీజు బకాయిలను ఏకమొత్తంలో ఒకేసారి విడుదల చేయాలన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు రాష్ట్రంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలకడం వల్లే ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు వారు విద్యా వ్యా పారం చేస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి విద్యాశాఖ తన వద్ద ఉన్న నేపథ్యం లో విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేయాలని డిమాండ్ చేశా రు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు తదితరులున్నారు.

## జాతీయ నూతన విద్యా విధానం

# దేశ విద్యా వ్యవస్థకు గొడ్డలి పెట్టు

ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈనెల 9, 10 తేదీలలో హైదరాబాద్‌లో జరిగే ఎఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాల కరపత్రాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు భవిష్యత్ కార్యాచరణ పలు సమస్యలపై ఈ సమావేశంలో చర్చలు జరుగుతాయని కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువస్తున్న జాతీయ నూతన విద్యా విధానం, దేశ విద్యా వ్యవస్థకు గొడ్డలి పెట్టు అని దీనిపై విద్యార్థులు సంఘటితమై పెద్ద ఎత్తున ఉద్యమించాలని ఆయన అన్నారు. విద్య కేంద్రీకరణ, విద్య వ్యాపా రికరణ, విద్య కార్పొరేటీకరణ, విద్య కాషాయికరణతో పాటు యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతీస్తూ వీటిని మూడు నాలుగు రకాలుగా విభజించి కుట్ర పడుతున్నారని, ఇందుకు ఇటీవల విడుదల చేసిన యుజిసి ప్రతిపాదనలే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. అంతే కాకుండా కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో ఆర్‌ఎస్ఎస్ నేపథ్యం ఉన్నవారినే నియమిస్తున్నారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 10% జిడిపిలో ఆరు శాతం నిధులు కేటాయించకుండా ఎలా ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షిస్తారని ప్రశ్నించారు. నూతన జాతీయ విద్యా విధానంలో ఎక్కడ కూడా ఉచిత విద్య అనే పదాన్ని కూడా పొందపరచకపోవడంతో పేదవారికి ఉచిత విద్య లేనట్టేనని తేటతెల్లాం అయిపోయిందన్నారు. పాఠ్యపుస్తకాలలో ప్రజాస్వామ్యం, సెక్యులర్, పదాలను డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించి దాని స్థానంలో ఆర్ఎస్ఎస్ వీర సవర్కర్, మొదలగు వారి జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడంలో అంతర్యం ఏమిటో మేధావులు విద్యావంతులు అర్థం చేసుకోవాలని, దేశ చరిత్రను తెలంగాణ సాయుధ పోరాట వాస్తవాలను వక్రీకరించడంలో బిజెపి ముందుందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్నకొండ సాయి ఆజాద్, జిల్లా కోశాధికారి ఎల్కపల్లి సురేష్, నాయకులు రవికుమార్,తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి స్థలాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ డిమాండ్




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** గత ప్రభుత్వ హయాంలో మిగిలిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులైన వారికి కేటాయించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలనరసింహ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇంటి స్థలం లేని నిరుపేదలకు ప్రభుత్వమే ఇంటి జాగాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సిపిఐ కార్యాలయం నుండి మహబూబ్‌నగర్ అర్బన్ తాహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం తాహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బాలనరసింహ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో పేదలందరికి లబ్ధి చేకూరాలంటే పట్టణ ప్రాంతాల్లో వేలాదిమంది ప్రజలకు ఇంటి స్థలాలే లేవని గుర్తు చేశారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరదని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని వాటిని గుర్తించి పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలన్నారు. గత బిఆర్ఎస్ పదేండ్ల పాలనలో పేదలకు కట్టించిన డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు పారదర్శకత లోపించి అనేకవకతవకలు జరిగాయని దీని ఫలితంగా నిజమైన లబ్ధిదారులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. 523 సర్వే నెంబర్‌లో గత ప్రభుత్వాలు పేదలకు ఇచ్చిన ఇంటి పట్టా జాగాలను గత ప్రభుత్వం బలవంతంగా తీసుకుందని ఆ పట్టాదారులకు డబుల్‌బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చిన ఇప్పటికీ వందలాది మంది ఇళ్లస్థలాలు కోల్పోయిన లబ్ధిదారులు నిరాశ్రయులుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. కనుక మిగిలిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళనలను తీవ్రతరం చేస్తామన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తాహసీల్దార్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ , సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్, డి.రాము, రైతు సంఘం నాయకులు చాంద్ పాషా, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి కోటకదిరి నరసింహ, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి కె.పద్మావతి, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు, సిపిఐ నాయకులు లక్ష్మణ్, మహేశ్, గుడుబాషా, రాములు, ఆనంద్, శ్రావన్ కుమార్, శివ, ఇందిరా, పద్మ, రాజేశ్వరి, లక్ష్మి కళ, మంజుల, సంధ్య, సత్యమ్మ, మాధవి, సరోజనమ్మ, కవిత, అరుణ, శ్వేత, తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వం సంపూర్ణ రుణమాఫీ

సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** ప్రభుత్వం సంపూర్ణ రుణమాఫీ చేయాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సమావేశం వరంగల్ జిల్లా సమితి తమ్మెర భవన్ శివనగర్‌లో వరంగల్ జిల్లా సమితి అధ్యక్షుడిగా బొడ్డుపల్లి సాయిలు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా సిపిఐ పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి వీరగోని శంకరయ్యలు మాట్లాడుతూ తెలంగాణ లోపల ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా సెంట్రల్ గవర్నమెంట్ నుంచి సంపూర్ణ రుణమాఫీకి పూనుకోవాలని, రైతు భరోసా రూ. 7500 ఇస్తామని మాట తప్పి కేవలం రూ.6000 మాత్రమే ఇస్తున్నారన్నారు. ఇప్పటికైనా రూ. 7500 తప్పని సరిగా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం లోపల అన్ని సంఘాలను కలుపుకొని పార్లమెంటు లోపల ఎంఎస్‌పి చట్టం చేయాలని, వరంగల్ రైతులు పండించిన మిర్చి పంటకు ధర లేక అప్పుల పాలై ఆత్మహత్య చేసుకునే పరిస్థితిలో ఉన్నారన్నారు. ఎనుమాముల మార్కెట్లో రైతులు పండించిన మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మడ్డి రాజారాం, జిల్లా కార్యదర్శి చుక్క మొగిలి, ఆరెల్లి ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏ పాషా, మహిళా జిల్లా విభాగం నాయకురాలు చుక్క శోభ, జిల్లా ఉపాధ్యక్షురాలు హసీనా, మహిళా విభాగం నాయకురాలు హేమలత, జిల్లా నాయకుడు రత్నాకర్ రెడి, కేవి జోసఫ్, కౌలు రైతుల అధ్యక్షులు బాగతి బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



**ప్రజాపక్షం/ నాంపల్లి:** ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని మహమ్మద్ గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకా రం మామదా పురం గ్రామానికి చెందిన బొల్లి వెంకటయ్య (40) ఆర్థిక ఇబ్బందులతో గత నెల 20వ తేదీన తన సొంత భూమిలో పురుగమ్మ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు నల్గొండలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాటి నుంచి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న వెంకటయ్య ఆరోగ్యం క్షీనించి సోమవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమా ర్టం నిర్వహించనున్నట్లు తెలిపారు. మృతునికి భార్య ముగ్గురు కూతుర్లు ఉన్నారు.

## ఇండియన్ ఒలంపిక్స్‌కి ఎంపిక



**ప్రజాపక్షం/నందికొండ:** ఉత్తరా ఖండ్ లో జరిగే ఇండియన్ ఒలం పిక్స్ కు సాగర్ కు చెందిన సంయు త్ నాయుడు, ధనుష్ వెంకట్ నాయక్ అనే క్రీడాకారులు ఎంపికైనట్లు ఉమ్మడి నల్గొండ జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్య దర్శి కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండువారాలుగా మహబూబ్ నగర్ ఇండోర్ స్టేడియం లో జరిగిన నెట్ బాల్ క్రీడాకారుల క్యాంపులో వీరు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి ఇండియన్ ఒలంపిక్స్ కి ఎంపికైనట్లుగా వారన్నారు.ఫిబ్రవరి 6 నుండి15 వరకు ఉత్తరాఖండ్ లోజరిగే ఇండియన్ ఒలంపిక్స్‌కు వీరు ప్రాతినిధ్యం వహించ నున్నారని వారన్నారు.

## పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న మిషన్ భగీరథ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి మంగళవారం కార్మికులతో కలిసి పెండ్లీపాకుల ప్లాంట్ వద్ద మిషన్ భగీరథ ఎస్ఈ కరుణాకర్‌రెడ్డి, డిఈ హైమద్, క్వాలిటి కంట్రోల్ ఆఫీసర్ రామచంద్రులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ జీతాలు రాక కార్మికులు అప్పులు తెచ్చుకొని కుటుంబాలను గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ కూడా అమలు చేయడం లేదని అన్నారు. వేతనాలు చెల్లించనట్లయితే ఫిబ్రవరి 10వ తేది నుండి కార్మికులు విధులను బంద్ చేసి సమ్మెలో పాల్గొంటారని సమ్మె నోటీస్ కూడా ఇచ్చారు. కార్మికులు నరేష్, జగపతిరావు, కృష్ణ, రవి తదితరులు ఉన్నారు.

## పతకాలు సాధించిన జిల్లా పోలీస్ సిబ్బందికి ఎస్‌పి అభినందన



**ప్రజాపక్షం /నల్లగొండ** : కరీంనగర్‌లో జరిగిన 3వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్2025 జనవరి 28 నుండి ఫిబ్రవరి 1 వరకు జరిగిన ఈ క్రీడల్లో నల్లగొండ జిల్లా పోలీస్ క్రీడాకారులు వ్యక్తి గత పోటీలు 800 మీటర్ల మెన్ అండ్ ఉమెన్ 2 బంగారు పతకాలు, స్విమ్మింగ్ పోటీల్లో 2 బంగారు పతకాలు,2 సిల్వర్ పతకాలు,1500 మీటర్లు ఉమెన్ పోటీల్లో 1 సిల్వర్, బ్యాట్మెటెన్ డబల్స్ లో సిల్వర్, వాలీబాల్,కబడ్డిలో సిల్వర్ , హాకీలో కాంస్యం పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించి జిల్లా, జోనల్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించినందుకు క్రీడాకారులకు. జిల్లా ఎస్‌సి శరత్ చంద్ర పవార్ అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే స్ఫూర్తిని కనబరుస్తూ ప్రతి రోజూ సాధన చేస్తూ ముందుకు సాగుతూ రాబోయే రోజుల్లో జాతీయస్థాయిలో రాణించి జిల్లా కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్‌పి శ్రీనివాస్, ఆర్ఐలు హరి బాబు, శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వేదమంత్రోచ్ఛారణతో గణపతి పూజ



**ప్రజాపక్షం /నార్కట్‌పల్లి** : తెలంగాణలో రెండవ శ్రీశైలంగా ప్రసిద్ధక్షేత్రంగా పేరొందిన చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల ప్రారంభంతో చెర్వుగట్టుకు ఉత్సవ శోభ సంతరించుకుంది. నల్లగొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ చారి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై బ్రహ్మోత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు.అతిథులకు ఆలయ సంప్రదాయాల ప్రకారంఆలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ,ఆలయ అసిస్టెంట్ కమిషనర్ భాస్కర్ , ఈవో నవీన్ కుమార్ లు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం దేవాలయ మహా మండపంలో యాగ్నీకులు సుబ్రహ్మణ్య దీక్షితావదాని మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవాల కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మొదట యాగ ప్రదక్షణ, గణపతి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గర్భగుడిలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, యువజన నాయకుడు వద్దే భూపాల్ రెడ్డి, శశిధర్ రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ పున్నము యాదగిరి, గ్రామ మాజీ సర్పంచ్ నేతకాని కృష్ణ, మాజీ డైరెక్టర్ రేగట్టే నరసింహారెడ్డి, వారాల రమేష్, కిట్టు, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** జిల్లా కేంద్రంలోని 1వ వార్డులో నేడు(బుధవారం) విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఆర్ సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డులోని శివాలయం రోడ్డు, హనుమాన్ గుడి, రాజీవ్ నగర్ బతుకమ్మ సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు.

## గ్రామీణ మహిళలు జాతీయస్థాయి వ్యాపారవేత్తలుగా ఎదగాలి

### మార్కెటింగ్ కోసం అవసరమైన మద్దతు
### మినీ సరస్ ఫెయిర్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ** : గ్రామీణ స్వయం సహాయ సంఘాల మహిళలు జాతీయ స్థాయి వ్యాపార వెత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు. మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల నుంచి అవసరమైన మద్దతు కల్పిస్తామని ఆమె హామీ ఇచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామీణ స్వయం సహాయ మహిళా సంఘాలు తయారు చేసిన చేనేత, హస్త కళల, ఆహార ఉత్పత్తుల ప్రదర్శన మిని సరస్ ఫయిర్ 2025 ఆమె ప్రారంభించారు. అనంతరం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో తొలిసారి ఉమ్మడి నల్లగొండ జిల్లా మహిళా సంఘాల కోసం సరస్ ఏర్పాటు చేయడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తుల్ని సోషల్ మీడియా, అమెజాన్ లాంటి ఆన్ లైన్ మార్కెట్ లో కూడా మార్కెటింగ్ చేయాలని సూచించారు. చిన్న స్థాయిలో ప్రారంభమైన అనేక సంస్థలు ఆ తర్వాత నాణ్యత, మార్కెటింగ్ తో పెద్ద కార్పొరేట్ కంపెనీలుగా ఎదిగాయని జిల్లా కలెక్టర్ ఉదాహరణలతో తెలియజేశారు. కార్యక్రమం లో పేదరిక నిర్మూలన సంస్థ డైరెక్టర్ పిడబ్ల్యూ జాన్సన్ మాట్లాడుతూ తెలంగాణలో నల్గొండ జిల్లా గ్రామీణ మహిళా సంఘాలు అభివృద్ధిలో ముందు ఉన్నాయని కొనియాడారు. రాష్ట్ర స్థాయిలో మాత్రమే నిర్వహించే సరస్ ప్రదర్శనను తొలిసారి నల్లగొండలో ఏర్పాటు చేయడం పట్ల ఆయన జిల్లా అధికారులను అభినందించారు. గ్రామీణ మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన ఈ నెల 8 వ తేదీ( శనివారం) వరకు కొనసాగుతుందని తెలిపారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సహా య సంచాలకులు జి. కోటేశ్వర రావు, జిల్లా అటవీ అధికారి రాజశేఖర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణ వేణి, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎన్. పద్మ , పరిశ్రమల శాఖ జీఎం వి.కోటేశ్వర రావు, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## కూచిపూడి శాస్త్రీయ నృత్యంలో నిఖిత భేష్



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** కూచిపూడి శాస్త్రీయ నృత్యం తన అద్భుతమైన అభినయం ప్రతిభతో శ్రీ మార్కండేశ్వర స్వామి 48వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భక్తులందరినీ మెస్మరైజ్ చేసింది కుమారి బడుగు నిఖిత కళాకారిణి. బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం సాయంత్రం బద్రావతి భావనా ఋషి కళ్యాణం సందర్భంగా దేవతామూర్తుల పరిణయానికి ముందు నిఖిత తన నృత్యంతో అందర్నీ అలరించి కళ్యాణానికి మరింత శోభను చేకూర్చి అందరిచే అభినందనలు అందుకున్నారు. అనంతరం భద్రావతి భావన ఋషి కళ్యాణ క్రతువును అంగరంగ వైభవంగా వేద మంత్రోచ్ఛారణలతో పండితులు జరిపించారు. ఈ సందర్భంగా కళాకారుని తల్లిదండ్రులు హెడ్ కానిస్టేబుల్ బడుగు శివ శంకర్ వరలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు వేదికలపై శాస్త్రీయ నృత్యంలో అత్యుత్తమ ప్రదర్శన ప్రతిభను చూసి మంచి ప్రశంసలతో పాటు బహుమతులు జ్ఞాపికలను అందుకుంటున్నట్లు తెలిపారు.

## ఆర్టిజన్స్‌ను విద్యుత్ సంస్థలో విలీనం చేయాలి

### నల్లగొండ బస్సు యాత్ర బహిరంగ సభలో పల్లా దేవేందర్‌రెడ్డి




**ప్రజాపక్షం /నల్లగొండ** : రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది విద్యుత్ సంస్థ కార్మికులు రోడ్లమీద ఆందోళన చేసిన ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు తక్షణమే ఆర్టిజన్లను చర్చలు పిలిచి సమస్యకు పరిష్కారం ఆలోచించాలని వారందరిని విద్యుత్ సంస్థలో విలీనం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆర్టిజన్స్ సమస్యలను పరిష్కారం చేయాలని టివిసి జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బస్సు యాత్రలో భాగంగా మంగళవారం నల్లగొండ విద్యుత్ కార్యాలయం వద్ద జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఆర్టిజన్ విలీనం చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని అన్నారు. సబ్ స్టేషన్ లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని దానివల్ల పని భారం పెరిగిపోయి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యుత్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్స్ ను తక్షణమే కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలో గత 20 సంవత్సరాలుగా ఎవరికి ఆటంకం కలిగించకుండా విధులు నిర్వహిస్తున్నారని అర్హతను బట్టి కన్వర్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా ఉద్యోగులుగా గుర్తించిందని కానీ బ్రిటిష్ కాలం నాటి స్టాండింగ్ ఆర్డర్స్ రూల్స్‌ను అమలు చేస్తూ రెగ్యులర్ ఉద్యోగులకు, ఆర్టిజన్స్ కు వ్యత్యాసం కల్పించేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టిజన్ లను విద్యార్హతలను బట్టి జూనియర్ లైన్ మెన్‌లుగా డిప్లొమా వారికి సబ్ ఇంజనీర్లుగా ఆఫీస్ సబార్డినేటర్ లుగా జూనియర్ అసిస్టెంట్‌గా ప్రభుత్వం గుర్తించాలని కోరారు. చాలీచాలని వేతనాలతో జీవనాన్ని గడుపుతున్నారు కాబట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రభుత్వం ప్రభుత్వ పరంగా అన్ని సౌకర్యాలు కల్పించేలా కన్వర్షన్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర జేఏసీ నాయకులు జిల్లా నాయకులు ఏఐటియుసి డివిజన్ కార్యదర్శి విశ్వనాదుల లెనిన్, తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో నియమ నిబంధనలు

### రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి నోడల్ ఆఫీసర్లకు ఆదేశం

**ప్రజాపక్షం/యాదాద్రి** : వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నియమ నిబంధనలు పాటిస్తూ విధులు నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి నోడల్ ఆఫీసర్లకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాలులో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నియమించిన నోడల్ అధికారులు తమ విధులు నియమ నిబంధనలను పాటిస్తూ రోజువారి రిపోర్టులు సమయంలో పంపాలని, జిల్లాలో మొత్తం 985 ఓటర్లు ఉన్నందున వారు సకాలంలో వచి ఓటు హక్కు వినియోగించుకునేలా తగిన ఏర్పాట్లు చేయాలని, పోలింగ్ కేంద్రాలకు అవసరమైన మెటీరియల్ ను సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేర్చాలని, 17 పోలింగ్ కేంద్రాలకు 6 రూట్ల ద్వారా 17 మండలాలకు బ్యాలెట్ బాక్సులు పంపే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. బ్యాలెట్ బాక్సులు పోలింగ్ కేంద్రాలకు పంపే ముందల పరిశీలన చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ లక్ష్మీ నారాయణ, భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, సంబంధిత నోడల్ అధికారులు, సూపరింటెండెంట్ లు రామారావు, శాంతి లాల్, డిటి సురేష్, ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

## బిసిలను తగ్గించి లెక్కల పత్రాలను ప్రభుత్వం బుట్టదాఖలు



**పజాపక్షం/సూర్యాపేట టౌన్:** కుల గణన లెక్కల్లో బిసిలను తగ్గించి తప్పుగా లెక్కలు చూపుతూ బిసిలను ప్రభుత్వం మోసం చేస్తుందని ఆరోపిస్తూ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని రైతుబజార్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు చల్లమల్ల నర్సింహ్మా మాట్లాడుతూ బిసిలను తగ్గించి లెక్కల పత్రాలను ప్రభుత్వం బుట్టదాఖలు చేసిందని ఆరోపించారు. బిసిల జనాభా తగ్గడం ఓసి జనాభా పెరగడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బిసిలపై చేసిన కుట్రతోనే లెక్కలను తప్పుగా చూపిందన్నారు. రాష్ట్రంలో 2014 లెక్కల ప్రకారం 52శాతం ఉంటే 2024లో 46శాతానికి ఏలా తగ్గుతారని ప్రశ్నించారు. ఓసిలు పెరిగినట్లుగా చెక్కలు చూపడం మోసపూరితమే అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిసి కులగణన చేపట్టి 42శాతం రిజర్వేషన్లు ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ఓట్లను దండుకునేందుకే ఇలా చేసిందన్నారు. బిసిలు రాష్ట్ర వ్యాప్తంగా యాత్రలు చేపట్టి హైకోర్టులో ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిన తరువాతనే కుల గణన చేసిందన్నారు. అయిన కాంగ్రెస్ డిఎస్‌పిలోనే బిసి వ్యతిరేకత ఉన్నట్లు మరోమారు ఈ లోపాలతో స్పష్టమైందన్నారు. ఇప్పటికైన లెక్కలు సరి చేసి బిసిలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు భూపతి నారాయణ గౌడ్, దండపల్లి శ్రీనివాస్, బత్తుల దశరథ, కోడి లింగయ్య యాదవ్, విజయకృష్ణ, బంటు నాగేందర్ పాల్గొన్నారు.

## 7న బుద్ధవనంలో త్రిపీటక పఠనోత్సవం



**ప్రజాపక్షం/నందికొండ:** ఫిబ్రవరి 7 శుక్రవారం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం వద్ద దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా మహాబోధి సొసైటీ సికింద్రాబాద్ అదేవిదంగా అంర్జాతీయ త్రిపిటక సంగాయన మండలి సంయుక్తంగా,త్రిపిటక పఠనం జరుగుతుందని బుద్ధవన నిర్వాహకులు తెలిపారు.బౌద్ధ ధార్మిక, సాంస్కృతిక, సాంప్రదాయాలను, పరిరక్షించి, కొనసాగించాలన్న ఉద్దేశంతో, 108 మంది బౌద్ధ భిక్షువులతో, నిర్వహించే ఈ పఠన కార్యక్రమానికి తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమం బుద్ధవనానికి సహకారాన్ని అందిస్తుందని అన్నారు . ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు కూడా భాగస్వాము బుద్ధవచనాన్ని వినే అరుదెన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమం గురించి మరిన్ని వివరాల కోసం చేతన్‌కుమార్, మహాబోధి విహార, 72070 72510 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించవచ్చని వారు తెలిపారు.

## బయో ఎంజైమ్ ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడలో నేచురల్ బయో ఎంజైమ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామంలో బోధి ధర్మ బయో ఎంజైమ్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్యాన్సర్ డే సందర్భంగా మిర్యాలగూడలో బయో ఎంజైమ్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డిలు పాల్గొని క్యాన్సర్ రోగులకు ఉచితంగా మందులు పంపిణి చేసి మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజలకు న్యాచురల్‌గా ఆయుర్వేద మందులతో క్యాన్సర్ జబ్బును తగ్గించే ప్రయత్నాన్ని అందరు అభినందించాలన్నారు. బోధిధర్మ ఆయుర్వేద పీఠం వైద్యుడు పండిట్ శ్రీనివాస్ క్యాన్సర్ రోగులకు నిరంతరం సేవ చేయడమే లక్ష్యంగా బయో ఎంజైమ్ ద్వారా ఉచితంగా మందులను పంపిణి చేస్తున్నామన్నారు. ఉపేందర్‌గుప్తా, దుర్గంపూడి నారాయణరెడ్డి, ధనావత్ చిట్టిబాబునాయక్, ఆంగోతు లలితహాతీరాంనాయక్, సజ్జల రవీందర్‌రెడ్డి, మదన్మోహన్, సుప్రియా, కొండా మాధవి, మునీర్, ఏడుకొండలు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.





## హుజూర్‌నగర్‌లో వాహనాలకు వేలం


**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన 36 వాహనాలకు మంగళవారం సూర్యాపేట జిల్లా ఎక్సైజ్ అధికారి ఆర్.లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్లోని ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం పాటను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మానాయక్ మాట్లాడుతూ ఆయా వాహనాల వేలంపాట ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.2.51 లక్షలు కాగా, జిఎస్టితో కలుపుకుని 7.44 లక్షలు చలానా రూపంలో ప్రభుత్వానికి ఆదాయం రావడం జరిగిందని తెలిపారు. మొత్తం 309 శాతం ఆదాయ వృద్ధి రావడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగార్జున్ రెడ్డి, ఎస్ఐ దీప్తి సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ ఆమోదంపై హర్షం

**ప్రజాపక్షం/ఉండవెల్లి:** మొదట నుంచి ఎస్సీ వర్గంలోని మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఉద్దేశంతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఉద్యమాల ద్వారా మాదిగలకు న్యాయం జరిగేందుకు పోరాటం ఫలితమే సుప్రీంకోర్టు తీర్పు అనుసరించి తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వర్గీకరణ బిల్లును మంగళవారం అసెంబ్లీలో ఆమోదం తెలపడంతో ఎమ్మార్పీ నాయకులు హర్షం వ్యక్తపరుస్తున్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు 7న జరిగే బహిరంగ సభకు లక్ష గొంతులు వెయ్యి డప్పుల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్ వన్ గ్రూప్ టు గ్రూప్ త్రీ వర్గాలుగా విభజించడం న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆశభావాని వ్యక్తపరిచారు. గ్రామాల్లో సందడి ఏర్పడింది.

## విత్తన కంపెనీల యజమానులపై చర్యలు ఏవీ?

**గరిడే పల్లి మండలంలోని గడ్డిపల్లి గ్రామంలోని కొంతమంది విత్తన కంపెనీల యజమానులు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించగా నష్టపోయిన వారు కంపెనీల ఎదుట ఇటీవల ధర్నాకు దిగారు. రైతులు తమకు జరిగిన నష్టాన్ని అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో తమ గోడును మీడియా ముందు వెల్లబోసుకున్నారు. ఆయా మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు వచ్చాయి. కానీ అధికారులు నేటికీ ఆ విత్తన కంపెనీల యజమానులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.**

### విచారణ పేరుతో కాలయాపన
### అధికారుల తీరుపై అనుమానాలు




**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** గడ్డిపల్లి గ్రామంలో మొత్తం 10 విత్తన కంపెనీలు ఉండగా చరణ్ సీడ్స్, ఎంఎస్ వెంకటసాయి సీడ్స్ కంపెనీల్లో వరి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు వరి సాగు చేయగా 90 రోజుల్లో ఈనాల్సిన వరి పైరు నాటువేసిన 15రోజులకే ఈనడంతో ఆందోళనకు గురయ్యారు. వరి పైరును చేత పట్టుకొని విత్తనాల కంపెనీల యజమానుల వద్దకు పరుగు తీశారు. దీంతో వారు రైతులకు మాయమాటలు చెప్పి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు..., వారం పది రోజులు ఆగండి అంటూ సర్దిచెప్పి వెనక్కి పంపారు. అయినా వరి పైరులో ఏలాంటి మార్పు రాకపోవడంతో కంపెనీ యజమానులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో సంబంధిత వ్యవసాయ శాఖ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో సూర్యాపేట జిల్లాలోని మునగాల మండలం వెంకట్రాంపురం గ్రామానికి చెందిన రైతులతో పాటు పెన్‌పహాడ్ మండలంలోని అన్నారం, నేలమర్రి, పొట్లపాడు, పెన్‌పహాడ్, త్రిపురారం మండలంలోని కన్నెకల్లు, పాలకీడు మండలంలోని మీసపాటితండ, నల్లగొండ జిల్లాలోని తిప్పర్తి మండలంలోని మామిడాల, అడివిదేవులపల్లి మండలంలోని దూద్యతండాకు చెందిన రైతులు విత్తన కంపెనీల వద్ద ఆందోళనకు దిగారు. తమ గోడును మీడియా ముందు బోరున విలపిస్తూ చెప్పా రు. విత్తన కంపెనీల యజమానుల మోసాలకు తా ము బలి అయ్యామని వాపోయారు. ఇదే విష యం మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు ప్రచురితమయ్యాయి. విత్తన కంపెనీల యజమానులు రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టడంతో నష్టపోయిన విషయం మీడియాలో ప్రత్యేక కథనాలు రావడంతో సంబంధిత అధికారులు కాస్త చలనం వచ్చింది. రైతులకు నష్టం చేసిన కంపెనీలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. జనవరి 30న రైతులు ఆందోళన చేసినా అధికారులు ఈ విషయమై ఏటూ తేల్చలేదు. నేటికి ఆరు రోజులు దాటినా విచారణ చేస్తున్నామని చెబుతున్నారే తప్పా ఏమైందన్న విషయం మీడియాకు వెల్లడించడం లేదు. రాజకీయ ఒత్తిళ్ళకు తలొగ్గడంతో పాటు వారి నుండి కొంత మంది అధికారులకు పెద్ద మొత్తం ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతోనే విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్‌లు స్పందిస్తూ విచారణను వేగవంతం చేసి అన్నంపెట్టే రైతులను ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**జిల్లా వ్యవసాయ అధికారి వివరణ**

ఈ విషయమై జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డిని వివరణ కోరగా నకిలీ విత్తనాలు రైతులకు అంటగట్టిన కంపెనీలపై విచారణ చేస్తున్నామని చెప్పారు. బాధిత రైతుల పంట పొలాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఎడిఆర్ బ్రిడర్‌కు సమాచారం అందించామని వారి నుండి సర్టిఫికెట్ వచ్చిన తరువాత చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# క్యాన్సర్ వ్యాధి నియంత్రణపై పూర్తిస్థాయి దృష్టి సారించాం

రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధి నియంత్రణపై పూర్తిస్థాయి దృష్టి సారించామని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. క్యాన్సర్ వ్యాధిపై అవగాహన పెంపొందించడం, నివారణ, గుర్తింపు, ప్రారంభ దశలో చికిత్సను ప్రోత్సహించేందుకు ప్రతియేట ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో క్యాన్సర్ అవగాహన స్క్రీనింగ్ సెంటర్‌లు ఏర్పాటు, ఉచితంగా ఆధునిక చికిత్స ఏర్పాటు చేశామని ఈసందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. వరల్డ్ క్యాన్సర్ డిక్లరేషన్ లక్ష్యాలకు మద్దతుగా క్యాన్సర్‌తో అనారోగ్యం, మరణాలను గణనీయంగా తగ్గించటమే లక్ష్యంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ పనిచేస్తుందన్నారు.

## రక్షణతో ఉత్పత్తి సాధనకు చర్యలు



**ప్రజాపక్షం/కాసిపేట :** రక్షణతో ఉత్పత్తి సాధనలో ప్రతిభ కనబరిచిన కాసిపేట 2వ గని ఉద్యోగులకు గని మేనేజర్ జి.లక్ష్మి నారాయణ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మంగళవారం మొదటి షిఫ్ట్‌లో కాసిపేట 2వ గనిపై గని మేనేజర్ లక్ష్మి నారాయణ కార్మికులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. గత నెల 11000 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినందుకు కార్మికులకు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో కార్మికులు అందరూ కలిసి అంకితభావంతో పనిచేసి అధిక ఉత్పత్తి సాధించాలని కోరారు. ప్రతి ఒక్క ఉద్యోగి రక్షణ సూత్రాలు పాటిస్తూ విధులకు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటియుసి ఫిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, రక్షణ అధికారి, వెల్ఫేర్ ఆఫీసర్, ఇంజనీర్, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పరిరక్షించాలి




**ప్రజాపక్షం /కాగజ్ నగర్ రూరల్ :** ఇంటింటికి మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని కాగజ్ నగర్ మండలం బట్టుపల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. చెట్లతో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని, చెట్లే మనకు ప్రాణవాయువును ఇస్తాయని, మనం ఆరోగ్యంగా ఉండాలంటే మన పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, ప్లాస్టిక్ ఉపయోగాన్ని తగ్గించాలని, బట్ట సంచులనే వాడాలని, చెట్లను పెంచి భౌగోళిక వెచ్చదనాన్ని తగ్గించాలని, ప్రకృతిలో ప్రతి జీవి జీవించుటకు మన వంతుగా కృషి చేయాలని విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధా బాయి, బి.శాంతికుమార్, రావుఫ్, ఆనంద్ బాబు, నర్మద, నరేందర్ గౌడ్, సత్యనారాయణగౌడ్ తదితలు పాల్గొన్నారు.

## ఉత్పత్తి సాధనలో అగ్రగామిగా నిలపాలి



**ప్రజాపక్షం/రెబ్బెన:** రక్షణతో పనిచేసి ఉత్పత్తి సాధనలో బెల్లంపల్లి ఏరియాను అగ్రగామిగా నిలపాలని జనరల్ మేనేజర్ శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఏరియాలోని కైరిగూడ ఓపెన్ కాస్ట్ ఆవరణలో ప్రత్యేక ప్రోత్సాహక పథకంపై ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాకు నిర్దేశించుకున్న ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. జనవరి నెలలో అత్యధిక ట్రిప్పులు నడిపిన శావల్ డంపర్ ఆపరేటర్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి నరేందర్, ఇన్చార్జి ప్రాజెక్టు ఇంజనీర్ నరేష్, మేనేజర్ శంకర్, సేఫ్టీ ఆఫీసర్ నారాయణ, డివైపిఎం వేణుతోపాటు ఏఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

## పట్టణ అభివృద్ధికి కృషిచేశా : జుబేర్



**ప్రజాపక్షం/బాన్సువాడ :** బాన్సువాడ పట్టణంలోని మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్‌ను మంగళవారం వర్ని మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అ సందర్భంగా మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ మాట్లాడుతూ ప్రజల సహకారంలో బాన్సువాడ పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు తన పదవీకాలంలో పనిచేశానన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్ యాదవ్, ఉస్మాన్, శ్రీనివాస్, ఆనంద్ గౌడ్, సాయిలు, రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నపై పోలీసులకు ఫిర్యాదు



**ప్రజాపక్షం/గజ్వేల్ :** రెడ్డి సమాజంపై అసభ్యకరంగా మాట్లాడిన తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌పై మంగళవారం గౌరారం పోలీస్ స్టేషన్‌లో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర, జిల్లా బాధ్యులు వేలూరి కృష్ణారెడ్డి, మహిపాల్ రెడ్డి, వేలూరి వెంకట్ రెడ్డి, ఇర్రి రంగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, హనుమంత రెడ్డి, చంద్రారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సమాజంపై విషం చిమ్ముతున్న తీన్మార్ మల్లన్న గత చరిత్రను గుర్తుకు తెచ్చుకోవాలని, పదవి, డబ్బు కాంక్షతో పిచ్చి పట్టిన వాడిలా ప్రవర్తిస్తున్న తీన్మార్ మల్లన్నపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టనున్నట్లు వివరించారు.

## మంచిర్యాల మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా రూపాంతరం..

# మాస్టర్‌ప్లాన్ ప్రతిపాదనలు సిద్ధం

కలెక్టర్ కుమార్ దీపక్






**ప్రజాపక్షం/నస్పూర్ :** జిల్లాలోని మంచిర్యాల మున్సిపాలిటీని ప్రభుత్వం కార్పొరేషన్‌గా మార్చినందున కార్పొరేషన్ పరిధిలో మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు జిఐఎస్ ఆధారిత ప్రతిపాదనలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో టౌన్ కంట్రీ ప్లానింగ్ శాఖ హైదరాబాద్ అదనపు సంచాలకులు రమేష్‌బాబు, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ శివాజీలతో కలిసి సంబంధిత అధికారులకు మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనల రూపకల్పనపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా నవీకరించడం జరుగుతుందని, ఈ క్రమంలో డ్రోన్ సర్వే ద్వారా సంబంధిత వివరాలను సేకరించడం జరిగిందని తెలిపారు. సంబంధిత శాఖల ద్వారా కార్పొరేషన్ రూపకల్పనతో పాటు నివాస ప్రాంతాలు, పారిశ్రామికంగా, వ్యాపారపరంగా అభివృద్ధి చెందే ప్రాంతాలను గుర్తించడం జరుగుతుందని, ఆయా ప్రాంతాలలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, బ్రాడ్బ్యాండ్ నెట్వర్క్, ట్రాఫిక్ ప్లానింగ్, మెడికల్, నీటి వనరులు, పరిశ్రమల స్థాపన ఇతరత్రా అంశాలకు సంబంధించిన వివరాలను సంబంధితశాఖల నుంచి సేకరించడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత శాఖలతో సమావేశం నిర్వహించి ముసాయిదా మాస్టర్‌ప్లాన్ రూపొందించి ప్రభుత్వ ఆమోదం కోసం ప్రతిపాదించడం జరుగుతుందని తెలిపారు. ఆమోదిత ముసాయిదా ప్లాన్‌ను ప్రచురించి ప్రజల నుంచి అభ్యంతరాలు, ఫిర్యాదులు, సలహాలు స్వీకరించడం జరుగుతుందని, అనంతరం తుది ప్రణాళికను నిర్ధారించి అమలు చేసే దిశగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.

### నీటిసరఫరాలో ఇబ్బంది రావొద్దు

**రామకృష్ణాపూర్ :** క్యాతనపల్లి మున్సిపాలిటీని కలెక్టర్, మున్సిపాలిటీ ప్రత్యేకాధికారి కుమార్‌దీపక్ తనిఖీ చేశారు. కార్యాలయంలో వివిధ విభాగాల పనుల గురించి తెలుసుకున్నారు. ఇంటి పన్నులు, ట్రేడ్ లైసెన్సులు 100శాతం వసూలు చేయాలని, పట్టణంలో ప్రజలకు నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని, పారిశుద్ధ్య పనులను మెరుగుపరచాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం నర్సరీని, డంప్ యార్డు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అమృత్ 2.0 కు సంబంధించి వాటర్ ట్యాంకుల నిర్మాణం త్వరగా పూర్తి చేసి ప్రజలకు నీటి సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యాబోధన అందించే దిశగా చర్యలు : కలెక్టర్ దోత్రే



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూనే నాణ్యమైన విద్యాబోధన అందించే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఉపాధ్యాయులు, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం మాలన్ గొంది గ్రామంలో గల గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, రిజిస్టర్లు, మధ్యాహ్నభోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని తెలిపారు. విద్యార్థులకు అన్నిరకాల మౌలిక వసతులు కల్పించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. అనంతరం గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా తడి చెత్త, పొడి చెత్త సేకరణ, వర్మి కంపోస్టు తయారీ, నర్సరీల నిర్వహణ పరిశీలించారు. విధులలో అలసత్వం, నిర్లక్ష్యం వహించిన పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారుల, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు పూర్తిస్థాయిలో సదుపాయాలు

అదనపు కలెక్టర్ దీపక్ తివారి



**ప్రజాపక్షం/వాంకిడి :** ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సౌకర్యార్థం పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లాలోని వాంకిడి మండల కేంద్రంలో గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అదనపు తరగతి గదుల నిర్మాణం కొరకు తహసీల్దార్ రియాజ్ అలీ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రవీణ్ కుమార్, మండల విద్యాధికారి శివ చరణ్ కుమార్‌లతో కలిసి పాఠశాల పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థుల సౌకర్యార్థం పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్య బోధన అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇందులో భాగంగా పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులకు ఆట స్థలం సదుపాయం కల్పిస్తూనే సరైన స్థలంలో అదనపు గదుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఇందాని గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శించి మధ్యాహ్న భోజనం నాణ్యత, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు, రిజిస్టర్లు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం డైట్ చార్జీలను 40 శాతం పెంచడం జరిగిందని, నూతన మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్నిసౌకర్యాలను కల్పించడం జరుగుతుందని, పాఠశాలలు చేపట్టిన పనులు వేగవంతం చేయాలన్నారు. 10వ తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థుల కొరకు ప్రత్యేక కార్యచరణ రూపొందించాలని, విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని, 100శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి మీనా, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, ఎఓ కిరణ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నోడల్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 16809 మంది పట్టభద్ర ఎమ్మెల్సీ ఓటర్లు, 1944 మంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 31 పోలింగ్ కేంద్రాలలో తమ ఓటు హక్కును వినియోగించుకోబోతున్నట్లు తెలిపారు. అధికారులు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి, తగు వసతులను కల్పించాలన్నారు. ఓటింగ్ కోసం నమోదు చేసుకున్న ప్రతిఒక్క ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న నామినేషన్ల పరిశీలన, 13వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ, 27 న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నటు తెలిపారు. మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, ఎమ్మెల్సీ ఎన్నికల నోడల్ అధికారులు గోవింద్, శ్రీనివాస్, కిరణ్ కుమార్, సందీప్, దుర్గాప్రసాద్, అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రవణ్ రెడ్డి, గాజుల రవి గంద్రత్ రమేష్, సిరికొండ రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### వనమహోత్సవంలో పచ్చదనం పెంపొందేలా మొక్కలు

**నిర్మల్ ప్రతినిధి :** వనమహోత్సవంలో పచ్చదనం పెంపొందేలా లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వన మహోత్సవం– 2025 కార్యక్రమ కార్యచరణపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వనమహోత్సవంలోజిల్లా లక్ష్యం 69 లక్షల 55వేల 300 మొక్కలు నాటే ప్రణాళికలను రూపొందించడం జరిగిందని తెలిపారు. శాఖల వారీగా వనంహోత్సవ లక్ష్యాల కార్యాచరణలను ప్రణాళికబద్ధంగా అమలు చేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, వసతిగృహాలు, దేవాలయాలు, పరిశ్రమలు, నీటిపారుదల, అటవీ, భూములలో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అటవీ, పంచాయతీ, డిఆర్‌డిఓల ఆధ్వర్యంలో నర్సరీలలో అవసరమైన మొక్కలను పెంచాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా అటవీ శాఖ అధికారి నాగిని భాను, డిఆర్‌డిఓ విజయలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వైద్యసేవలపై నిర్లక్ష్యం వద్దు

కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు



**ప్రజాపక్షం/ఎడపల్లి :** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందజేస్తున్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. స్థానికంగా నిర్వహిస్తున్న రక్త పరీక్షలు, రోగులకు అందిస్తున్న చికిత్సల గురించి వివరాలు వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఎంతమంది రోగులు చికిత్స కోసం ఆస్పత్రికి వస్తున్నారనే వివరాలను రిజిస్టర్‌లో పరిశీలించారు. గర్భిణీలకు క్రమం తప్పకుండా ఏఎన్సీ పరీక్షలు చేయాలని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యులకు సూచించారు. వైద్య సేవలపై నిర్లక్ష్యం వహించరాదని, స్థానికంగా అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు షాహిస్తా ఫిర్దౌస్, వైద్య సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థులు ఒత్తిడికి లోనుకావద్దు



**ప్రజాపక్షం/చెన్నూర్ :** విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించటానికి చదువు తప్పా వేరే మార్గం లేదని, ఇష్టంతో చదివి నైపుణ్యత సంపాదించుకుని మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని, విద్యార్థులు చదివే విషయంలో ఒత్తిడికి లోనుకావద్దని మంచిర్యాల డిసిపి భాస్కర్ సూచించారు. మంగళవారం పోలీస్ మీ కోసం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో డిసిపి మాట్లాడారు. చిన్న చిన్న విషయాలకు ఆవేదనకు గురై కృంగి పోవద్దని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, బాధ్యతతో ముందుకు సాగి విజయాలు సాధించాలని, తల్లితండ్రుల గౌరవాన్ని కాపాడేందుకు ప్రణాళిక బద్ధంగా చదవాలన్నారు. యువకులు గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేశారు. కార్యక్రమంలో జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్, పట్టణ సిఐ రవీందర్ పాల్గొన్నారు.

## క్రీడలతో యువతకు భవిష్యత్తు

**ప్రజాపక్షం/నర్సాపూర్ :** క్రీడలతో యువతకు భవిష్యత్తు ఉంటుందని, పోటీలలో పాల్గొనడం వలన ఒకరి మధ్య ఒకరి స్నేహభావం పెంపొందుతుందని ప్రముఖ వ్యాపారవేత పైడి శ్రీధర్ గుప్తా అన్నారు. నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పది రోజులుగా నిర్వహిస్తున్న సిఎం కప్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం సంగారెడ్డి, దౌల్తాబాద్ జట్ల మధ్య పోటీ జరగగా ముఖ్యఅతిథిగా శ్రీధర్ గుప్తా హాజరై టాస్ వేసి క్రీడను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఎటువంటి భేదాభిప్రాయాలు లేకుండా కలిసిమెలిసి క్రీడలు ఆడాలన్నారు. పోటీల్లో గెలుపు ఓటములు సహజమని, ఓడిన వాళ్ళు అధైర్య పడకుండా విజయానికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం, రిజ్వాన్, రషీద్, సురేష్ నాయక్, అశోక్, సాగర్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా తిరుమలస్వామి వేడుకలు

ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే రోహిత్



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండలం చల్మెడ గ్రామంలో శ్రీతిరుమల స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం రెండవ రోజు సందర్భంగా యజ్ఞం, ఎడ్లబండ్లు తిరుగుట, పల్లకి సేవ, రథం తిరుగుట కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథిగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చారిత్రాత్మక చరిత్ర కలిగిన దేవాలయాల ఉత్సవాలలో పాల్గొనడం సంతోషకరంగా ఉందన్నారు. స్వామివారి దీవెనలు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని కోరుకుంటున్నన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చౌదరి సుప్రభాతరావు, ఆలయ చైర్మన్ రాంరెడ్డి, డైరక్టర్ బీజ్జ రమేష్, అమరసేనారెడ్డి, పంజా మహేందర్, నజిరుద్దీన్, వెంకట్ గౌడ్, లింగంగౌడ్, మరూతి, సిద్ధారాములు పాల్గొన్నారు.

# ముందస్తు అవగాహనతోనే క్యాన్సర్ నివారణ

కలెక్టర్ అభిలాష అభినవ్




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ముందస్తు అవగాహనతోనే క్యాన్సర్ నివారించవచ్చని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం సోన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని జరుపుకుంటామని, దీని ప్రధాన ఉద్దేశ్యం క్యాన్సర్ గురించి అవగాహన పెంచడం, నివారణ చర్యలు ప్రోత్సహించడం, ఈ వ్యాధితో పోరాడుతున్న వారికి ధైర్యాన్ని ఇవ్వడం అని తెలిపారు. మారుతున్న ప్రజల జీవనశైలి కారణంగా సమాజంలో క్యాన్సర్ వ్యాధి తీవ్రరూపం దాలుస్తుందన్నారు. ప్రజల నిత్య జీవన విధానంలో ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం మెరుగైన ఆరోగ్య అలవాట్లను పెంపొందించుకోవడం వల్ల క్యాన్సర్ వ్యాధి రాకుండా ఉంటుందన్నారు. ముఖ్యంగా మహిళలు నిరంతర వ్యాయామం, చక్కని ఆరోగ్య అలవాట్లను పాటించడం ద్వారా క్యాన్సర్‌కు దూరంగా ఉండవచ్చన్నారు. ముందస్తు వ్యాధి నిర్ధారణ పరీక్షల ద్వారా క్యాన్సర్ వ్యాధి నయం చేసుకోవచ్చు అని తెలిపారు. క్యాన్సర్ వ్యాధికి ప్రభుత్వ ఆసుపత్రులలో మందులు అందుబాటులో ఉన్నాయని సరైన చికిత్స ద్వారా క్యాన్సర్‌ను నయం చేసుకోవచ్చన్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం అనేక ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌లు, ఆరోగ్య సంరక్షణ పథకాలు ప్రవేశపెట్టిందని, ప్రజలు వీటిని ఉపయోగించుకుని ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి అందిస్తున్న చికిత్సలకు కలెక్టర్ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. చికిత్సల కోసం ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందు లు కలగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రిలో వైద్య విభాగాలను తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణలో మెరుగైన పారిశుద్ధ్యాన్ని నిర్వహించాలని, వైద్యులందరూ రోగుల పట్ల సేవా దృక్పథంతో ఉండి చికిత్సలు అందించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధు లు నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాధిక, వైద్యులు శ్రీనివాస్, తహసీల్దార్ మల్లేష్, ఎంపిడిఓ సురేష్, ఆసుపత్రి సిబ్బంది. మహిళలు తదితరులు పాల్గొన్నారు.




### రోజువారీ అలవాట్లతో క్యాన్సర్ వ్యాధి దూరం

**సంగారెడ్డి ప్రతినిధి :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవాని చంద్ర అదేశాలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి డిఎంహెచ్ఓ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ మనరోజు వారి అలవాట్లు, తినే ఆహారంతో క్యాన్సర్ వ్యాధి ప్రభలుతుందన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం మెరుగైన ఆరోగ్య అలవాట్లను పెంపొందించుకోవడంతో క్యాన్సర్ వ్యాధి రాకుండా ఉంటుందన్నారు. క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తిస్తే చికిత్స చేయించుకోవచ్చన్నారు. గుర్తించడం నివారణ, చికిత్స మార్గాలతో క్యాన్సర్ వ్యాధిని జయించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తి బి.రమేష్, డిఎంహెచ్ఓ గాయత్రీదేవి, డా.శశాంక్, డాక్టర్లు, ఆశావర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రీడ

# టికెట్ ధర రూ. 1.20 లక్షలు.. గంటల్లోనే ఖతం!




చిరకాల ప్రత్యర్థులైన భారత్–పాకిస్థాన్ మధ్య జరిగే క్రికెట్ మ్యాచ్ల క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇరు దేశాల అభిమానులే కాకుం డా యావత్ క్రికెట్ ప్రపంచం ఈ మ్యాచ్ కోసం ఆసక్తి కనబరుస్తోంది. దా యాదీ దేశాలు ద్వైపాక్షిక సిరీస్లు ఆడకుండా కేవలం ఐసీసీ, ఏసీసీ టోర్నీల్లో మాత్రమే తలపడుతుండుతున్నాయి. దాంతో భారత్–పాక్ మ్యాచ్లకు మరింత డిమాండ్ పేరిగింది. భారత్–పాక్ మ్యాచ్కు ఉండే డిమాండ్ మరో సారి నిరూపితమైంది. అప్కమింగ్ ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో భారత్, పాకిస్థాన్ జట్లు తలపడుతున్నాయి. ఈ నెల 23న దుబాయ్ వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్కు సంబంధించిన టికెట్లన్నీ గంటల్లోనే అమ్ముడయ్యాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. ఈ మ్యాచ్ గరిష్ట టికెట్ ధర రూ. 1.20 లక్షలు. ఈ టికెట్లు కూడా పూర్తిగా అమ్ముడయ్యాయి. పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తున్న ఈ టోర్నీలో భారత మ్యాచ్లు దుబాయ్ వేదికగా జరగనున్న విషయం తెలిసిందే. పాకిస్థాన్లో పర్యటించేందుకు బీసీసీఐ ససేమిరా అనడంతో ఇరు దేశాల క్రికెట్ బోర్డు ఓ అంగీకారానికి వచ్చాయి. ఇరు దేశాలు ఆతిథ్యం ఇచ్చే ఐసీసీ టోర్నీలను హైబ్రిడ్ మోడల్లో నిర్వహించాలనే ఒప్పందం చేసుకున్నాయి. భారత్ వేదికగా జరిగే ఐసీసీ టోర్నీల్లో పాక్ మ్యాచ్లు తటస్థ వేదికగా జరగనుండగా.. పాక్ వేదికగా జరిగే టోర్నీల్లో భారత్ మ్యాచ్లు కూడా ఆ దేశం బయటే జరగనున్నాయి. ఈ ఒప్పందంలో భాగంగానే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లోని భారత్ మ్యాచ్లు దుబాయ్ వేదికగా నిర్వహించనున్నారు. భారత్పాక్ మ్యాచ్కు సంబంధించిన టికెట్లను సోమవారం సాయంత్ర ఆన్లైన్ వేదికగా అందుబాటులోకి తీసుకురాగా.. నిమిషాల్లోనే సేల్ అయ్యాయి. గరిష్ట టికెట్లు రూ. 47 వేలు, రూ. 1.20 లక్షల టికెట్లు కూడా అమ్ముడయ్యాయి. భారత్పాక్ మ్యాచ్కు ఇరు దేశాల సెలెబ్రిటీలు భారీ సంఖ్యలో హాజరవుతారు. ఈ క్రమంలోనే భారీ ధర కలిగిన టికెట్లు కూడా అమ్ముడయ్యాయి. ఇతర మ్యాచ్ల టికెట్లన్నీ రూ. 2500 నుంచి ప్రారంభమైతే.. భారత్పాక్ మ్యాచ్ టికెట్ ధరలు మాత్రం రూ. 10 వేల నుంచి రూ. 1.20 లక్షలుగా ఉండటం గమనార్హం. ఈ టోర్నీలో బంగ్లాదేశ్, పాకిస్థాన్, న్యూజిలాండ్తో భారత్ గ్రూప్ఏలో ఉంది. గ్రూప్బీలో ఆస్ట్రేలియా, అఫ్గానిస్థాన్, సౌతాఫ్రికా, ఇంగ్లండ ఉన్నాయి. ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్తో తొలి మ్యాచ్ ఆడనున్న భారత్.. 23న పాకిస్థాన్తో తలపడనుంది. వన్డే ప్రపంచకప్ 2023 తర్వాత ఈ ఫార్మాట్లో భారత్పాక్ తలపడటం ఇదే తొలిసారి. మెగా టోర్నీల్లో పాకిస్థాన్పై భారత్కు మెరుగైన రికార్డ్ ఉంది. కానీ ఛాంపియన్స్ ట్రోఫీ 2017 ఫైనల్లో భారత్ను ఓడించి పాక్ విజేతగా నిలిచింది.

## వన్డే జట్టులోకి వరుణ్ చక్రవర్తి!



టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి ప్రమోషన్ దక్కినట్లు తెలుస్తోంది. ఇంగ్లండ్తో ఐదు టీ20ల సిరీస్లో సంచలన బౌలింగ్ ప్రదర్శన కనబర్చిన వరుణ్ చక్రవర్తి 14 వికెట్లతో ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచిన విషయం తెలిసిందే. అతని బౌలింగ్ను ఆడేందుకు ఇంగ్లండ బ్యాటర్లు తడబడటంతో వన్డే జట్టులోకి తీసుకోవాలనే డిమాండ వ్యక్తమైంది. రవిచంద్రన్ అశ్విన్ వంటి మాజీ క్రికెటర్లు వరుణ్ చక్రవర్తిని ఇంగ్లండ్తో వన్డే సిరీస్తో పాటు ఛాంపియన్స్ ట్రోఫీ కూడా ఆడించాలని డిమాండ చేశారు. ఈ క్రమంలోనే టీమిండియా మేనేజ్మెంట్ వరుణ్ చక్రవర్తిని భారత జట్టులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. నాగ్పూర్ వేదికగా జరగనున్న తొలి వన్డేలో వరుణ్ చక్రవర్తి బరిలోకి దిగే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం వరుణ్ చక్రవర్తి భారత వన్డే జట్టుతో నాగ్పూర్లోనే ఉన్నట్లు ఓ ప్రముఖ ఛానెల్ జర్నలిస్ట్ తెలిపాడు. అయితే అతన్ని జట్టులోకి తీసుకున్నారా? లేదా? అనేదానిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. కానీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో ఆడించాలనే ఉద్దేశంతోనే వరుణ్ చక్రవర్తిని భారత వన్డే జట్టులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై బీసీసీఐతో పాటు టీమిండియా మేనేజ్మెంట్ అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది.

## జాతీయ క్రీడల్లో తెలుగు అథ్లెట్ల హవా

### సత్యజ్యోతి, సురభికి కాంస్య పతకాలు



ప్రస్తుతం 38వ జాతీయ క్రీడలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ కు చెందిన లిఫ్టర్ టి.సత్యజ్యోతి, తెలంగాణకు చెందిన షూటర్ రాపోలు సురభి భరద్వాజ్ మంచి ప్రదర్శన కనబరిచారు. వీరిద్దరూ కాంస్య పతకాలను దక్కించుకున్నారు.

**వెయిట్ లిఫ్టింగ్ లో తెలుగమ్మాయికి కాంస్య**

మహిళల 87 కేజీల విభాగంలో మొత్తంగా 201 కేజీల బరువెత్తిన సత్య జ్యోతి బ్రాంజ్ మెడల్ సొంతం చేసుకుంది. స్నాచ్లో 92 కేజీలు, క్లీన్ అండ్ జర్క్లో 109 కేజీలు లిఫ్ట్ చేసింది. ఇక ఇదే విభాగంలో పంజాబ్ తరఫున ప్రాతినిధ్యం వహించిన మెహక్ శర్మ మొత్తంగా 247 కేజీలు బరువెత్తింది. స్నాచ్లో 106 కేజీలు.. క్లీన్ అండ్ జర్క్లో 141 కేజీలు లిఫ్ట్ చేసింది. తద్వారా మూడు జాతీయ రికార్డులను బ్రేక్ చేసి అగ్రస్థానంలో నిలిచింది. స్నాచ్ (105 కేజీలు), క్లీన్ అండ్ జర్క్ (140 కేజీలు), టోటల్ (244 కేజీలు)లో తన పేరిటే ఉన్న రికార్డులను తానే బ్రేక్ చేసింది. యూపీకు చెందిన పూర్ణిమ 216 కేజీల బరువెత్తి సిల్వర్ మెడల్ ను ముద్దాడింది.

**షూటింగ్ లో తెలంగాణ బిడ్డకు కాంస్య**

షూటింగ్ లో... 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్లో తెలంగాణ అమ్మాయి సురభి (448.8) మూడో స్థానాన్ని దక్కించుకుంది. పంజాబ్ కు చెందిన సిఫ్త్ కౌర్ (461.2) గోల్డ్ మెడల్, అంజుమ్ మౌద్గిల్ (458.7) సిల్వర్ మెడల్ సాధించారు.

## రీల్

## తమిళ్లో అజిత్ స్టార్ పవర్..!




కోలీవుడ్ సినిమా దగ్గర సూపర్ క్రేజ్ ఉన్నటువంటి స్టార్ హీరోస్ లో థలా అజిత్ కుమార్ కూడా ఒకరు. మరి సినిమాల్లోనే కాకుండా బయట జీవితంలో కూడా అజిత్ రియల్ హీరోగా ప్రూవ్ చేసుకున్నారు. అయితే అజిత్ నుంచి ఎప్పుడు నుంచో అవైటెడ గా ఉన్న సినిమా విడా ముయర్చి ఇపుడు రిలీజ్ కి వస్తుంది. నిజానికి ఈ సినిమా ఎప్పుడో స్టార్ట్ అయ్యింది అలానే ఎప్పుడో రిలీజ్ కి రావాల్సి ఉంది. కానీ ఆలస్యం అవుతూ వచ్చింది. పైగా వచ్చిన కంటెంట్ కూడా మరీ అంత హిట్ గా కూడా మారలేదు. అయినప్పటికీ ఇపుడు తమిళ నాట బుకింగ్స్ చూస్తే ఊహించని లెవెల్లో ఉన్నాయని చెప్పాలి. అక్కడ బుకింగ్స్ ఓపెన్ చేయగా ఇపుడు హౌస్ ఫుల్ బుకింగ్స్ మాత్రమే కనిపిస్తున్నాయి. ఇదంతా డెఫినెట్ గా అజిత్ స్టార్ పవరే అని చెప్పవచ్చు. మరి ఇలాంటి సినిమాకే ఈ రేంజ్ బుకింగ్స్ అంటే మంచి హైప్ ఉన్న భారీ సినిమా గూడ్ బ్యాడ అగ్లీ కి నెక్స్ట్ లెవెల్లో ఉంటుందని చెప్పవచ్చు. అయితే తెలుగులో మాత్రం విడా ముయర్చి డబ్బింగ్ అయ్యి పట్టుదల గా వస్తుంది కానీ మన దగ్గర సినిమా డల్ గానే కనిపిస్తుంది. మరి ఈ సినిమా ఓపెనింగ్స్ ఎలా ఉంటాయో చూడాల్సిందే.

## 'తండేల్' బుకింగ్స్ షురూ..




అక్కినేని యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో అక్కినేని నాగ చైతన్య హీరోగా సాయి పల్లవి హీరోయిన్ గా దర్శకుడు చందూ మొండేటి తెరకెక్కించిన భారీ చిత్రం తండేల్ కోసం అందరికీ తెలిసిందే. మరి చైతు కెరీర్లో భారీ బడ్జెట్ తో తెరకెక్కించిన ఈ సినిమా కోసం అక్కినేని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తుండగా మేకర్స్ కూడా సూపర్ కాన్ఫిడెంట్ గా ఉన్నారు. అయితే ఈ సినిమా బుకింగ్స్ కోసం పాన్ ఇండియా ఆడియెన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తుండగా ఇపుడు బుక్ మై షోలో తండేల్ బుకింగ్స్ ఓపెన్ చేసేసారు. ఆల్రెడీ నైజాంలో బుకింగ్స్ ఓపెన్ చేయగా వీటికి మంచి రెస్పాన్స్ వస్తుంది. మరి ఇప్పుడు వరకు బుక్ మై షోలో 20 వేలకి పైగా టికెట్స్ అమ్ముడుపోగా ఈ సినిమా బుక్ మై షోలో లక్ష 50 వేలకి పైగా ఇంట్రెస్ట్స్ తో ట్రెండింగ్ లో కూడా కొనసాగుతుంది. మొత్తానికి అయితే తండేల్ సినిమా మంచి ఓపెనింగ్స్ కి రంగం సిద్ధం చేసుకుంటుంది అని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా ఈ ఫిబ్రవరి 7న పాన్ ఇండియా భాషల్లో రిలీజ్ కి సిద్ధం అవుతుంది.

## అభిమానుల కోసం ఎన్టీఆర్ స్పెషల్ ప్లాన్



'మ్యాన్ ఆఫ్ మాసెస్' జూ.ఎన్టీఆర్ తాజాగా తన అభిమానుల కోసం ఓ ప్రత్యేక ప్రకటన చేశారు. తనపై అభిమానులు చూపిస్తున్న అపారమైన ప్రేమ, గౌరవానికి ఎన్టీఆర్ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. తనను కలుసుకునేందుకు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని.. ఆ విషయం తాను అర్థం చేసుకోగలనని ఆయన తెలిపారు. త్వరలోనే అభిమానుల కోసం ఓ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తానని.. అభిమానులందరినీ తాను ప్రత్యేకంగా కలుసుకుంటానని తారక్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అన్ని అనుమతులు పొందుతూ, పోలీస్ డిపార్ట్మెంట్ మరియు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని శాంతి భద్రతల సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తారక్ తెలిపారు. ఇలాంటి పెద్ద సమావేశం ఏర్పాటు చేయడానికి కొంత సమయం పడుతుందని.. కాబట్టి, అభిమానులు ఓర్పుగా ఉండాలని తారక్ కోరుతున్నట్లు ఆయన ఆఫీస్ నుంచి ఓ ప్రకటన వెలువడింది. ఈ నేపథ్యంలో, అభిమానులు తనను కలుసుకోవడానికి పాదయాత్ర వంటివి చేయరాదని.. తన అభిమానుల ఆనందమే కాదు, వారి సంక్షేమం కూడా తనకు అత్యంత ప్రాధాన్యత అని తారక్ స్పష్టం చేశారు. ఇలా అభిమానుల కోసం ఎన్టీఆర్ స్పెషల్ ప్లాన్ చేస్తుండటంతో ఆయన్ను కలిసేందుకు ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు.





## తిరుగుండదు

(మొదటి పేజీ తరువాయి)

పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చాడా వెంకట్రెడ్డి మాట్లాడుతూ ఏ పార్టీకి సిద్ధాంతం లేదు, అంతరాలు లేని, వర్గ రహిత సమాజ నిర్మాణం కోసమే సిపిఐ ఏర్పడిందన్నారు. తమకు సిద్ధాంతం ఉందని చెప్పుకునే బిజెపిది మనువాద సిద్ధాంతమని, మతోన్మాదంతో వ్యవహరిస్తుందన్నారు. అన్ని పార్టీల జెండాలు వ్యక్తులతో ఏర్పడితే సిపిఐ చేతబట్టిన ఎర్రజెండా కార్మికుల రక్తం నుండి పుట్టిందన్నారు. ఆకలి మంటలు, ఆర్తనాదాలు, బతుకుదెరువు, బతుకుకై పోరాటమే సిపిఐ చేస్తున్న పనిఅని, కర్షకులు, కార్మికులు, శ్రామికుల కోసం రష్యాలో ఎర్రజెండా ప్రభుత్వం ఏర్పడితే దేశంలో వందేళ్ల క్రితమే ఆవిర్భవించిన సిపిఐ కార్మికుల కోసం ఎఐటియుసి, యువత కోసం ఎఐవైఎఫ్, మహిళలు, విద్యార్థులు ఇలా అన్ని రంగాల వారి కోసం మొట్ట మొదటగా సంఘాలను ఏర్పాటు చేసింది. అంబేద్కర్ దేశానికి రాజ్యాంగాన్ని అందిస్తే పాలకులు ఆ రాజ్యాంగాన్ని కూడా అమలు చేయడం లేదని, మోదీ సర్కార్ తెలంగాణ విభజన హామీలను తుంగలో తొక్కిందన్నారు. 8 మంది ఎంపిలను ఇచ్చినా విభజన హామీలైన కోచ్ ఫ్యాక్టరీ, స్టీల్ ప్లాంట్, యూనివర్సిటీ వంటి వాటికి నయా పైసా కేటాయించలేదన్నారు. బిజెపి బడా బోగస్ పార్టీ అని, ఆ పార్టీ ఎంపి బండి సంజయ్ గద్దర్ను కూడా విమర్శించారన్నారు. గద్దర్ గురించి బండి సంజయ్కు ఏం తెలుసని ఆయన మంత్రి పదవికి అనర్హుడని మండిపడ్డారు. సిపిఐ మద్దతు తోనే తెలంగాణ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, సిపిఐ ఆధ్వర్యంలో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు, అర్హులకు ఇండ్లు, రేషన్ కార్డులు ఇచ్చినప్పుడు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి మా పార్టీని గుర్తించినట్లుగా భావిస్తామన్నారు. కమ్యూనిస్టులు ఎవరి పక్షం కాదని వాస్తవాల పక్షమని, 10లక్షల ఎకరాల భూ పంపిణీ జరగిందంటే అది కమ్యూనిస్టుల త్యాగమేనన్నారు. కమ్యూనిస్టులు ఏకం కవాల్సిన అవసరం ఉందని, అప్పుడే ఎర్రకోటపై ఎర్రజెండా ఎగురుతుంది, ఎర్రజెండాకు దేశంలో ఎదురుండదన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి కేంద్రంగా ఉన్న జనగామలోనూ బలమైన ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

**కమ్యూనిస్టులు, మావోయిస్టులు కలిసి పోరాడాలి : తక్కెళ్లపల్లి**

కమ్యూనిస్టుల్లో చీలికలు ఉన్నందునే నష్టం జరుగుతుంది, అందుకే కమ్యూనిస్టులు, మావో యిస్టులు కలిసి పోరాడాల్సిన అవసరం ఉందని తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. పొరుగుదే శాలైన శ్రీలంక, నేపాల్, చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వాలు ఉన్నాయని, అధికారంలోకి రావడాని కి దేశంలోని మా వోయిస్టులతో సహా కమ్యూనిస్టు లు ఏకం కావా లన్నారు. దేశంలో కమ్యూనిస్టులు పార్టీలను అణిచివేసే కుట్ర జరుగుతుందన్నారు. ఉద్యమాల గడ్డ జనగా మలో పార్టీ మరింత బలప డాల్సిన అవసరం ఉంద న్నారు. జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి మాట్లా డుతూ కష్టజీవులు, కార్మికులు, రైతులు, కూలీలకు ఎర్రజెండా అండగా ఉంటుందని, వారు కూడా ఎర్ర జెండాను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు రొండ్ల మల్లారెడ్డితో పాటు పలు వురు నాయ కుల్ని సన్మానించారు. ఈ కార్యక్ర మంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి చొప్పరి సోమయ్య, జిల్లా నాయకులు తది తరులు పాల్గొన్నారు.

**భారీల ర్యాలీ:** శత వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం జనగా మలోని ప్రిస్టన్ గ్రౌండ్ నుండి నెహ్రూపార్కు కామాక్షి పంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వయించారు. ర్యాలీలో చాడా వెంకట్రెడ్డి, తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సిహెచ్ రాజారెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులు ఆలపించిన గీతాలు అలరించాయి. ర్యాలీలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## భూవివరాలు అడిగినందుకే సర్వేలో పాల్గొనలే

### రాష్ట్ర ప్రజలకు కెసిఆర్, కెటిఆర్, హరీష్రావు క్షమాపణలు చెప్పాలి:సిఎం రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కుల గణన సర్వేలో భాగంగా భూముల వివరాలను అడిగినందుకే ఎంఎల్ఎలు కె.చంద్రశేఖర్ రావు, తారకరామారావు, హరీశ్ రావు ఈ సర్వేలో పాల్గొనలేదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విమర్శించారు. ఇందుకు వారు తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సర్వేలో ఎంఎల్ఎలు పద్మారావు ,పల్ల రాజేశ్వర్ రెడ్డి, ఎంఎల్సి పోచారం శ్రీనివాస్ రెడ్డి, బిజెపి ఎంపి డి.కె.అరుణ పాల్గొనలేదన్నారు.ప్రతి పదేళ్లకో సారి నిర్వహించే జనగణలో భాగంగా '2021 జనగణ'ను ఇప్పటి వరకు ప్రధాని మోదీ ఎందుకు చేపట్టలేదని, దీనికి బాధ్యులు ఎవరని, ఈ విషయమై బిజెపి సభ్యులు (ఎంఎల్ఎలు) ఎందుకు ప్రశ్నించడం లేదని సిఎం నిలదీశారు. గత ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను కేవలం ఒక కుటుంబం కోసమే నిర్వహించారని విమర్శించారు. శాసనసభ ప్రత్యేక సమావేశంలో కులగనన సర్వే ప్రకటనపై మంగళవారం జరిగిన చర్చలో బిజెపి సభ్యులు పాయల శంకర్ 'సమగ్ర కుటుంబ సర్వే నివేదిక' లెక్కలను ప్రస్తావించారు. దీనిపైన సిఎం రేవంత్రెడ్డి స్పందిస్తూ సమగ్ర కుటుంబ సర్వేకు శాస్త్రీయత, చట్టబద్ధత లేదని, కేవలం ఈ లెక్కలను రాజకీయ ప్రయోజనాలనం కోసం ఒక కుటుంబం ఉపయోగించుకున్నదని వివరించారు. సమగ్ర కుటుంబ సర్వేను శాసనసభలో ఎందుకు ప్రవేశపెట్టలేదని, మంత్రివర్గం ఎందుకు ఆమోదించలేదని ప్రశ్నించారు. సమగ్ర కుటుంబ సర్వే నివేదికను ప్రభుత్వ అధికారిక వెబ్సైట్లో కూడా పొందుపర్చలేదని, కేవలం ఎంసిహెచ్ఆర్డి వెబ్సైట్లో పెట్టారని, దీనిని ఎవరు పెట్టారు. దీనికి ఓనర్షిప్ లేదన్నారు. శాస్త్రీయత, చట్టబద్ధత లేకుండా అపోహాల సంఘం అధ్యక్షుడు విడుదల చేసిన లెక్కల ఆధారంగా ప్రస్తుతం ప్రభుత్వం ఎంతో శాస్త్రీయంగా చేసిన కులగణ సర్వేను తప్పుపట్టవద్దని సూచించారు. గత ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ఒసి జనాభా 21 శాతంగా, బిసిలను 51 శాతం చూపించారని, కానీ ప్రస్తుత కుల గణన సర్వేలో బిసిలను 56.33 శాతం, ఒసిలను 15.79 శాతం మంది ఉన్నారని సిఎం వివరిం చారు.అర్థం,పర్థం లేని లెక్కలను సభలో ప్రాస్తవించి అపోహాలను సృష్టించొద్దన్నారు. బిసిల లెక్కలు తగ్గలేదన్నారు.

**స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ 42 శాతం బిసిలకు కేటాయిస్తాం.. బిఆర్ఎస్,బిజెపి కేటాయిస్తారా? : సిఎం రేవంత్ రెడ్డి**

బిసిల రిజర్వేషన్లను అమలు చేయాలంటే రాజ్యాంగ సవరణ జరగాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే స్థానిక సంస్థలలో కాంగ్రెస్ పార్టీ తరపున 42 శాతం సీట్లను బిసిలకు కేటాయించేందుకు సిద్ధమని, ఈ రిజర్వేషన్ను అమలు చేసేందుకు బిఆర్ఎస్, బిజెపి సిద్ధమా అని సవాల్ విసిరారు. స్థానిక సంస్థలలో బిసిలకు 42 శాతం సీట్లన కేటాయిస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2011 జనగణన తర్వతా రాష్ట్ర ప్రభుత్వం లెక్కల ప్రకారం ప్రస్తుతం సభలో ప్రవేశపెట్టిన కుల గణన సర్వే లెక్కలనే ప్రమాణికంగా తీసుకుంటామని, దీనికి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహిస్తుందని సిఎం స్పష్టం చేశారు.

## ఎన్నికల యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్లో పాల్గొనే సీనియర్ సిటిజన్లు, వికలాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వారి కోసం ప్రత్యేకంగా 733 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియను క్రమబద్ధీకరించేందుకు క్యూ మేనేజ్మెంట్ సిస్టమ్ (క్యూఎంఎస్) యాప్ను ఎన్నికల సంఘం ప్రవేశపెట్టింది. దీని ద్వారా ఓటర్లు లైవ్లో పోలింగ్ బూత్ల వద్ద ఓటర్ల రద్దీపై సమాచారాన్ని చెక్ చేసుకోవచ్చు.

**భారీ భద్రతా ఏర్పాట్లు:** ఎన్నికల నిర్వహణ కోసం భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. 220 కంపెనీల పారామిలిటరీ దళాలను, 35,626 మంది ఢిల్లీ పోలీసు సిబ్బందిని, 19,000 మంది హోమ్ గార్డులను ఎన్నికల సంఘం మోహరించింది. దాదాపు 3,000 పోలింగ్ బూత్లను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఆయా ప్రదేశాలలో డ్రోన్తో నిఘాతో పాటు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. సమస్యాత్మక పోలింగ్ బూత్లు ఉన్నచోట అదనపు పోలీసు బలగాలను మోహరించనున్నారు. అక్కడ క్విక్ రియాక్షన్ టీమ్లు (క్యూఆర్టి) అందుబాటులో ఉంటాయి.

**త్రిముఖ పోరు:** అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ తన పాలనాపరమైన ఘనతలు, సంక్షేమ పథకాలపై ఆధారపడి మూడోసారి వరుసగా అధికారంలోకి రావాలని యత్నిస్తోంది. 25 ఏళ్ల తర్వాత తొలిసారిగా ఢిల్లీ గద్దెపై జయకేతనం ఎగురవేయాలనే పట్టుదలతో బిజెపి ఉంది. 2013 వరకు వరుసగా 15 సంవత్సరాలు ఢిల్లీని ఏలిన కాంగ్రెస్, గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ చతికిల పడింది. కనీసం ఒక్క సీటును కూడా గెలవలేకపోయింది. కనీసం ఈసారైనా అధికారంలోకి రావాలని హస్తం పార్టీ భావిస్తోంది. ఢిల్లీలో సోమవారం(ఫిబ్రవరి 3న) సాయంత్రం 6 గంటలకు అధికారికంగా ఎన్నికల ప్రచారం ముగిసింది.

**మహామహుల ప్రచారం:** ఎన్నికల ప్రచారంలో బిజెపి తరఫున ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా హోరెత్తించారు. ఆప్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఇక కాంగ్రెస్ తరఫున రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ముమ్మర ప్రచారం చేశారు. ఆప్, బిజెపిని లక్ష్యంగా చేసుకొని వారిద్దరూ విరుచుకుపడ్డారు. ఢిల్లీలో 'శీష్ మహల్'(కేజ్రీవాల్ అధికారిక నివాసం), యమునా నది నీటి నాణ్యత తగ్గిపోవడం, ఓటర్ల జాబితా ట్యాంపరింగ్, శాంతిభద్రతలు, మహిళా సంక్షేమం వంటి అంశాలను రాహుల్, ప్రియాంక లేవనెత్తారు.

**అందరివీ సంక్షేమ అజెండాలే**

ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పూర్తిగా సంక్షేమ అజెండానే నమ్ముకుంది. విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణాలు, ఆటో, టాక్సీ డ్రైవర్లకు బీమా, ఆలయ పూజారులు, గురుద్వారా గ్రంథీలకు రూ. 18,000 ఆర్థిక సహాయం అందిస్తామని కేజ్రీవాల్ ప్రకటించారు. బిజెపి సైతం ఇలాంటి పలు హామీలు ఇచ్చింది. గర్భిణులకు రూ.21,000 ఆర్థిక సహాయం, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్లు అందిస్తామని వాగ్దానం చేసింది. నెలకు రూ.8,500 నిరుద్యోగ భృతిని అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఢిల్లీ ప్రజలు ఏ పార్టీని ఆశీర్వదించారు అనేది ఫిబ్రవరి 8న తెలిసిపోతుంది.

## సేకరించాలి

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. కుల గణన సర్వే సమగ్రంగా లేదని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో దీనిని సరిదిద్దేదుకు గ్రామాలలో సభలు ఏర్పాటు చేసి వివరాలను మరోసారి పునర్ పరిశీలించడంతో, పాటు ఎవరైనా నమోదు కాకుండా ఉంటే వారి వివరాలను కూడా సేకరించాలని ప్రభుత్వానికి ఆయన సూచన చేశారు. శాసనసభ ప్రత్యేక సమావేశంలో మంగళవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్రెడ్డి చేసిన 'సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వే–2024' ప్రకటనపై జరిగిన చర్చలో కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో కులాల వారిగా గణన చేపట్టడం ఇదే మొదటి సారి అని భావిస్తున్నామని, ప్రభుత్వం చేపట్టిన సర్వేతో తెలంగాణ రాష్ట్రంలో కులాల వారీగా ఎవరు ఎంత శాతం ఉన్నారనేది అధికారికంగా స్పష్టత వచ్చిందన్నారు. ఈ ప్రక్రియను నిర్వహించిన ప్రభుత్వాన్ని కూనంనేని సాంబశివరావు అభినందించారు. ఏ కార్యక్రమం చేపట్టిన ఎంతో కొంత లోటుపాటు ఉంటుందని, ఇతర సర్వేలతో కుల గణన సర్వేను దీనిని పోల్చి చూడడం సరికాద్దన్నారు. తమిళ నాడు రాష్ట్రంలో ఇప్పటికే 72 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయని, అయితే సుప్రీంకోర్టు రిజర్వేషన్లు 50 శాతం మించరాదంటూ తీర్పును ఇచ్చిన నేపథ్యంలో రాజకీయ లబ్ది కోసం కాకుండా బిసిల ఆశలు, ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. రిజర్వేషన్ల కేటాయింపులకు సంబంధించి వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించాలని, దానిని ప్రజలు అర్థం చేసుకుంటారని ఆయన సూచించారు. ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనుకుంటున్నామని, ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి తీర్మానం పంపినంత మాత్రాన ఉపయోగం ఉండదని గుర్తుంచుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. క్రీస్తు పూర్వం 200 ఏళ్ల కింద నుంచే వెనకబడినవర్గాల ప్రజలు వివక్షతకు గురవుతూనే ఉన్నారన్నారు. బిసిల కులవృత్తుల నైపుణ్యమే వారికి శాపంగా మారిందని, బిసిలు వృత్తి నైపుణ్యంతో సమాజానికి సేవలందిస్తేండగా, ఏ పని రాని వారు మాత్రం అగ్రవర్ణాలుగా చలామణి అవుతూ వృత్తిదారులను అణగదొక్కుతున్నారన్నారు. అయితే అన్ని వర్గాలు సమాన అభివృద్ధి జరిగి అసమానతలు లేని సమాజం ఏర్పడే వరకు రిజర్వేషన్లు అవసరమేనని సాంబశివరావు అన్నారు. రిజర్వేషన్ల ద్వారా తమకు లబ్ది చేకూరుతుందని ప్రజలు భావిస్తున్న నేపథ్యంలో రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనని సాంబశివరావు స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలను పాలకులు అరకొరగా భర్తీ చేస్తున్న నేపథ్యంలో అవుట్ సోర్సింగ్ విధానంలో అణగారినవర్గాలకు చెందిన 2 కోట్ల మందికి పైగా పనిచేస్తున్నారని, వారందరికీ ప్రభుత్వ జిఓల ప్రకారం న్యాయం చేయాలని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు.



## తెలంగాణ కులగణనపై టిజిఒ రాష్ట్ర కార్యదర్శి హర్షం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కులగణన చేపట్టినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి టిజిఓ అసోసియేషన్ ధన్యావాదాలు తెలిపింది. బిసిల రిపోర్టు తయారు చేసి దాన్ని ప్రభుత్వానికి అందచేసిన బిసి కమిషన్కు కృతజ్ఞతలు చెప్పింది. ఈ మేరకు కమిషన్ ఛైర్మన్ నిరంజన్, సభ్యులు జయప్రకాశ్, సురేందర్, బాల లక్ష్మిలను కలిసి కృతజ్ఞతలు చెప్పారు. కులగణన నిర్వహించడం మంచి నిర్ణయమని సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎ. సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా సంఘం అధ్యక్షుడు ఎం.బి. కృష్ణా యాదవ్, సెక్రటరీ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, చంద్రజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com